ప్రకటనల కోసం
సంప్రదించండి
98483 28698



తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

Estd : 2002

# జనంసాక్షి

www.janamsakshi.org

శనివారం 12.09.2026 | సంపుటి : 13 సంచిక : 54 | పేజీలు : 12 వెల : రూ. 4/-

RNI NO.TELTEL / 2013 /50370






హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్




## అనలాగ్ పనీర్‌పై నిషేధం

తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం

హైదరాబాద్(జనంసాక్షి): తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో అనలాగ్, నాన్ డెయిరీ, ఆర్టిఫిషియల్ పనీర్‌పై నిషేధం విధించింది. ప్రజారోగ్య ప్రయోజనాల దృష్ట్యా ఏడాది పాటు నిషేధం విధిస్తున్నట్లు టీజీ సేఫ్ వెల్లడించింది.

మిగతా 2లో..

ఇందిరమ్మ ఇళ్ల అనర్హులకు

## రూ.10 వేలు రిఫండ్



హైదరాబాద్(జనంసాక్షి): ఇందిరమ్మ ఇళ్ల పథకానికి అప్లై చేసి.. లిస్ట్‌లో పేరు రాలేదా? అయితే మీకు గుడ్ న్యూస్. అప్లికేషన్ సమయంలో డిపాజిట్‌గా చెల్లించిన రూ.10 వేల మొత్తాన్ని హౌసింగ్ బోర్డు తిరిగి దరఖాస్తుదారుల బ్యాంక్ ఖాతాల్లో జమ చేయనుంది. ఈ రిఫండ్ ప్రక్రియ నేటి నుంచి ప్రారంభం కానుందని హౌసింగ్ బోర్డు వర్గాలు వెల్లడించాయి.

మిగతా 2లో..

## విద్యావ్యవస్థకు నెప్రూ వేసిన పునాదులే..



### ప్రైవేటుకు దీటుగా ప్రీప్రైమరీ స్కూళ్లు

### విద్యార్థులపై పెట్టే ఖర్చును పెట్టుబడిగా భావిస్తున్నాం

- బడ్జెట్‌లో విద్యకు 15 శాతం కేటాయించాలనేదే నా లక్ష్యం
- విద్యారంగంలో ఉత్తమ విధానాలు తీసుకురావడం కోసం కృషిచేస్తున్నాం
- 2026-27లో రూ.27,663 కోట్లు కేటాయించాం
- అసెంబ్లీలో విద్యాశాఖపై జరిగిన చర్చలో ముఖ్యమంత్రి రేవంత్

హైదరాబాద్(జనంసాక్షి): బడ్జెట్‌లో విద్యకు 15 శాతం నిధులు కేటాయించాలనేదే తన లక్ష్యమని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. అందరూ జెన్‌జీ గురించి అలోచిస్తుంటే తాను జెన్ ఆల్ఫా, జెన్ బీటా గురించి కూడా ఆలోచిస్తున్నానన్నారు. దేశం భవిష్యత్ తరగతి గదుల్లో ఉందని సంపూర్ణంగా విశ్వసించానని తెలిపారు. ప్రపంచంలోనే ఉత్తమ విద్యా విధానాలను రాష్ట్రానికి తీసుకొస్తున్నామని పేర్కొన్నారు. కొంతమంది దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. శాసనసభ సమావేశాల్లో భాగంగా విద్యాశాఖపై జరిగిన చర్చలో సీఎం మాట్లాడారు.

**ఏడాదిలో విద్యకు రూ.27,663 కోట్లు**

2023-24 ఆర్థిక సంవత్సరంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో విద్యకు రూ.18,955 కోట్లు కేటాయిస్తే 2025-26లో కాంగ్రెస్ ప్రభుత్వం రూ.23,729 కోట్లు, 2026-27లో రూ.27,663 కోట్లు కేటాయించిందని రేవంత్ రెడ్డి తెలిపారు. పేదలకు మేలు జరగాలనే కీలకమైన విద్యాశాఖను తన వద్ద ఉంచుకున్నానని పేర్కొన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వ విద్యాసంస్థలు 28,163 ఉన్నాయని, 28.77 లక్షల మంది విద్యార్థులు వాటిలో చదువుతున్నారని రేవంత్ రెడ్డి తెలిపారు. ఈ మూడేళ్లలో విద్యాశాఖపై రూ.7,554 కోట్లు అదనంగా ఖర్చు పెట్టామని రేవంత్ రెడ్డి వివరించారు. విద్యా హక్కు చట్టం ప్రకారం 30 మంది విద్యార్థులకు ఒక టీచర్ ఉండాలని కానీ, తెలంగాణలో మాత్రం 17 మంది విద్యార్థులకు ఒక టీచర్ ఉన్నారని రేవంత్ రెడ్డి తెలిపారు. తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే 11 వేల ఉపాధ్యాయ

మిగతా 2లో..

## ప్రశ్నిస్తామనే సస్పెండ్ చేశారు

- దేశ చరిత్రలోనే అతిపెద్ద భూదోపిడి తెలంగాణలో జరుగుతోంది
- భూకుంభకోణం బయట పెట్టినందుకే మంత్రిని బర్తరఫ్ చేశారు
- తెలంగాణ భవన్‌లో 22ఏ నిషేధిత బాధితులతో కేటీఆర్ సమావేశం
- 22ఏ పొరపాటు కాదు.. దురుద్దేశంతో చేసిన దుర్మార్గం: హరీశ్

హైదరాబాద్(జనంసాక్షి): దేశ చరిత్రలోనే అతిపెద్ద భూదోపిడి తెలంగాణలో జరుగుతోందని మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఆరోపించారు. తెలంగాణ భవన్‌లో 22ఏ నిషేధిత బాధితులతో బీఆర్‌ఎస్ నేతలు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. "మా ప్రభుత్వంలో 16 లక్షల ఎకరాలుగా

మిగతా 2లో..



## జనగణనలో కులగణన తప్పనిసరి



### ఈ మేరకు తెలంగాణ శాసనసభ తీర్మానం

- ఈ అంశంపై మంత్రులు, బీజేపీ సభ్యుల మధ్య శాసనసభలో వాడీవేడీ చర్చ
- బీసీ డిక్లరేషన్ అమలు చేస్తామని చెప్పి మోసం చేశారంటూ బీజేపీ సభ్యుల వాకౌట్
- ఈ ప్రక్రియతోనే బలహీన వర్గాలకు న్యాయం..
- దేశ సంపద సమాన పంపిణీకి మార్గం
- తెలంగాణ తరహాలో దేశవ్యాప్తంగా సర్వే చేయాలి
- వచ్చే ఎన్నికల్లో రాహుల్ గాంధీ ప్రధాని అవుతారు
- అసెంబ్లీలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

హైదరాబాద్(జనంసాక్షి): జనగణనలో భాగంగా పక్కాగా కులగణన చేపట్టాలంటూ శాసనసభ తీర్మానం చేసింది. ఓపెన్ కాలమ్ పెట్టడం వల్ల ఓబీసీల సంఖ్యపై స్పష్టత రాదని ప్రతి కులానికి కోడ్ కేటాయించాలని కేంద్రాన్ని కోరింది. ఈ అంశంపై చర్చ సందర్భంగా మంత్రులు, బీజేపీ సభ్యుల మధ్య వాడీవేడి చర్చ జరిగింది. జనగణనలో కులగణనకు అనుకూలమా? కాదా? ఏదో ఒకటి చెప్పాలని బీజేపీని అధికార పార్టీ నిలదీయగా బీసీ డిక్లరేషన్ అమలు చేస్తామని

మిగతా 2లో..

## పాలిటెక్నిక్‌ను ప్రైవేటీకరించం

జీవో నంబర్ 97లో మార్పులు తెచ్చేందుకు సిద్ధంగా ఉన్నాం: మంత్రి వివేక్

2లో

## హైదరాబాద్‌లో పరిశ్రమలు నెలకొల్పేందుకు ఐటీ సంస్థల ఆసక్తి

మంత్రి శ్రీధర్‌బాబు

2లో

## పురపాలక పాలనలో ట్రాన్స్‌జెండర్లు..

కో-ఆప్షన్ సభ్యులుగా వారికి అవకాశం

అసెంబ్లీలో కీలక బిల్లుకు ఆమోదం

## ఆర్మీ ఆయుధాలు ఎత్తుకెళ్లింది ఇంటి దొంగే..

### మిస్టరీ చేధించిన పోలీసులు

- ఆర్మీ ఆయుధాలను గుంత తీసి పాతిపెట్టిన హవల్దార్..
- కేసులో నలుగురు నిందితుల అరెస్ట్
- వివరాలు వెల్లడించిన డీజీపీ సీవీ ఆనంద్





హైదరాబాద్(జనంసాక్షి): దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన సికింద్రాబాద్ బొల్లారంలోని మద్రాస్ రెజిమెంట్‌లో ఆర్మీ ఆయుధాల చోరీ కేసు ఓ కొలిక్కి వచ్చినట్లు తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్ తెలిపారు. ఈ మేరకు మీడియా సమావేశం నిర్వహించి వివరాలను వెల్లడించారు. "ఆగస్టు 31న మద్రాస్ రెజిమెంట్‌లోని బెల్ ఆఫ్ ఆర్మ్స్‌లో ఆయుధాల చోరీ జరిగింది. పిస్టల్స్, మ్యాగజైన్లు, బుల్లెట్స్, బైనాక్యులర్ చోరీ చేశారు. బ్రిగేడియర్ ఫిర్యాదు మేరకు బొల్లారం పీఎస్‌లో కేసు నమోదు చేశాం. 12 ఆయుధాలు, బుల్లెట్లు, బైనాక్యులర్‌ను చోరీ చేశారు. బెల్ ఆఫ్ ఆర్మ్స్‌లోకి ఎవరెవరికి అనుమతి ఉందని విచారించాం. ఆర్మ్స్ కోట్ ఇన్‌ఛార్జ్ వినోద్‌కుమార్‌తో పాటు ఆమ్యునేషన్స్ కోర్టు (ఆయుధాగారం) ఇన్‌ఛార్జ్ బల్లి మధులను అనుమానితులుగా విచారించాం. ఎలాంటి ఆధారాలు దొరకలేదు. అనంతరం హవల్దార్లుగా పనిచేసిన ప్రకాశం జిల్లాకు చెందిన టీపీఎస్ రావు, నాగర్‌కర్నూల్ జిల్లాకు చెందిన మల్లేశ్ అలియాస్ రాజును విచారించాం. మా దగ్గర ఉన్న ఆధారాలతో మల్లేశ్ కదలికల గురించి ప్రశ్నించాం. కదలికల గురించి వాస్తవాలు చెప్పకుండా అతడు దాచిపెట్టాడు. తొలుత విచారణ కోసం మేం పిలిస్తే రాలేదు.

మిగతా 9లో..

## మహిళా ఎమ్మెల్యేల పట్ల నీచంగా వ్యవహరించారు

- అసెంబ్లీకి వెళ్తుంటే యుద్ధ వాతావరణం సృష్టించారు
- ముఖ్యమంత్రి రేవంత్ డైరెక్షన్‌లోనే అంతా జరిగింది
- తెలంగాణలో దేశంలోనే ఎక్కడాలేని విధంగా కౌరవసభ
- జాతీయ మహిళా కమిషన్‌కు సబితా ఇంద్రారెడ్డి ఫిర్యాదు

న్యూఢిల్లీ,సెప్టెంబర్ 11(జనంసాక్షి): తెలంగాణ అసెంబ్లీ ముట్టడి సందర్భంగా బీఆర్‌ఎస్ మహిళా ఎమ్మెల్యేలపై పోలీసులు విచక్షణారహితంగా దాడి చేశారని ఆరోపిస్తూ మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ఢిల్లీ వేదికగా తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. ఈ ఘటనపై ఆమె జాతీయ మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్‌తో పాటు జాతీయ మానవ హక్కుల కమిషన్ సభ్యులకు ఫిర్యాదు చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడిన ఆమె, తెలంగాణ అసెంబ్లీ గేటు వద్ద జరిగిన ఘటనలు దేశంలోనే ఎక్కడాలేని విధంగా కౌరవసభను తలపించాయని మండిపడ్డారు. ప్రజాస్వామ్యంలో

మిగతా 2లో..



## ప్రేమపెళ్లికి కులదురహంకార పంజా

### దళితుడిని పెళ్లాడిందని.. వరుడి ఇంటినే జేసీబీతో నేలమట్టం



కులం ఎక్కడుంది అంటారా..? జేసీబీ పంజాలో కనిపించింది! మనిషి నడిచిన దారిని శుద్ధి చేసే వివక్ష.. టీకి వేరే కప్పులు.. నీటికి వేరే బావులు.. నీటి ప్రవాహానికే కులాల గీతలు.. ఇవన్నీ గతకాలపు చీకటి జ్ఞాపకాలే అనుకుంటే పొరపాటే. మనువాదపు విషం ఆధునిక యుగంలోనూ నరనరాన బుసలు కొడుతూనే ఉంది. దానికి నిదర్శనమే గద్వాల జిల్లా రేపల్లెలో జరిగిన ఈ ఘోర విధ్వంసం.దళిత యువకుడిని ప్రేమించి పెళ్లి చేసుకుందన్న అక్కసుతో యువతి కుటుంబ సభ్యులు, బంధువులు ఏకంగా పెళ్లికొడుకు ఇంటినే జేసీబీ, ట్రాక్టర్లు, గడ్డపారలతో నేలమట్టం చేశారు. ప్రేమను ఎదుర్కొనే ధైర్యం లేక ఇంటి గోడలపై కుల దురహంకారం జేసీబీ పంజా విసిరింది. గోడలు కూలాయి.. కానీ కుల దురహంకారపు అసలు ముఖం మాత్రం సమాజం ముందు నిలిచిపోయింది.

### మేజర్లైన జంటకు పోలీసుల రక్షణ.. అయినా మరుసటి రోజే విధ్వంసకాండ


గద్వాల, సెప్టెంబర్ 11 (జనంసాక్షి): రేపల్లె గ్రామానికి చెందిన రంగముని (ఎస్సీ), మహేశ్వరి (బోయబీసీ) గత రెండేళ్లుగా ప్రేమించుకుంటున్నారు. ఇద్దరూ మేజర్లు కావడంతో బుధవారం హైదరాబాద్‌లోని ఆర్యసమాజ్‌లో వివాహం చేసుకున్నారు. అనంతరం తమకు ప్రాణహాని ఉందని భావించి రక్షణ కోరుతూ హైదరాబాద్‌లోని ఓ పోలీస్‌స్టేషన్‌ను ఆశ్రయించారు. పోలీసులు

మిగతా 2లో..

ద్వైపాక్షిక అంశాలపై

## మోదీ పుతిన్ భేటీ

- కీలక రక్షణ ఒప్పందాలపై సంప్రదింపులు
- 2030 నాటికి ఇరుదేశాల మధ్య 100 బిలియన్ డాలర్ల వాణిజ్యమే లక్ష్యం
- ఐటీ, ఏఐ రంగాల్లో భారత్ దూసుకెళ్తోంది: పుతిన్
- ప్రపంచంలో 'బ్రిక్స్'కు ప్రాధాన్యత పెరుగుతోంది
- అస్థిర పరిస్థితుల్లోనూ సుస్థిరంగా భారత్.. : మోదీ
- అభివృద్ధి, సుస్థిరతకు చిరునామాగా భారత్..
- రష్యా-ఉక్రెయిన్ సంక్షోభం ముగింపు శాంతి ప్రయత్నాల్లో సాయానికి సిద్ధమని వెల్లడి




న్యూఢిల్లీ(జనంసాక్షి): బ్రిక్స్ కూటమి 18వ శిఖరాగ్ర సదస్సులో భాగంగా మూడు రోజుల పర్యటన కోసం భారత్‌కు వచ్చిన రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో ప్రధాని మోదీ భేటీ అయ్యారు. దిల్లీలోని భారత మండపంలో జరిగిన ఈ సమావేశంలో ద్వైపాక్షిక అంశాలపై ఇరువురు నేతలు చర్చించారు. ఈ సందర్భంగా కీలకమైన రక్షణ ఒప్పందాలపై సంప్రదింపులు జరిపినట్లు తెలుస్తోంది. 2030 నాటికి ఇరుదేశాల మధ్య 100 బిలియన్ డాలర్ల వాణిజ్యమే లక్ష్యంగా చర్చలు కొనసాగినట్లు సమాచారం.

**సాయానికి భారత్ సిద్ధం..**

వీటితోపాటు రాజకీయ, ఆర్థిక, రక్షణ, ఇంధనం, అంతరిక్షం, ప్రజల మధ్య సంబంధాలకి సంబంధించిన రంగాల్లో ద్వైపాక్షిక సహకార పురోగతిని ఇరువురు నేతలు సమీక్షించారు. ఈ సందర్భంగా ఉక్రెయిన్ సంక్షోభాన్ని మోదీ ప్రస్తావించినట్లు సమాచారం. చర్చలు, దౌత్యమార్గాల ద్వారానే వీటిని పరిష్కరించుకోవాలని ఉద్ఘాటించిన ఆయన.. ఈ సంక్షోభం ముగింపు కోసం జరిగే శాంతి ప్రయత్నాలకు

మిగతా 2లో..

## 'ఎఫ్‌టీఎల్'పై రాజీ పడబోం



### • చెరువుల హద్దులకు అది రక్షణ కవచం • మత్స్యకారుల బతుకులకు భరోసా

- అన్ని చెరువులకు పరిరక్షణ కమిటీల ఏర్పాటు
- ఇప్పటికే 44 వేల చెరువులకు జియో ట్యాగింగ్
- పీడీఎస్‌లో అదనపు నిత్యావసర సరుకుల పంపిణీపై సానుకూల పరిశీలన
- శాసనమండలిలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి
- 'నెల్లికల్ ఎత్తిపోతల'పై సభాముఖంగా హామీ

హైదరాబాద్, సెప్టెంబర్ 11(జనంసాక్షి): చెరువు నిండితే పల్లె పచ్చబడుతుందని, మత్స్యకారుడి వల నిండితే అతని కుటుంబంలో వెలుగులు విరుస్తాయని, అందుకే చెరువులు, కుంటలు, ఇతర జలవనరుల పరిరక్షణతోపాటు వాటిపై ఆధారపడి జీవిస్తున్న మత్స్యకారుల జీవనోపాధిని కాపాడటాన్ని ప్రభుత్వం అత్యంత ప్రాధాన్య అంశంగా భావిస్తోందని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. చెరువుల పూర్తి నీటిమట్టం ఫుల్ ట్యాంక్ లెవల్ (ఎఫ్‌టీఎల్) హద్దులను ఎట్టి పరిస్థితుల్లోనూ కాపాడుతామని, జలవనరుల ఆక్రమణలను ఉపేక్షించబోమని ఆయన శాసన మండలి వేదికగా ప్రకటించారు. శుక్రవారం శాసన మండలిలో జరిగిన చర్చ సందర్భంగా సభ్యులు లేవనెత్తిన అంశాలకు మంత్రి సమాధానమిచ్చారు. చెరువుల ఎఫ్‌టీఎల్ హద్దులు దెబ్బతిన్నా, జలవనరులు ఆక్రమణలకు గురైనా, వాటిపై ఆధారపడి జీవించే మత్స్యకార కుటుంబాలకు నష్టం వాటిల్లినా ప్రభుత్వం తీవ్రంగా పరిగణిస్తుందని చెప్పారు. సభ దృష్టికి తీసుకొచ్చిన నిర్దిష్ట సమస్యను నీటిపారుదల శాఖ అధికారులు స్వయంగా క్షేత్రస్థాయిలో పరిశీలించాలని మంత్రి ఆదేశించారు. వారం రోజుల్లోగా సంబంధిత చెరువును సందర్శించి, జలవనరుల పరిరక్షణకు చేపట్టాల్సిన చర్యలు, స్థానిక మత్స్యకారుల సమస్యల


మిగతా 2లో..

## బహ్రెయిన్‌పై విరుచుకుపడ్డ ఇరాన్

### అమెరికా నేవీ కీలక స్థావరం ధ్వంసం

టెహ్రాన్(జనంసాక్షి): ఇరాన్-అమెరికా మధ్య దాడులు మళ్లీ ప్రారంభమవడంతో పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి. అగ్రరాజ్య దాడులకు ప్రతిస్పందనగా గల్ఫ్ దేశాలలోని వివిధ అమెరికా స్థావరాలపై టెహ్రాన్ విరుచుకుపడుతోంది. తాజాగా బహ్రెయిన్ లోని అమెరికా ఫిఫ్త్ ఫ్లీట్ ప్రధాన కార్యాలయంపై దాడులకు పాల్పడింది. ఈ దాడుల్లో తమ కీలక స్థావరమైన నేవల్ సపోర్ట్ యాక్టివిటీ బహ్రెయిన్ తీవ్రంగా దెబ్బతిన్నట్లు యూఎస్ నేవీ తాత్కాలిక కార్యదర్శి హంగ్‌కావో పేర్కొన్నారు. పశ్చిమాసియాలో అమెరికా నౌకాదళ కార్యకలాపాలకు ఎన్‌ఎఎస్‌బీ ప్రధాన లాజిస్టిక్స్ కేంద్రంగా పనిచేస్తోంది. ఫిబ్రవరిలో అమెరికా-ఇరాన్

మిగతా 9లో..



## ప్రశ్నిస్తామనే సస్పెండ్ చేశారు

ఉన్న నిషేధిత జాబితా ఇప్పుడు కోటి 16 లక్షల ఎకరాలకు చేరింది. ప్రభుత్వంలో ఇటీవల ఒక మంత్రి బర్తరఫ్ అయ్యారు. ఎందుకంటే, సీఎం రేవంత్ సోదరులు మంచిరేవులలో చేస్తున్న భూకుంభకోణాన్ని ఆ మంత్రి కుమార్తె బయటపెడితే చివరకు ఆ వ్యవహారం చినికి చినికి గాలివానలా మారింది" అని అన్నారు. ఈ వార్త చదివారా: 22ఏ పొరపాటు కాదు.. దురుద్దేశంతో చేసిన దుర్మార్గం: హరీశ్‌రావు

**22ఏ పొరపాటు కాదు.. దురుద్దేశంతో చేసిన దుర్మార్గం: హరీశ్‌రావు**

దశాబ్దాల క్రితం లేఅవుట్లయిన భూములు నిషేధ జాబితాలోకి వెళ్లాయని బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్‌రావు ఆరోపించారు. భూ భారతి పేరిట భూహారతికి పాల్పడుతున్నారని విమర్శించారు. తెలంగాణ భవన్‌లో 22ఏ బాధితులతో బీఆర్ఎస్ సమావేశం నిర్వహించింది. ఈ కార్యక్రమంలో హరీశ్‌రావు మాట్లాడారు. "ఫోన్ చేస్తే సమస్య పరిష్కారమవుతుందన్నారు. రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని స్వయంగా కలిసినా ఫలితం లేదు. 22ఏ పొరపాటు కాదు.. దురుద్దేశంతో చేసిన దుర్మార్గం. కేసీఆర్ నాయకత్వంలో పోరాడి ప్రభుత్వం మెడలు వంచుతాం. తప్పు కప్పిపుచ్చుకునేందుకు బీఆర్ఎస్‌పై నెపం నెడుతున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి భూమే కేంద్రంగా పాలన చేస్తున్నారు. 30 వేల ఎకరాల పాలిటెక్నిక్ భూములపై కన్నేశారు. హైడ్రాకు బడాబాబులు కనిపించరు.. పేదలపైనే వారి ప్రతాపం. పొంగులేటికి నైతిక బాధ్యత ఉంటే వెంటనే పదవికి రాజీనామా చేయాలి. 22ఏ నుంచి సీఎం ఇల్లు తొలగించినప్పుడు సామాన్యులవి ఎందుకు తీయడం లేదు?అధికారులు తప్పు చేస్తే ఎందుకు చర్యలు తీసుకోలేదు?వెంటనే 22ఏ జాబితా నుంచి ప్రజల ఆస్తుల్ని తొలగించాలి. 30 శాతం కమిషన్ వ్యవహారంపై జ్యుడీషియల్ విచారణ చేయాలి. సీఎం రేవంత్‌రెడ్డికి తెలిసే అంతా జరిగింది. దీనిలో మొదటి ముద్దాయి రేవంత్, రెండో ముద్దాయి పొంగులేటి. నిషేధిత జాబితా నుంచి ప్రజల ఆస్తులు తొలగించే వరకు పోరాటం కొనసాగిస్తాం" అని హరీశ్‌రావు అన్నారు.

## ఇందిరమ్మ ఇళ్ల అనర్హుల ఖాతాల్లో రూ.10 వేలు రిఫండ్

ఇందిరమ్మ ఇళ్ల కోసం అప్లై చేసే సమయంలో ప్రతి ఒక్కరి నుంచి రూ.10 వేల చొప్పున ధరావతు మొత్తాన్ని తీసుకున్న విషయం తెలిసిందే. అయితే దరఖాస్తులను వివిధ శాఖల రికార్డులతో క్రాస్ చెక్ చేసిన అధికారులు.. అర్హత లేని దరఖాస్తులను గుర్తించారు.హైదరాబాద్‌లోని 16 నియోజకవర్గాల పరిధిలో ఇందిరమ్మ ఇళ్ల కోసం మొత్తం 60,720 దరఖాస్తులు వచ్చాయి. వీటిని రెవెన్యూ, రవాణా, జీహెచ్ఎంసీ తదితర శాఖల నుంచి సేకరించిన వివరాలతో అధికారులు వెరిఫై చేశారు. ఈ వెరిఫికేషన్‌లో భాగంగా 360 డిగ్రీల తనిఖీ చేపట్టిన హౌసింగ్ బోర్డు.. తొలి దశలోనే సుమారు 40 వేల దరఖాస్తులను అనర్హమైనవిగా గుర్తించింది. దీంతో అర్హత సాధించని వారికి వారు ముందుగా చెల్లించిన రూ.10 వేల మొత్తాన్ని తిరిగి చెల్లించేందుకు చర్యలు చేపట్టింది. ఇందిరమ్మ ఇళ్లకు ఎంపికైన లబ్ధిదారుల్లో కొందరు అప్లికేషన్ సమయంలో తమ మొబైల్ నంబర్లను తప్పుగా నమోదు చేసినట్లు అధికారులు గుర్తించారు. దీంతో ఫోన్ నంబర్ మార్చుకునే అవకాశం కల్పించాలని పలువురు లబ్ధిదారులు కోరారు. దీనిపై స్పందించిన అధికారులు తెలంగాణ హౌసింగ్ బోర్డు అధికారిక వెబ్‌సైట్‌లోనే మొబైల్ నంబర్ అప్‌డేట్ చేసుకునే సదుపాయాన్ని అందుబాటులోకి తీసుకొచ్చారు. ఎంపికైన లబ్ధిదారులు తమ దరఖాస్తు నంబర్ లేదా ఆధార్ నంబర్ ఉపయోగించి అప్లికేషన్‌లోకి వెళ్లి వివరాలను మార్చుకోవచ్చు. మరోవైపు హైదరాబాద్‌లో ఇందిరమ్మ ఇళ్లకు ఎంపికైన కుటుంబాలపై క్షేత్రస్థాయి సర్వే కొనసాగుతోంది. ఇప్పటివరకు సుమారు 5,500 కుటుంబాలను అధికారులు నేరుగా పరిశీలించినట్లు సమాచారం.

## విద్యావ్యవస్థకు నెహ్రూ వేసిన పునాదులే..

ఉద్యోగాలు భర్తీకి నోటిఫికేషన్ ఇచ్చామని గుర్తుచేశారు. 55 రోజుల్లో 10,600 మందికి ఉపాధ్యాయ నియామక పత్రాలు అందజేశామన్నారు. ఏ చిన్న ఆరోపణ కూడా లేకుండా డీఎస్సీ నియామక ప్రక్రియ పూర్తి చేశామని రేవంత్ రెడ్డి పునరుద్ఘాటించారు. 10ఏళ్లపాటు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ 7,857 మంది టీచర్లను నియమించిందని రేవంత్ రెడ్డి చెప్పారు. వచ్చే ఏడాది రాష్ట్రానికి హార్వర్డ్ వర్సిటీ రాబోతోందన్నారు. లండన్ వర్సిటీ, నార్త్ ఈస్టర్న్, వర్జీనియా వర్సిటీలూ రాబోతున్నాయని రేవంత్ రెడ్డి వెల్లడించారు.విద్యార్థులపై పెట్టే ఖర్చును పెట్టుబడిగా భావిస్తున్నామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. జెన్ జీతో పాటు జెన్ ఆల్ఫా, జెన్ బీటా గురించి ఆలోచిస్తున్నానని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. రాష్ట్రంలో విద్యా విధానంలో మార్పులపై అసెంబ్లీలో జరుగుతున్న చర్చలో సీఎం పాల్గొన్నారు. ప్రపంచంలో అత్యుత్తమ విధానాలను తీసుకొస్తున్నామని రేవంత్ తెలిపారు.ప్రభుత్వ విద్యాసంస్థల్లో ఒక్కో విద్యార్థిపై ఏడాదికి సగటున రూ.1.08 లక్షలు ఖర్చు చేస్తున్నామని వివరించారు. పట్టాలు తప్పిన విద్యావ్యవస్థను పట్టాలెక్కించే ప్రయత్నం చేస్తున్నామన్న ఆయన, రెండేళ్లలో ఎంతో కొంత మెరుగుపడిందన్నారు. 'సాధ్యమైతే సహకరించండి లేకుంటే వదిలేయండి చులకన చేయవద్దు' అని ప్రతిపక్షాలకు సీఎం హితవు పలికారు. ప్రీప్రైమరీ లేకపోవడం వల్లే ప్రభుత్వ స్కూళ్లు దెబ్బతింటున్నాయన్నారు. ప్రీప్రైమరీ విద్య కోసం పిల్లలను ప్రైవేట్ స్కూళ్లకు పంపిస్తున్నారన్నారు. కొన్ని అపోహల వల్ల పేదలు కూడా ప్రైవేట్ స్కూళ్లకు పంపిస్తున్నారని వివరించారు. ఇంగ్లీష్ విద్య కోసం ప్రైవేట్ స్కూళ్లకు పంపిస్తున్నారని తెలిసిందని రేవంత్ రెడ్డి అన్నారు. అందుకే తొలిసారిగా ప్రభుత్వ స్కూళ్లలో ప్రీప్రైమరీ విద్యను ప్రవేశపెట్టామని చెప్పారు. ఈ ఏడాది 4,100 స్కూళ్లలో 64వేల మంది పిల్లలకు ప్రీప్రైమరీ విద్య అందిస్తున్నామని పేర్కొన్నారు. విద్యార్థులతో పాటు సిబ్బందికీ మధ్యాహ్న భోజనం, బ్రేక్‌ఫాస్ట్ ఇస్తున్నామని తెలిపారు. విద్యార్థులకు పౌష్టికాహారం కోసం రూ. 927కోట్లు ఖర్చు చేస్తున్నామని తెలిపారు.

## జనగణనలో కులగణన తప్పనిసరి

చెప్పి మోసం చేశారంటూ ఆ పార్టీ సభ్యులు సభ నుంచి వాకౌట్ చేశారు.కాంగ్రెస్, బీజేపీ మధ్య వాడీవేడి చర్చకేంద్రం చేపట్టిన జనగణనలో కులగణనను శాస్త్రీయంగా చేయాలంటూ అసెంబ్లీలో ప్రభుత్వం తీర్మానం చేసింది. ఈ అంశంపై అధికార పార్టీ సభ్యులు చర్చను ప్రారంభించారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం కులగణన చేపట్టడం వల్లే కేంద్రంలో మోదీ సర్కార్ కూడా ఒప్పుకోవాల్సి వచ్చిందని అన్నారు.కులగణనలో ఓపెన్ కాలమ్ పెట్టడం వల్ల ఓబీసీ జనాభాపై కచ్చితమైన గణాంకాలు తెలిసే అవకాశం లేదని కాంగ్రెస్ సభ్యులు పేర్కొన్నారు. బీజేపీ తరపున మాట్లాడిన పాయల్ శంకర్ దేశాన్ని ఎక్కువకాలం పాలించిన కాంగ్రెస్ ఎందుకు కులగణన చేపట్టలేదని ప్రశ్నించారు. బీజేపీ ఎమ్మెల్యే పాయల్ శంకర్ వ్యాఖ్యల్ని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఖండించారు. రాష్ట్రంలో చేపట్టిన కులగణన కనిపించడం లేదా అని నిలదీశారు.

సభ నుంచి వాకౌట్ చేసిన బీజేపీ

బీసీ డిక్లరేషన్ అమలు చేస్తామని అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఆ తర్వాత మోసం చేసిందని పాయల్ శంకర్ విమర్శించగా మంత్రులు వాకిటి శ్రీహరి, పొన్నం ప్రభాకర్ తీవ్రంగా ఖండించారు. ఈ క్రమంలో బీజేపీ-ఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్ మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. బీసీ మంత్రి కొండా సురేఖను బర్తరఫ్ చేసిన మీరా మాట్లాడేదని ఏలేటి విమర్శించగా బండి సంజయ్‌ను అధ్యక్షుడిగా ఎందుకు తొలగించారని పొన్నం ప్రశ్నించారు.జనగణనలో కులగణనకు అనుకులమా.? వ్యతిరేకమా? ఏదో ఒకటి చెప్పాలని మంత్రి శ్రీధర్‌బాబు బీజేపీని డిమాండ్ చేశారు. బీసీ సబ్ ప్లాన్‌ను అమలు చేయనుందుకు నిరసనగా బీజేపీ వాకౌట్ చేయగా మంత్రి పొన్నం ప్రభాకర్ ఆ పార్టీ తీరును తీవ్రంగా ఖండించారు. అనంతరం జనగణనలో భాగంగా కులగణన చేపట్టాలని ఓపెన్ కాలమ్ కాకుండా ఓబీసీలకు ప్రతి కులానికి ఒక కోడ్ కేటాయించాలని కేంద్రాన్ని కోరుతూ శాసనసభ తీర్మానాన్ని ఆమోదించింది.

**తెలంగాణ కులగణన సర్వే దేశానికే ఆదర్శం :డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క**

దేశంలో సామాజిక అసమానతలను తొలగించి బలహీన వర్గాలకు న్యాయం చేయాలంటే జనగణనలో కులగణనను తప్పనిసరిగా చేర్చాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. కులగణన చేద్దామా? వద్దా? అనే విషయాన్ని బీజేపీ సభ్యులు సూటిగా చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వహించిన సామాజిక, ఆర్థిక, రాజకీయ సర్వే ను దేశానికి ఆదర్శంగా తీసుకుని, దేశవ్యాప్తంగా కూడా ఇలాంటి సమగ్ర సర్వే నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్ర అసెంబ్లీలో జనగణన, కులగణన అంశంపై జరిగిన చర్చలో ఆయన మాట్లాడుతూ.. కులగణన అనేది కులాలకు, రాజకీయ పార్టీలకు సంబంధించిన అంశం కాదని, సమాజ శ్రేయస్సుకు సంబంధించిన విషయమని పేర్కొన్నారు. సమాజంలో నెలకొన్న అసమానతలను సరిచేయాలంటే ముందుగా వాటి తీవ్రతను, స్వభావాన్ని తెలుసుకోవాల్సి ఉంటుందని, అందుకు కులగణన ఎంతో కీలకమని అన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రవ్యాప్తంగా సామాజిక, ఆర్థిక, రాజకీయ పరిస్థితులపై సమగ్ర సర్వే నిర్వహించిందని భట్టి తెలిపారు. రాష్ట్రంలో ఏ కులానికి ఎంత జనాభా ఉంది, వారి వృత్తులు ఏమిటి, ఆర్థిక పరిస్థితి ఎలా ఉంది, ఎంతమంది చదువుకున్నారు, ఎంతమంది ఉద్యోగాల్లో ఉన్నారు, ఎంతమంది నిరుద్యోగులు, భూమి ఉన్నవారు ఎంతమంది, లేనివారు ఎంతమంది వంటి అనేక అంశాలను కూలంకషంగా సేకరించామని చెప్పారు. ప్లానింగ్ శాఖను పర్యవేక్షిస్తున్న డిప్యూటీ సీఎంగా తాను ప్రతిరోజూ ఈ ప్రక్రియను సమీక్షిస్తూ, ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా సర్వేను నిర్వహించామని తెలిపారు. తెలంగాణలో నిర్వహించిన ఈ సర్వే దేశానికే ఆదర్శంగా నిలిచిందని పేర్కొన్నారు. సర్వే నివేదికను అసెంబ్లీలో ప్రవేశపెట్టినప్పుడు ప్రతిపక్ష సభ్యులు సైతం అభినందించారని గుర్తుచేశారు.దేశమంతా తెలంగాణ మోడల్ కావాలి తెలంగాణలో జరిగిన సర్వే తరహాలో దేశవ్యాప్తంగా కులగణన నిర్వహించాలని కాంగ్రెస్ పార్టీ మొదటి నుంచి డిమాండ్ చేస్తోందని భట్టి తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీకి వెళ్లి పార్లమెంట్‌లోని వివిధ పార్టీల నాయకులతో పాటు ప్రధానమంత్రిని కూడా కలిసి దేశవ్యాప్తంగా కులగణన నిర్వహించాలని విజ్ఞప్తి చేశారని చెప్పారు. మంత్రులు కూడా ఈ అంశంపై కేంద్రంపై ఒత్తిడి తెచ్చారని వివరించారు. అయినప్పటికీ కేంద్రం నుంచి ఆశించిన విధంగా స్పందన రాకపోవడంతో ఢిల్లీలో అన్ని రాజకీయ పార్టీలను ఆహ్వానించి సమావేశం నిర్వహించి, తెలంగాణలో అమలు చేసిన విధానాన్ని వివరించామని తెలిపారు.

## పాలిటెక్నిక్‌ను ప్రైవేటీకరించం

హైదరాబాద్: త్వరలోనే పాలిటెక్నిక్ విద్యార్థులకు గుడ్‌న్యూస్ చెబుతామని తెలంగాణ మంత్రి వివేక్ తెలిపారు. జీవో నంబర్ 97లో మార్పులు తెచ్చేందుకు సిద్ధంగా ఉన్నామని చెప్పారు. శాసనసభలో విద్యాసంస్కరణలపై జరిగిన చర్చలో ఆయన మాట్లాడారు."పాలిటెక్నిక్ విద్యను రూ.8వేల కోట్లతో ఆధునికీకరించాలని భావిస్తున్నాం. పాలిటెక్నిక్ విద్య ప్రైవేటీకరణ అవుతుందని అపోహలు ఉన్నాయి. ఇది ప్రభుత్వ అధీనంలోనే ఉంటుంది. ఏఐసీటీఈ సర్టిఫికెట్ కొనసాగుతుందని విద్యార్థులకు చెప్పాం. ఇంజినీరింగ్‌లో లేటరల్ ఎంట్రీ ఉంటుందని వివరించాం. కొత్త కోర్సులపై అధ్యాపకులకు శిక్షణ ఇస్తాం" అని వివేక్ వివరించారు.

## పురపాలక పాలనలో ట్రాన్స్‌జెండర్లు..

హైదారాబాద్, సెప్టెంబర్ 11(జనంసాక్షి): తెలంగాణ ప్రభుత్వం మరో చరిత్రాత్మక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలోని మున్సిపల్ కార్పొరేషన్లలో ట్రాన్స్‌జెండర్లకు కో-ఆప్షన్ సభ్యులుగా ప్రాతినిధ్యం కల్పించే బిల్లుకు శాసనసభ శుక్రవారం ఆమోదం తెలిపింది. ఈ నిర్ణయంతో పురపాలక పరిపాలనలో, విధాన నిర్ణయాల్లో ట్రాన్స్‌జెండర్ల భాగస్వామ్యానికి మార్గం సుగమమైంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తరపున రాష్ట్ర శాసనసభా వ్యవహారాల మంత్రి డి. శ్రీధర్ బాబు 'తెలంగాణ మున్సిపాలిటీల (నాలుగో సవరణ) బిల్లు, 2026'ను సభలో ప్రవేశపెట్టారు. 2019 నాటి తెలంగాణ మున్సిపాలిటీల చట్టానికి ఈ బిల్లు సవరణలు ప్రతిపాదిస్తుంది. దీని ప్రకారం, హైదరాబాద్ కోర్ అర్బన్ రీజియన్ (క్యూర్) వెలుపల ఉన్న తొమ్మిది మున్సిపల్ కార్పొరేషన్లలో ఒక్కో ట్రాన్స్‌జెండర్‌ను నామినేటెడ్ సభ్యునిగా కో-ఆప్ట్ చేసుకునే అవకాశం కలుగుతుంది. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ, సామాజిక వివక్ష, వెలికి గురవుతున్న ట్రాన్స్‌జెండర్లను ప్రధాన స్రవంతిలోకి తీసుకురావడంతో పాటు, ప్రజా జీవితంలో వారి భాగస్వామ్యాన్ని పెంపొందించేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు వివరించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచనలకు అనుగుణంగానే ఈ సంస్కరణలు చేపట్టినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ బిల్లుకు బీజేపీ, సీపీఐ సహా ఇతర పక్షాల సభ్యులు మద్దతు ప్రకటించగా, అనంతరం సభ దీనిని ఏకగ్రీవంగా ఆమోదించింది.

## హైదరాబాద్‌లో పరిశ్రమలు నెలకొల్పేందుకు ఐటీ సంస్థల ఆసక్తి

హైదరాబాద్(జనంసాక్షి): నగరంలో పరిశ్రమలు నెలకొల్పేందుకు ఐటీ సంస్థల ఆసక్తి చూపుతున్నాయని మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. అసెంబ్లీ వర్షాకాల సమావేశాల్లో ఐదో రోజు ప్రశ్నోత్తరాల సందర్భంగా సభ్యులు అడిన ప్రశ్నలకు మంత్రి సమాధానమిచ్చారు."టైర్-2 సిటీల్లోని ఐటీ టవర్లలో సంస్థల ఏర్పాటుకు ముందుకు రావట్లేదు. జిల్లాలోని ఐటీ టవర్ల సమీపంలో మౌలిక వసతులపై ఆలోచిస్తున్నారు. ఈ ఏడాదిలో 65 జీసీసీలు తీసుకొచ్చాం. 85 శాతం రెంటల్ స్పేసెస్ జీసీసీలతో నిండిపోయింది. జీసీసీల రాకతో రెండేళ్లలో లక్ష కొత్త ఉద్యోగాలు రానున్నాయి.

తెలంగాణ ప్రభుత్వం
ఫారం-VII

### (Declaration) రూఢీ ప్రకటన

భూసేకరణ, పునరావాస, పునఃస్థాపనలో పారదర్శకత మరియు సముచిత నష్టపరిహార హక్కు చట్టము 2013 (చట్టం 30/2013) సెక్షన్ 19(1) మరియు తెలంగాణ రాష్ట్ర భూసేకరణ, పునరావాస, పునఃస్థాపనలో పారదర్శకత మరియు సముచిత నష్టపరిహార నియమావళి 2014 రూల్ 25 ప్రకారము

NO. G2/805/2026 తేది: 08.09.2026.
Gaz. No. 159/2026

నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి మండలములోని వేపూర్ గ్రామము వద్ద మహాత్మాగాంధీ ఎత్తిపోతల పథకం డిస్ట్రిబ్యూటరీ కెనాల్-64 (Major-2/Minor-2R/Subminor-1) నిర్మాణ నిమిత్తము వేపూర్ గ్రామ పరిధి నందు ఈ క్రింది షెడ్యూల్‌లో ఉదహరించిన ఎ.2.32 గుంటలు భూమి ప్రజా ప్రయోజనార్థం అనగా మహాత్మాగాంధీ ఎత్తిపోతల పథకం డిస్ట్రిబ్యూటరీ కెనాల్-64 (Major-2/Minor-2R/Subminor-1) నిమిత్తం సేకరించవలసిన అవసరం ఉన్నదని ప్రత్యేక ఉప కలెక్టరు (భూసేకరణ) యం.జి.ఎల్.ఐ.యస్.పి నాగర్‌కర్నూల్ గారు భావిస్తున్నారు. కాబట్టి ఎ౹౹. 2.32 గుం౹౹ భూమి డిస్ట్రిబ్యూటరీ కెనాల్-64 (Major-2/Minor-2R/Subminor-1) నిమిత్తం భూసేకరణ ద్వారా సేకరించుటకు గాను రూఢీ ప్రకటన చేయడమైనది. సేకరించడానికి నిర్ధారించిన భూముల వివరాలు సంక్షిప్తంగా క్రింది ప్రకారం గలవు.

**షెడ్యూల్**

గ్రామము : వేపూర్ | మండలం : కల్వకుర్తి | జిల్లా : నాగర్‌కర్నూల్

| క్ర. సం. | సర్వే నెం./ ఎస్. డి. నెం. | పట్టా/ ఇనాం etc. | భూవర్గీకరణ మెట్ట /ఆరుతడి /తరి | భూసేకరణకు ప్రతిపాదించిన విస్తీర్ణము ఎ.గుంటలు | పట్టాదారు పేరు అనుభవదారు పేరు మరియు ఏవైనా హక్కులు గల ఇతర వ్యక్తులు | సరిహద్దులు ఉ | ద | తూ | ప | చెట్లు చెట్ల పేర్లు | చెట్ల సంఖ్య | నిర్మాణములు వర్గము | విస్తీర్ణము |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 | 2 | 3 | 4 | 5 | 6 | 7 | 8 | 9 | 10 | 11 | 12 | 13 | 14 |
| | 28 | పట్టా | మెట్ట | 0.24 1/2 | దుడ్డు మహేష్ తండ్రి వెంకటయ్య(0.04)<br>దుడ్డు రమేష్ తండ్రి వెంకటయ్య(0.03 1/2)<br>దుడ్డు లక్ష్మమ్మ భర్త కృష్ణయ్య (0.08)<br>తొంట మల్లమ్మ భర్త వెంకటయ్య (0.03)<br>తొంట బుచ్చమ్మ భర్త బందిగయ్య (0.03)<br>తొంట లక్ష్మి భర్త మల్లేష్ (0.03)<br>తొంత మనీష భర్త నవీన్ | 25 | 44 | 26 | 29 | లేవు | లేవు | లేవు | లేవు |
| | 26 | పట్టా | మెట్ట | 0.18 | శ్రీపతి సాయిజగన్‌మోహన్ రెడ్డి తండ్రి కృష్ణారెడ్డి (0.09)<br>చల్ల సువర్ణమ్మ భర్త నర్సిరెడ్డి (0.09)<br>శ్రీపతి శేఖర్‌రెడ్డి తండ్రి కృష్ణారెడ్డి | 27 | 28 | 27 | 25 | లేవు | లేవు | లేవు | లేవు |
| | 25 | ప్రభుత్వ భూమి | మెట్ట | 0.08 1/2 | ప్రభుత్వ భూమి (0.08 1/2) | 27 | 28 | 26 | 30 | లేవు | లేవు | లేవు | లేవు |
| | 29 | లావుణి పట్టా | మెట్ట | 0.14 | పెరుమండ్ల ఎల్లమ్మ భర్త రాంచంద్రయ్య (0.03)<br>పెరుమాండ్ల నాగయ్య తండ్రి చిన్న వీరయ్య (0.03)<br>పెరుమాండ్ల కృష్ణయ్య తండ్రి పెద్ద వీరయ్య (0.05)<br>పి.నాగమ్మ భర్త బాలయ్య (0.03)<br>పెరుమాండ్ల నాగయ్య తండ్రి చిన్న వీరయ్య<br>పి.బాలవీరయ్య తండ్రి నాగయ్య<br>పి.బాలవీరయ్య తండ్రి నాగయ్య | 30 | 41 | 28 | 32 | లేవు | లేవు | లేవు | లేవు |
| | 30 | పట్టా | మెట్ట | 1.07 | ఎడ్లఆంజనేయులు తండ్రి నారాయణ(0.12)<br>ఎడ్ల దశరథం తండ్రి ఆశన్న (0.12)<br>ఎడ్ల గోపాల్ తండ్రి ఆశన్న (0.12)<br>ఎడ్ల నారాయణ తండ్రి ఆశన్న (0.11)<br>ఎడ్ల భాస్కర్ తండ్రి వెంకటయ్య<br>ఎడ్ల ధర్మయ్య తండ్రి రామయ్య<br>బి కృష్ణారెడ్డి తండ్రి రాఘవరెడ్డి<br>ఎడ్ల రామకృష్ణ తండ్రి లక్ష్మయ్య<br>కొండోజుసింహ్మాచారి తండ్రి బ్రహ్మాచారి<br>ఎడ్ల రాములు తండ్రి లక్ష్మయ్య<br>చిలుకూరి సుధీర్ తండ్రి అచ్యుతా రామకృష్ణ<br>ఎడ్ల లచ్చమ్మ భర్త బాలయ్య<br>ఎడ్ల పద్మమ్మ భర్త వెంకటయ్య<br>అన్నెపు పర్వతాలు తండ్రి కొండయ్య<br>రాసమల్ల కృష్ణయ్య తండ్రి బాలయ్య<br>గోపాలి స్వాతి భర్త శివకుమార్ | 23 | 29 | 25 | 31 | ఆవసా దుచెట్లు మహా గణి చెట్లు | 15 25 | లేవు | లేవు |
| | మొత్తం | | | 2.32 | | | | | | | | | |

భూసేకరణ చట్టం 30/2013లోని సెక్షన్ 15(1) అనుసరించి పైన కనబరిచిన భూములకు సంబంధించినటువంటి రైతుల నుండి ఎటువంటి అభ్యంతరములు/ఆక్షేపణలు లేనందున ఇట్టి రూఢీ ప్రకటన చేయడమైనది.

భూసేకరణ తలపెట్టిన భూమిలో బొగ్గు, ఇనుము, స్టీల్ మరియు ఇతర ఖనిజములు ఇట్టి భూములలో లేదా కొంత భాగములో లభ్యమైనచో, ఆ ఖనిజాలు ప్రాజెక్టు నిర్మాణమునకు ఉపయోగమున్న పక్షములో, వాటిని స్వీకరించబడును. లేనిచో స్వీకరించబడవు.

పైన చూపిన భూమిని భూసేకరణ చేయు భూముల యొక్క ప్లాన్ ఏదైనా పని దినములలో మరియు కార్యాలయ పని వేళలలో భూసేకరణ అధికారి మరియు ప్రత్యేక ఉప కలెక్టర్ కార్యాలయము, నాగర్‌కర్నూల్ నందు పరిశీలించుకొను నిమిత్తం అందుబాటులో ఉండును.

సామాజిక ఆర్థిక సర్వే నివేదిక ప్రకారము పైన చూపిన భూమి భూసేకరణ వల్ల ఏ ఒక్కరునూ వారి జీవనోపాధి కోల్పోవడంగాని నిర్వాసితులుగా మారడం గాని మరియు భూమి లేని వారిగా గాని జరుగదము లేనందున ఇట్టి భూసేకరణ ప్రక్రియనందు పునరావాస మరియు పునరావాస కల్పన ప్రతిపాదనలు ఏమియును లేవు.

సం/-. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (భూ.సే), యూనిట్-I, యం.జి.ఎల్.ఐ.యస్.పి., నాగర్‌కర్నూల్ | సం/- అదనపు కలెక్టర్, నాగర్‌కర్నూల్ | సం/-. జిల్లా కలెక్టర్, నాగర్‌కర్నూల్

DIPR RO.NO: 854/LA/PP/Advt/Pub/2026-27

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం
ఫారం-6

### ప్రాథమిక ప్రకటన

స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వారి కార్యాలయము (భూసేకరణ)
జోగులాంబ గద్వాల జిల్లా

భూసేకరణ పునరావాస పునఃస్థాపనలో పారదర్శకత మరియు సముచిత నష్టపరిహార హక్కు చట్టము 2013 (చట్టం 30/2013) సెక్షన్ 11(1) మరియు తెలంగాణ రాష్ట్ర భూసేకరణ, పునరావాస, పునఃస్థాపనలో పారదర్శకత మరియు సముచిత నష్టపరిహార నియమావళి 2014 రూల్ 19(1) ప్రకారము

జిల్లా కలెక్టరు జోగులాంబ గద్వాల ప్రొసిడింగ్స్ నెం. G/551/2026 తేది: 19.8.2026
ప్రత్యేక ఉపకలెక్టరు, (భూ.సే) జే.యల్.ఐ.పి లేఖ నెం. A1/29/2026 తేది: 17.8.2026
జిల్లా రాజ పత్రం నెం. 46/2026

ఈ దిగువ నిర్దిష్ట పరిచిన జోగులాంబగద్వాల జిల్లా అయిజ మండలము తూంకుంట గ్రామము పరిధి నందు ఈ క్రింది షెడ్యూల్‌లో ఉదహరించిన ఎ.2.7044సెంట్లు భూమి ప్రజా ప్రయోజనార్థం అనగా SM3L/SDY3/D1/RMC కాలువ నిర్మాణం.

నిమిత్తము సేకరించవలసిన అవసరము ఉన్నదని జిల్లా కలెక్టర్, జోగులాంబ గద్వాల జిల్లా గారు భావిస్తున్నారు. తెలంగాణ భూసేకరణ సవరణ చట్టం 2016 (యాక్ట్ నెం. 21/2017) సెక్షన 10ఎ క్రింద మినహాయింపు ఇచ్చియున్నారు. కావున నీటి పారుదల శాఖ ప్రాజెక్టుకు సామాజిక ప్రభావము అధ్యయన వేదిక అవసరం లేనందున అనుబంధములో పేర్కొన్న భూములకై నోటీసు జారీ చేయనైనది.

**షెడ్యూలు**

| క్ర. సం. | సర్వే నెం./ ఎస్. డి. నెం. | పట్టా/ ఇనాం etc. | భూవర్గీకరణ మెట్ట /ఆరుతడి /తరి | భూసేకరణకు ప్రతిపాదించిన విస్తీర్ణము ఎ.సెంట్లు/ | పట్టాదారు పేరు అనుభవదారు పేరు మరియు ఏవైనా హక్కులు గల ఇతర వ్యక్తులు | సరిహద్దులు ఉ | ద | తూ | ప | చెట్లు చెట్ల వివరము | చెట్ల సంఖ్య | నిర్మాణములు వర్గము | విస్తీర్ణము |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 | 2 | 3 | 4 | 5 | 6 | 7 | 8 | 9 | 10 | 11 | 12 | 13 | 14 |
| 1 | 18 | పట్టా | మెట్ట | 0.2758 | 1) బి.కృష్ణవేణి భర్త బోయ భీయన్న<br>2) బోయ సవారన్న తండ్రి బతుకన్న<br>3) బోయదొడ్డెన్న తండ్రి బతుకన్న<br>4) కె.నాగమణి భర్త నారాయణ<br>5) కుమ్మరి లక్ష్మి భర్త కుమ్మరి శ్రీనివాసులు<br>6) కుమ్మరి రంగస్వామి తండ్రి రాముడు<br>7) కె.పరుశరాముడు తండ్రి కె.కిష్టన్న<br>8) బోయదస్తగిరమ్మ భర్త నవారి | - | - | - | - | - | | - | |
| 2 | 22 | పట్టా | మెట్ట | 0.5916 | 1) బీలకంటి వీరయ్య గుప్తా తండ్రి లక్ష్మయ్య<br>2) బీలకంటి సురేష్ చంద్ర తండ్రి వీరయ్య గుప్తా | - | - | - | - | - | | - | |
| 3 | 23 | పట్టా | మెట్ట | 1.5123 | 1) కుర్వ దోల రంగస్వామి తండ్రి మద్దిలేటి<br>2) కుర్వ రామాంజనేయులు తండ్రి కుర్వ మద్దిలేటి<br>3) జమ్మున్న గౌడ్ తండ్రి నర్సింహులు గౌడ్<br>4) కె.శారద భర్త కె.పరుశరాముడు<br>5) అలావల్ ఈడ్గి జయన్నగౌడ్ తండ్రి నర్సింహులు గౌడ్<br>6) ఈడ్గి నర్సింహులు గౌడ్ తండ్రి జయన్న గౌడ్<br>7) కె.శేఖర్ తండ్రి కె.మద్దిలేటి<br>8) మాచపోగు మాణిక్యం తండ్రి యం.ఆంజనేయులు<br>9) ఈడ్గి కృష్ణవేణి భర్త కిష్టన్నగౌడ్ | - | - | - | - | - | | - | |
| 4 | 41 | పట్టా | మెట్ట | 0.3247 | 1) హరిజన్ రాయన్న తండ్రి లక్ష్మన్న<br>2) హరిజన్ ఇసాక్ తండ్రి సుంకన్న<br>3) హరిజన్ ఫిలోమన్ తండ్రి సుంకన్న<br>4) పి.సువార్తమ్మ భర్త యేబు<br>5) హరిజనరామమ్మ భర్త హరిజన చిన్న బీసన్న<br>6) సాల్లర బీసన్న తండ్రి బుడ్డ జమ్మన్న | - | - | - | - | - | | - | |
| | మొత్తం విస్తీర్ణము | | | 2.7044 | | | | | | | | | |

భూసేకరణ, పునరావాస, పునఃస్థాపనలో పారదర్శకత మరియు సముచిత నష్టపరిహార హక్కు చట్టము 2013 (చట్టం 30/2013) సెక్షన్ 11(1) మరియు తెలంగాణ రాష్ట్ర భూసేకరణ, పునరావాస, పునఃస్థాపనలో పారదర్శకత మరియు సముచిత నష్టపరిహార నియమావళి 2014 రూల్ 19(1)ని అనుసరించి సంబంధిత వ్యక్తులందరి దృష్టికి ఇట్టి విషయాన్ని తెస్తూ ఈ ప్రకటన జారీ చేయడమైనది.

సదరు చట్టంలోని సెక్షన్ 12లో గల అధికారాలను అనుసరించి జిల్లా కలెక్టర్, జోగులాంబ గద్వాల జిల్లా గారు, ప్రత్యేక ఉపకలెక్టర్, జె.ఎల్.ఐ.పి., గద్వాల, మరియు వారి సిబ్బందికి సదరు భూమిలో ప్రవేశించి సర్వే మరియు ఇతర పనులు చేపట్టుటకు అధికారమివ్వనైనది. ఇట్టి భూసేకరణకు అవసరమైన భూముల యొక్క నక్షా సదరు కార్యాలయము నందు కార్యాలయపు పనివేళలలో పరిశీలించవచ్చును.

సదరు చట్టంలోని సెక్షన్ 11(4) ననుసరించి కలెక్టర్ గారి అనుమతి లేకుండా షెడ్యూల్‌లో ప్రకటించిన భూములకు సంబంధించి క్రయ, విక్రయాలు లేదా ఏ విధమైన లావాదేవీలు జరుపరాదని తెలియచేయడమైనది.

సదరు చట్టంలోని సెక్షన్ 15 ననుసరించి ప్రతిపాదిత భూసేకరణ పై ఏమైన అభ్యంతరములుగాని, ఆక్షేపణలు గాని ఉన్న యెడల సంబంధిత వ్యక్తులు ప్రత్యేక ఉప కలెక్టర్, జె.ఎల్.ఐ.పి., గద్వాల, గారి ఎదుట అభ్యర్ధనలు దాఖలు చేసుకొనవచ్చును.

సం/-.స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (భూ.సే), జవహర్ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్,గద్వాల | సం/- అదనపు కలెక్టర్ (రెవెన్యూ) జోగులాంబ గద్వాల జిల్లా | సం/-. కలెక్టర్ జోగులాంబ గద్వాల జిల్లా

DIPR RO.NO:866/LA/PP/Advt/Pub/2026-27

## మహిళా ఎమ్మెల్యేల పట్ల నీచంగా వ్యవహరించారు

నిరసన తెలిపే హక్కు ప్రతిపక్షాలకు ఉంటుందని, అయితే 30 ఏళ్లుగా రాజకీయాల్లో ఉన్న తమను శాసనసభ లోపలికి వెళ్లకుండా పోలీసులు అడ్డుకున్నారని సబితా ఇంద్రారెడ్డి వాపోయారు. కనీసం మహిళా ప్రజాప్రతినిధులనైనా సభలోకి అనుమతించాలని విన్నవించినా పోలీసులు పట్టించుకోలేదని, మహిళా ఎమ్మెల్యేల జుట్టు పట్టుకుని లాగడమే కాకుండా, పురుష ఎమ్మెల్యేలను కిందపడేసి తొక్కేశారని ఆరోపించారు. ఈ తోపులాటలోనే మాజీ మంత్రి జగదీశ్వర్ రెడ్డి కిందపడిపోయారని గుర్తుచేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యక్ష ఆదేశాలతోనే పోలీసు బలగాలు తమపై ఈ స్థాయిలో విరుచుకుపడ్డాయని ఆమె సంచలన వ్యాఖ్యలు చేశారు. శాసనసభ లోపలైనా ఈ దాడిపై ప్రభుత్వం చర్చ జరుపుతుందని, సీఎం లేదా హోంమంత్రి బాధ్యత వహించి మాట్లాడతారని భావించామని, కానీ దాడులకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోకపోగా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపైనే ఎదురు కేసులు బనాయించారని సబిత ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళా ఎమ్మెల్యేలను లైంగికంగా వేధించారంటూ అసత్య ఫిర్యాదులు చేయించడం, కేసీఆర్ నివాసం వద్దకు నిరసనకారులను పంపడం వంటివన్నీ సీఎం రేవంత్ రెడ్డి డైరెక్షన్‌లోనే జరిగాయని ఆరోపించారు. రాష్ట్రంలో న్యాయం జరగకపోవడం వల్లే తాము ఢిల్లీకి వచ్చి జాతీయ కమిషన్లను ఆశ్రయించాల్సి వచ్చిందని, ఇది తెలంగాణ ప్రభుత్వానికి సిగ్గుచేటని వ్యాఖ్యానించారు. వంద రోజుల్లో ఇస్తామన్న హామీలను నెరవేర్చడంలో విఫలమైన కాంగ్రెస్ ప్రభుత్వం, ప్రశ్నిస్తున్న ప్రతిపక్షాల గొంతు నొక్కేందుకు మహిళా కానిస్టేబుళ్లను అడ్డుపెట్టుకుని 'శిఖండి రాజకీయాలు' చేస్తోందని ధ్వజమెత్తారు. 22ఎ పేరుతో కోటి ఎకరాలను నిషేధిత జాబితాలో చేర్చి భారీ భూదందాకు తెరలేపారని విమర్శించారు. కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీలకు ఈ దాడుల ఘటనలపై సమగ్ర లేఖలు రాస్తున్నామని, కాంగ్రెస్ నాయకత్వం దీనిపై వెంటనే స్పందించి సమాధానం చెప్పాలని సబితా ఇంద్రారెడ్డి డిమాండ్ చేశారు.

**ఓటర్ల జాబితా సవరణ..**

## పలువురు ప్రముఖులకు ఈసీ నోటీసులు

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**కేంద్ర ఎన్నికల సంఘం దేశవ్యాప్తంగా చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (సర్) ప్రక్రియలో భాగంగా హైదరాబాద్‌కు చెందిన పలువురు సినీ, క్రీడా రంగాల ప్రముఖులకు నోటీసులు జారీ అయినట్లు తెలుస్తోంది. వీరిలో హీరోయిన్ సమంత, హీరో విజయ్ దేవరకొండ, మాజీ క్రికెటర్ వీవీఎస్ లక్ష్మణ్ వంటి వారు ఉన్నట్లు సమాచారం. ఓటర్ల జాబితాలోని వివరాల పరిశీలన నిమిత్తమే ఈ నోటీసులు జారీ చేసినట్లు అధికారులు చెబుతున్నారు. ఈ జాబితాలో నటుడు మహేశ్ బాబు, ఆయన భార్య నమ్రత, ప్రముఖ దర్శకుడు ఎస్.ఎస్. రాజమౌళి, నటుడు వెంకటేశ్, ఆయన కుమార్తెలు, నటుడు ఆనంద్ దేవరకొండలతో పాటు క్రీడాకారులు సైనా నెహ్వాల్, మిథాలీ రాజ్, పుల్లెల గోపీచంద్ కూడా ఉన్నట్లు సమాచారం. ఫార్మా దిగ్గజం మురళీ కృష్ణ ప్రసాద్ దివి, మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ సతీమణి ఉపాసన కొణిదెల పేర్లు కూడా ఈ జాబితాలో ఉన్నట్లు తెలుస్తోంది. ఓటర్ల పేర్లు లేదా వారి తల్లిదండ్రుల పేర్లలో వ్యత్యాసాలు ఉండటం, పాత రికార్డులతో ప్రస్తుత వివరాలు సరిపోలకపోవడం వంటి కారణాలతో ఈ నోటీసులు పంపినట్లు అధికారులు పేర్కొంటున్నారు.

## ప్రేమ పెళ్లికి కుల దురహంకార పంజా!

ఇరువైపుల తల్లిదండ్రులను పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చి, మేజర్లైన వారి జీవితంలో జోక్యం చేసుకోవద్దని స్పష్టం చేసినట్లు తెలిపారు.అయినా గురువారం రేపల్లెలో పరిస్థితి ఒక్కసారిగా ఉద్రిక్తంగా మారింది. మహేశ్వరి కుటుంబ సభ్యులు, బంధువులు రంగముని ఇంటిపైకి వెళ్లి జేసీబీ, ట్రాక్టర్లు, గడ్డపారలతో ఇంటిని పూర్తిగా కూల్చివేసినట్లు పోలీసులు తెలిపారు. దళిత యువకుడిని తమ కుమార్తె ఎలా పెళ్లి చేసుకుంటుందన్న కుల అహంకారమే ఈ విధ్వంసానికి కారణమన్న ఆరోపణలు కలకలం రేపుతున్నాయి.ఇద్దరూ మేజర్లు.. తమ ఇష్టంతో వివాహం చేసుకున్నారు. చట్టపరంగా తమ జీవితాన్ని తామే నిర్ణయించుకున్నారు. అయినా వారి ప్రేమను అంగీకరించలేని కుల దురహంకారం చివరకు ఇంటి గోడలపై ప్రతీకారం తీర్చుకున్నట్లు ఈ ఘటన నిలిచింది.ఘటనతో రేపల్లెలో ఉద్రిక్తత నెలకొంది. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ శ్రీనివాసులు తెలిపారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని, గ్రామంలో ముందస్తు జాగ్రత్తగా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

## అనలాగ్ పనీర్‌పై నిషేధం

ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేసింది.పనీర్ పేరుతో తయారీ, ప్రాసెసింగ్, ప్యాకింగ్, నిల్వ, పంపిణీ, రవాణా విక్రయాలపై టీజీ సేఫ్ నిషేధం విధించింది. రాష్ట్రవ్యాప్తంగా ఇది అమల్లో ఉంటుందని తెలిపింది. సెప్టెంబర్ 10 నుంచి ఈ నిర్ణయం అమల్లో ఉన్నట్లు పేర్కొంది. ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ యాక్ట్-2006లోని సెక్షన్ 30(2)(జీ) కింద టీజీ సేఫ్ ఆదేశాలు జారీ చేసింది.

## ఎఫ్‌టీఎల్ హద్దుల పరిరక్షణపై రాజీ పడబోం

పరిష్కారానికి అవసరమైన కార్యాచరణపై నివేదిక సమర్పించాలని స్పష్టం చేశారు. "చెరువులు, వాటి ఎఫ్‌టీఎల్ హద్దుల పరిరక్షణకు నేను సంపూర్ణంగా కట్టుబడి ఉన్నాను. ఎక్కడైనా ఎఫ్‌టీఎల్ హద్దులు దెబ్బతిన్నా, ఆక్రమణలు జరిగినా, మత్స్యకారులకు అన్యాయం వాటిల్లినా నిర్దిష్ట వివరాలను నా దృష్టికి తీసుకురండి. ప్రభుత్వం తక్షణమే స్పందించి చర్యలు తీసుకుంటుంది" అని మంత్రి సభకు భరోసా ఇచ్చారు. రాష్ట్రం ఏర్పడిన సమయంలో సుమారు 2,150గా ఉన్న మత్స్య సహకార సంఘాల సంఖ్య ప్రస్తుతం ఆరు వేలకు పైగా పెరిగిందని సభ్యులు సభ దృష్టికి తీసుకొచ్చారు. అదేవిధంగా సంఘాల సభ్యత్వం సుమారు రెండు లక్షల నుంచి 6.5 లక్షలకు చేరిందని వివరించారు. చెరువులు, ఇతర జలవనరుల పరిరక్షణలో మత్స్య సహకార సంఘాలకు మరింత క్రియాశీలమైన పాత్ర కల్పిస్తూ సమగ్ర విధానాన్ని రూపొందించాలని సభ్యులు కోరారు. జలవనరుల ఆరోగ్యంతోనే మత్స్యకారుల జీవనోపాధి ముడిపడి ఉన్నందున, చెరువుల పర్యవేక్షణ, చేప పిల్లల సంరక్షణ, ఆక్రమణలు లేదా ఇతర ముప్పులను తక్షణమే ప్రభుత్వం దృష్టికి తీసుకురావడంలో మత్స్యకార సంఘాలు స్థానిక సంరక్షకులుగా సమర్థవంతమైన పాత్ర పోషించగలవని సూచించారు. రాష్ట్రంలోని అన్ని చెరువులకు పరిరక్షణ, నిర్వహణ కమిటీలను ఏర్పాటు చేసే ప్రక్రియను ప్రభుత్వం ఇప్పటికే ప్రారంభించిందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడించారు. ఉమ్మడి రాష్ట్రంలో ఇటువంటి కమిటీలు పనిచేశాయని, అనంతర కాలంలో ఆ వ్యవస్థ నిలిచిపోయిందని తెలిపారు. జలవనరుల సమర్థ నిర్వహణ, నిరంతర పర్యవేక్షణ, ఆక్రమణల నిరోధానికి కమిటీల వ్యవస్థను పునరుద్ధరించాలని వచ్చిన సిఫారసుల మేరకు ప్రభుత్వం ఈ చర్యలు చేపట్టిందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటికే సుమారు 44 వేల చెరువులకు జియో ట్యాగింగ్ పూర్తయిందని మంత్రి తెలిపారు. ఈ సమగ్ర సమాచార వ్యవస్థ చెరువుల స్థితిగతులను పర్యవేక్షించడంతోపాటు వాటి పరిరక్షణకు అవసరమైన కార్యాచరణ రూపొందించేందుకు బలమైన ప్రాతిపదికగా ఉపయోగపడుతుందని చెప్పారు. చెరువుల పరిరక్షణకు అదనపు నిధులు అవసరమైతే వాటిని సమకూర్చేందుకు ప్రభుత్వం వెనుకాడబోదని స్పష్టం చేశారు. చెరువుల సంరక్షణ, ఎఫ్‌టీఎల్ హద్దుల పరిరక్షణ, మత్స్యకారుల జీవనోపాధికి భరోసా కల్పించడం ప్రభుత్వ ప్రాధాన్య అంశాలని పునరుద్ఘాటించారు. నల్లగొండ జిల్లాలోని నెల్లికల్ ఎత్తిపోతల పథకాన్ని డిసెంబర్ 2027 నాటికి సంపూర్ణంగా పూర్తి చేసి, సుమారు 24 వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందిస్తామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి శాసన మండలి సాక్షిగా విస్పష్టమైన హామీ ఇచ్చారు. నెల్లికల్ ఎత్తిపోతల పథకాన్ని ప్రభుత్వం అత్యంత ప్రాధాన్య ప్రాజెక్టుగా గుర్తించిందని చెప్పారు. పనుల పురోగతిని నిరంతరం పర్యవేక్షిస్తూ, నిర్దేశించుకున్న గడువులోగా రెండు దశలను పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టామని వివరించారు. తొలి దశలో జూన్ 2027 నాటికి 7,800 ఎకరాలకు సాగునీరు అందిస్తామని, మిగిలిన సుమారు 16 వేల ఎకరాలకు డిసెంబర్ 2027 నాటికి నీరందించి మొత్తం 24 వేల ఎకరాల ఆయకట్టును సస్యశ్యామలం చేస్తామని ప్రకటించారు. "సభాముఖంగా విస్పష్టమైన హామీ ఇస్తున్నాను. మొదటి దశను జూన్ 2027 కంటే ముందుగానే పూర్తి చేయాలన్న లక్ష్యంతో పనిచేస్తున్నాం. డిసెంబర్ 2027 నాటికి మొత్తం ప్రాజెక్టును పూర్తి చేసి, 24 వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందిస్తాం" అని మంత్రి స్పష్టం చేశారు. గత ప్రభుత్వ హయాంలో ఈ పథకం పనులకు కేవలం రూ.25.42 కోట్లు మాత్రమే విడుదలయ్యాయని మంత్రి తెలిపారు. ప్రస్తుత ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఇప్పటివరకు రూ.310.681 కోట్లు విడుదల చేసి, దీర్ఘకాలంగా ఎదురుచూస్తున్న ప్రాజెక్టు పనులకు వేగం పెంచిందన్నారు. తాను స్వయంగా రెండుసార్లు ప్రాజెక్టు పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించానని, నీటిపారుదల శాఖ కార్యదర్శి కూడా రెండుసార్లు సందర్శించి పనుల పురోగతిపై సమీక్ష నిర్వహించారని తెలిపారు. నెల్లికల్ ప్రాజెక్టును పూర్తి చేసి రైతుల దశాబ్దాల నిరీక్షణకు తెరదించాలన్నది ప్రభుత్వ దృఢ సంకల్పమని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పునరుద్ఘాటించారు. ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా ప్రస్తుతం అందిస్తున్న బియ్యం, గోధుమలు, చక్కెరతోపాటు మరికొన్ని నిత్యావసర సరుకులను పంపిణీ చేసే ప్రతిపాదనను ప్రభుత్వం సానుకూలంగా పరిశీలిస్తోందని వెల్లడించారు.

# చట్ట సవరణతో పల్లెల బలోపేతం

- మహిళా సర్పంచ్ ల ఫోరం రాష్ట్ర అధ్యక్షురాలు గుంటిపల్లి రేణుక



హైదరాబాద్ (జనంసాక్షి) : పంచాయతీరాజ్ బిల్లు చట్ట సవరణతో పల్లెలు అభివృద్ధికి మరింత దారి సుగమం అయినట్టు మహిళా సర్పంచ్ల ఫోరం రాష్ట్ర అధ్యక్షురాలు గుంటుపల్లి రేణుక చెప్పారు. గ్రామ పంచాయతీలకు, సర్పంచులకు పూర్తి అధికారాలు కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన పంచాయతీరాజ్ చట్ట సవరణను మహిళా సర్పంచుల ఫోరం స్వాగతించింది. ఈ మేరకు శుక్రవారం పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్కను కలిసి రేణుక హర్ష వ్యక్తం చేసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ నిర్ణయం గ్రామస్వరాజ్య స్ఫూర్తికి నిజమైన అర్థం చేకూరుస్తుందని పేర్కొన్నారు. గ్రామ పంచాయతీలకు పూర్తి అధికారాలు దక్కడం వల్ల స్థానిక సమస్యల పరిష్కారంలో సర్పంచులు మరింత సమర్థవంతంగా వ్యవహరించగలరని, గ్రామాభివృద్ధి కార్యక్రమాలను ఆలస్యం లేకుండా అమలు చేయగలమని రేణుక అన్నారు. ముఖ్యంగా మహిళా సర్పంచులకు ఇది మరింత ఊతమిస్తుందని, స్థానిక పాలనలో వారి పాత్రను బలోపేతం చేస్తుందని తెలిపారు. ఈ చారిత్రాత్మక నిర్ణయం తీసుకున్నందుకు రాష్ట్ర ప్రభుత్వానికి, ముఖ్యంగా పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్కకు మహిళా సర్పంచుల ఫోరం తరపున రేణుక కృతజ్ఞతలు తెలిపారు. సర్పంచుల డిమాండ్లను పరిగణనలోకి తీసుకుని, వారి గళానికి ప్రాధాన్యత ఇచ్చినందుకు మంత్రి సీతక్కను ఆమె అభినందించారు. గ్రామ పంచాయతీలకు అధికారాల వికేంద్రీకరణ దిశగా ప్రభుత్వం మరిన్ని చర్యలు తీసుకోవాలని, రాబోయే రోజుల్లో నిధుల కేటాయింపులోనూ, పరిపాలనా వ్యవహారాల్లోనూ సర్పంచులకు మరింత స్వేచ్ఛ కల్పించాలని రేణుక కోరారు.

# ఉద్యోగులకు ప్రమాద బీమా

- కోటి రూపాయల బీమా అందిస్తున్నాం
- ఒక్క రూపాయి ప్రీమియం లేకుండానే బీమా
- ఈ బీమాతో 12.91 లక్షల మందికి లబ్ధి
- అసెంబ్లీలో డిప్యూటీ సీఎం భట్టి వెల్లడి



హైదరాబాద్, సెప్టెంబర్ 11(ఆర్ఎన్ఏ): రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు, కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ సిబ్బంది సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. శాసనమండలిలో సభ్యులు అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానమిచ్చారు. రాష్ట్ర ఖజానాపై, ఉద్యోగుల వేతనాలపై రూపాయి భారం పడకుండా, మానవీయ కోణంలో దేశంలోనే తొలిసారిగా రూ. కోటి దాకా ఉచిత ప్రమాద బీమా సౌకర్యాన్ని కల్పించినట్లు ఆయన స్పష్టం చేశారు. ఉద్యోగికి అనుకోకుండా ఏదైనా ప్రమాదం జరిగి మరణిస్తే వారి కుటుంబం తీవ్ర ఆర్థిక సంక్షోభంలో పడుతుంది. అటువంటి కుటుంబాలకు జీవితకాల భరోసా కల్పించాలనే ఆలోచనతోనే ఈ పథకాన్ని తీసుకొచ్చాం” అని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. ప్రభుత్వం ప్రతి నెలా బ్యాంకుల ద్వారా జీతాలు చెల్లిస్తుందని, బ్యాంకర్లతో చర్చించి వారి వ్యాపార అభివృద్ధికి అనుగుణంగా ఇన్సూరెన్స్ కంపెనీలతో ఒప్పందం కుదుర్చుకున్నామని వెల్లడించారు. అందుకోసమే ప్రభుత్వం 16 ప్రముఖ బ్యాంకులతో అవగాహన ఒప్పందం కుదుర్చుకుందని, ఈ మేరకు ఆర్థిక శాఖ జీవో నంబర్ 77ను జారీ చేసిందని వివరించారు. ఉద్యోగికి అనుకోకుండా ఏదైనా ప్రమాదం జరిగి మరణిస్తే వారి కుటుంబం తీవ్ర ఆర్థిక సంక్షోభంలో పడుతుంది. అటువంటి కుటుంబాలకు జీవితకాల భరోసా కల్పించాలనే ఆలోచనతోనే ఈ పథకాన్ని తీసుకొచ్చాం” అని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. ప్రభుత్వం ప్రతి నెలా బ్యాంకుల ద్వారా జీతాలు చెల్లిస్తుందని, బ్యాంకర్లతో చర్చించి వారి వ్యాపార అభివృద్ధికి అనుగుణంగా ఇన్సూరెన్స్ కంపెనీలతో ఒప్పందం కుదుర్చుకున్నామని వెల్లడించారు. అందుకోసమే ప్రభుత్వం 16 ప్రముఖ బ్యాంకులతో అవగాహన ఒప్పందం కుదుర్చుకుందని, ఈ మేరకు ఆర్థిక శాఖ జీవో నంబర్ 77ను జారీ చేసిందని వివరించారు. ??ఈ పథకం ద్వారా ఇప్పటికే 89 ఉద్యోగ కుటుంబాలకు ప్రమాద బీమా పరిహారాన్ని అందించినట్లు డిప్యూటీ సీఎం భట్టి తెలిపారు. ఇందులో ?సింగరేణిలో 50, ?విద్యుత్ శాఖ ఉద్యోగులు 15, ?వివిధ ప్రభుత్వ శాఖల ఉద్యోగులు 24 మంది ఉన్నారన్నారు. ??శాలరీ, పెన్షన్ అకౌంట్ ప్యాకేజీల ఆధారంగా బీమా ప్రయోజనాలు వర్తిస్తాయని తెలిపారు. ప్రమాదవశాత్తు మరణం, శాశ్వత వైకల్యం సంభవిస్తే ఉచిత బీమా వర్తిస్తుందన్నారు. అంతేకాకుండా విమాన ప్రమాదంలో మరణిస్తే రూ. 2.20 కోట్ల నుంచి రూ. 3 కోట్ల వరకు కవరేజ్ లభిస్తుందని, సాధారణ ప్రమాద మరణానికి కూడా కొన్ని కేటగిరీల్లో రూ. 1.50 కోట్ల కంటే ఎక్కువ బీమా అందుతుందని స్పష్టం చేశారు. ?రాష్ట్రంలో మొత్తం 12,91,046 మంది ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల వ్యవస్థకు ఉచిత బీమా వర్తిస్తుందని వెల్లడించారు. ఇందులో 5,18,293 మంది రెగ్యులర్ ప్రభుత్వ సిబ్బంది ఉన్నారన్నారు. అలాగే 5,00,158 మంది తాత్కాలిక సిబ్బంది , 2,72,615 మంది పెన్షనర్లు కవర్ అవుతారని వివరించారు. ఈ పథకాన్ని మొదటిగా ఫిబ్రవరి 2024లో సింగరేణి ఉద్యోగులకు, ఆ తర్వాత జూన్ 2024 నుంచి విద్యుత్ శాఖ సిబ్బందికి ప్రారంభించి, ప్రస్తుతం రాష్ట్రంలోని కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులతో పాటు అందరికీ వర్తింపజేశామని డిప్యూటీ సీఎం స్పష్టం చేశారు. ఈ మేరకు అన్ని శాఖల అధిపతులకు, కార్యదర్శులకు కూడా స్పష్టమైన ఆదేశాలు జారీ చేశామని సభలో తెలిపారు.



# బలముకుంద్ తరికెరె నారాయణకు కాంస్య పతకం



హైదరాబాద్ (జనంసాక్షి) : తెలంగాణ రాష్ట్రానికి చెందిన అంతర్జాతీయ యోగా క్రీడాకారుడు బాలముకుంద్ తరికెరె నారాయణ, థాయిలాండ్‌లో వరల్డ్ ఫిట్‌నెస్ ఫెడరేషన్ యోగాసన స్పోర్ట్స్ ఇంటర్నేషనల్ కాంస్య పతకం, ట్రోఫీని గెలుచుకున్నారు. తెలంగాణ రాష్ట్రం నుండి ఎంపికైన ఏకైక యోగా అథ్లెట్, అంతర్జాతీయ యోగా క్రీడాకారుడు బాలముకుంద్ తారికెరె నారాయణ, భారతదేశానికి ప్రాతినిధ్యం వహించి, సెప్టెంబర్ 7, 2026న థాయ్‌లాండ్‌లోని రాయాంగ్‌లో జరిగిన స్టార్ కన్వెన్షన్‌లో వరల్డ్ ఫిట్‌నెస్ ఫెడరేషన్ యోగాసన స్పోర్ట్స్ ఇంటర్నేషనల్ (డబ్ల్యూఎఫ్ఎఫ్ఎస్ఐ) నిర్వహించిన ఆసియా–పసిఫిక్ అంతర్జాతీయ యోగాసన క్రీడలలో మాస్టర్స్ విభాగంలో కాంస్య పతకం మరియు ట్రోఫీని అందుకున్నారు. భారతదేశంతో పాటు, శ్రీలంక, మలేషియా మరియు థాయ్‌లాండ్ దేశాల నుండి కూడా యోగా క్రీడాకారులు ఈ యోగా పోటీలలో పాల్గొన్నారు. ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని ప్రారంభించిన డబ్ల్యూఎఫ్ఎఫ్ఎస్ఐ అంతర్జాతీయ అధ్యక్షుడు శివం భదౌరియా, ఆయా దేశాల యోగా క్రీడాకారులలోని ఉత్సాహాన్ని ప్రశంసించారు. గతంలో జరిగిన డబ్ల్యూఎఫ్ఎఫ్ఎస్ఐ ఆసియా–పసిఫిక్ అంతర్జాతీయ యోగా పోటీలలో, భారతదేశానికి ప్రాతినిధ్యం వహించిన శ్రీ బాలముకుంద్ తారికెరె నారాయణ, 2024 ఆగస్టు 22న శ్రీలంకలోని కొలంబోలోని హోటల్ మారినో బీచ్‌లో స్వర్ణ పతకం, ట్రోఫీ మరియు జీవిత సాఫల్య పురస్కారాన్ని; అలాగే 2025 అక్టోబర్ 14న మలేషియాలోని కౌలాలంపూర్‌లోని షెరటాన్ ఇంపీరియల్‌లో రజత పతకం మరియు ట్రోఫీని కూడా గెలుచుకున్నారు.

# 56% బీసీలు.. రాజకీయ న్యాయం ఎక్కడ?

- నేడు తెలంగాణ రాజకీయ ముఖచిత్రంపై రౌండ్ టేబుల్ సమావేశం

హైదరాబాద్ (జనంసాక్షి) : 56% బీసీలు... రాజకీయ న్యాయం ఎక్కడ?” అనే అంశంపై శనివారం, 12-09-2026న మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు సోమాజిగూడ ప్రెస్ క్లబ్, హైదరాబాద్‌లో నిర్వహించనున్నట్లు ప్రకటించారు. తెలంగాణ రాష్ట్రం బహుజనుల త్యాగాల పునాదులపై ఏర్పడిందని, రాష్ట్ర ఆవిర్భావ సమయంలో “సామాజిక తెలంగాణ -- ప్రజాస్వామ్య తెలంగాణ” ఏర్పడుతుందని ప్రజలు ఆశించారని నిర్వాహకులు పేర్కొన్నారు. అయితే రాష్ట్రం ఏర్పడిన తర్వాత కూడా ఆధిపత్య కులాల రాజకీయ ప్రాబల్యం కొనసాగుతుండగా, జనాభాలో మెజారిటీగా ఉన్న బీసీలు రాజకీయ అధికారంలో తీవ్రంగా వెనుకబడిపోయారని తెలిపారు. రౌండ్ టేబుల్ సమావేశానికి సంబంధించిన పట్టికలు పరిశీలిస్తే ఒక చేదు వాస్తవం స్పష్టమవుతోందని బీసీ ఇంటెలెక్చువల్ ఫోరమ్ చైర్మన్ టి. చిరంజీవులు, బీసీ పొలిటికల్ ఫ్రంట్ చైర్మన్ బాలగౌని బాలరాజ్ గౌడ్ అన్నారు. “బీసీలు కేవలం ఓటర్లుగా మాత్రమే మిగిలిపోయారు; ఓట్లు మనవి, సీట్లు వారివి” అన్న పరిస్థితి కొనసాగుతోందని విమర్శించారు. తెలంగాణ జనాభాలో 56.33 శాతం ఉన్న బీసీలకు, రాష్ట్ర పరిపాలనలో వారి జనాభా నిష్పత్తికి అనుగుణంగా రాజకీయ ప్రాతినిధ్యం లభించడం లేదని తెలిపారు. శాసనసభ, మంత్రివర్గం, లోక్‌సభ, రాజ్యసభ, ఎమ్మెల్సీలు, కీలక రాజకీయ నిర్ణయాధికార వ్యవస్థల్లో బీసీల ప్రాతినిధ్యం వారి జనాభా శాతంతో పోలిస్తే తీవ్రంగా తక్కువగా ఉందని పేర్కొన్నారు.

“జనాభాలో మెజారిటీ – అధికారంలో మైనారిటీ” అనే విరుద్ధ పరిస్థితి బీసీలకు ఏర్పడిందని వారు అన్నారు. ప్రజాస్వామ్యంలో ఓటు వేయడం మాత్రమే రాజకీయ సాధికారత కాదని, ఓటు వేయడం నుంచి నిర్ణయాలు తీసుకునే స్థాయికి బీసీలు చేరుకోవడమే నిజమైన రాజకీయ సాధికారత అని స్పష్టం చేశారు. ప్రస్తుతం ఖాళీగా ఉన్న మూడు మంత్రి పదవులను తక్షణమే బీసీలకు కేటాయించాలని, ఖాళీ కాబోతున్న ఐదు ఎమ్మెల్సీ స్థానాల్లో సామాజిక న్యాయాన్ని పాటిస్తూ బీసీలు/బహుజనులకు తగిన ప్రాతినిధ్యం కల్పించాలని, జనాభా ప్రాతిపదికన బీసీలకు అన్ని రాజకీయ సంస్థల్లో న్యాయమైన ప్రాతినిధ్యం కల్పించాలని, సమావేశంలో బీసీల రాజకీయ ప్రాతినిధ్యంపై రూపొందించిన వివిధ పట్టికలను కూడా చర్చకు తీసుకురానున్నారు. అందులో శాసనసభ, లోక్‌సభ, రాజ్యసభ, ఎమ్మెల్సీలు, మంత్రివర్గం తదితర రంగాల్లో బీసీల ప్రాతినిధ్యాన్ని సామాజిక వర్గాల వారీగా విశ్లేషించారు. బీసీల రాజకీయ ప్రాతినిధ్యం అనేది కేవలం సంఖ్యల సమస్య కాదని, ఇది రాజకీయ న్యాయం, సామాజిక న్యాయం, ప్రజాస్వామ్య ప్రాతినిధ్యానికి సంబంధించిన ప్రశ్న అని పేర్కొన్నారు. “జనాభాలో మేమెంతో – అధికారంలో మాకంత” అనే ప్రజాస్వామ్య న్యాయం సాధించాల్సిన అవసరం ఉందని వారు అన్నారు. బీసీలు ఎప్పటికీ ఓటు బ్యాంకుగా మాత్రమే ఉండాలా? లేక తమ జనాభా బలానికి తగిన రాజకీయ అధికారం, ప్రాతినిధ్యం, నిర్ణయాధికారం సాధించాలా? అనే ప్రశ్నను ఈ సమావేశం సమాజం ముందుకు తీసుకురానుందని తెలిపారు.

# భట్టీకి మట్టి వినాయకుని ప్రతిమ బహుమతి

- అందించిన మంత్రి పొన్నం ప్రభాకర్
- మట్టి వినాయకుల వినియోగంపై ప్రజల్లో అవగాహన కల్పిస్తున్న బీసీ సంక్షేమ శాఖ



హైదరాబాద్, సెప్టెంబర్ 11 (జనంసాక్షి) : వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మట్టి వినాయకుల వినియోగాన్ని ప్రోత్సహిస్తూ ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ శుక్రవారం అసెంబ్లీ ప్రాంగణంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు మట్టి వినాయకుడిని అందజేశారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని, వినాయక చవితి సందర్భంగా రసాయనాలతో తయారు చేసిన విగ్రహాలకు బదులుగా పర్యావరణహితమైన మట్టి గణపతులను ప్రతిష్ఠించి పూజించాలని బీసీ సంక్షేమ శాఖ ప్రజలకు అవగాహన కల్పిస్తోంది. మట్టి వినాయకులను అందించడం పట్ల ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మంత్రి పొన్నం ప్రభాకర్‌కు, బీసీ సంక్షేమ శాఖకు ధన్యవాదాలు తెలిపారు. పర్యావరణ పరిరక్షణకు దోహదపడే ఇలాంటి కార్యక్రమాలను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. మట్టి వినాయకుల వినియోగం ద్వారా పర్యావరణాన్ని కాపాడటంతో పాటు సంప్రదాయ పద్ధతులను ప్రోత్సహించవచ్చని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ప్రజలందరూ పర్యావరణహితమైన మట్టి గణపతులను వినియోగించి వినాయక చవితిని భక్తిశ్రద్ధలతో, పర్యావరణ పరిరక్షణకు అనుకూలంగా జరుపుకోవాలని ఆయన కోరారు.

# తండ్రి లేని పేదింటి ఆడపిల్ల వివాహానికి ఉప్పల ఫౌండేషన్ అండ

- పుట్టిన గడ్డ రుణం తీర్చుకుంటున్న ఉప్పల
- పుస్తె మట్టెలు, చీర, గాజులు అందజేసిన ఉప్పల శ్రీనివాస్ గుప్త



హైదరాబాద్ (జనంసాక్షి) : తండ్రి లేని పేదింటి దళిత సామాజిక వర్గానికి చెందిన ఆడపిల్ల వివాహానికి ఉప్పల ఫౌండేషన్ అండగా నిలిచింది. సిద్దిపేట జిల్లా నారాయణరావుపేట మండలం లక్ష్మీదేవ్‌పల్లి గ్రామానికి చెందిన గుండెల్లి యాదమ్మ-కీ.శే. కిషన్ దంపతుల కుటుంబానికి చెందిన ఆడపిల్ల వివాహం సందర్భంగా ఉప్పల ఫౌండేషన్ తరఫున చీర గాజులు పూస్తె మట్టెలు అందజేశారు. నాగోల్‌లోని ఉప్పల శ్రీనివాస్ గుప్త నివాసంలో నిర్వహించిన కార్యక్రమంలో ఉప్పల ఫౌండేషన్ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్ గుప్త స్వయంగా వధువుకు పుస్తె మట్టెలు, చీర, గాజులు అందజేసి, నూతన వధూవరులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఉప్పల శ్రీనివాస్ గుప్త మాట్లాడుతూ.. ఆర్థిక ఇబ్బందులతో వివాహం చేసుకోలేని పేద కుటుంబాలకు తమ వంతు సహాయం అందించడం ఉప్పల ఫౌండేషన్ ప్రధాన లక్ష్యమని తెలిపారు. తండ్రి లేని ఆడపిల్ల వివాహానికి అండగా నిలవడం తనకు ఎంతో సంతృప్తిని కలిగించిందన్నారు. నూతన వధూవరులు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, సిరిసం పదలతో, అన్యోన్యంగా జీవించాల ని ఆకాంక్షించారు. పేద, మధ్య తరగతి కుటుంబాలకు అవసరమైన సమయంలో అండగా నిలుస్తూ ఉప్పల ఫౌండేషన్ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు కొనసాగి స్తున్నామని తెలిపారు. ఈ కార్యక్ర మంలో ఉప్పల ఫౌండేషన్ కో చైర్మెన్ ఉప్పల స్వప్న, లక్ష్మి దేవ్ పల్లి గ్రామానికి చెందిన యువజన సంఘం నాయకుడు కనక రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### పొలాల అమావాస్య సందర్భంగా భువనగిరిలో ఘనంగా అన్నప్రసాద వితరణ



పొలాల అమావాస్య పర్వదినాన్ని పురస్కరించుకుని యాదాద్రి భువనగిరి జిల్లా ఐవీఎఫ్ ఆధ్వర్యంలో భువనగిరి ప్రభుత్వ ఆసుపత్రి వద్ద అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఐవీఎఫ్ యాదాద్రి భువనగిరి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా టీపీసీసీ ప్రధాన కార్యదర్శి అంతర్జాతీయ ఆర్య వైశ్య ఫెడరేషన్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ మరియు రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్త హాజరై అన్నప్రసాద వితరణ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉప్పల శ్రీనివాస్ గుప్త మాట్లాడుతూ పొలాల అమావాస్య వంటి పర్వదినాల్లో అన్నదానం చేయడం ఎంతో పవిత్రమైన సేవా కార్యక్రమమని అన్నారు. అన్నదానం ద్వారా ఆపదలో ఉన్నవారికి, ఆసుపత్రికి వచ్చే రోగులు మరియు వారి సహాయకులకు కొంతమేరకు తోడ్పాటు అందించగలగడం సంతోషకరమని పేర్కొన్నారు. సమాజంలో సేవా భావాన్ని మరింత పెంపొందించేందుకు ఇటువంటి కార్యక్రమాలు నిరంతరం కొనసాగాలని ఆయన ఆకాంక్షించారు. సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్న ఐవీఎఫ్ యాదాద్రి భువనగిరి జిల్లా నాయకత్వాన్ని, అధ్యక్షుడు చంద్రశేఖర్‌ను ఈ సందర్భంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో ఐవీఎఫ్ నాయకులు , మహిళ సంఘం నాయకులు కార్యకర్తలు తదితరులు

# 25 ఏళ్ల రాజకీయ ప్రస్థానాన్ని పూర్తి చేసుకున్న మోదీ

- సెప్టెంబర్ 17న ప్రతి ఇంటా దీపాలు వెలిగించాలి
- అక్టోబర్ 17 వరకు సేవా సంకల్ప్ అభియాన్
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు వెల్లడి

హైదారాబాద్, సెప్టెంబర్ 11 (జనంసాక్షి) : ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 25 ఏళ్ల సుదీర్ఘ ప్రజాసేవా ప్రస్థానాన్ని పురస్కరించుకుని తెలంగాణ వ్యాప్తంగా సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 17 వరకు నెల రోజుల పాటు ‘సేవా సంకల్ప్ అభియాన్’ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు వెల్లడించారు. ప్రజలకు సేవ చేయడం ద్వారా మరింత చేరువ కావడం, అలాగే పార్టీ కార్యకర్తల్లో సేవా భావాన్ని పెంపొందించడమే ఈ అభియాన్ ప్రధాన ఉద్దేశమని ఆయన స్పష్టం చేశారు. అభియాన్ ఆరంభ రోజైన సెప్టెంబర్ 17న ‘ఆశీర్వాద్ కా దియా’ పేరిట రాష్ట్రంలోని ప్రతి ఇంట్లో దీపాలు వెలిగించి ప్రధానమంత్రికి శుభాకాంక్షలు తెలియజేయాలని రాంచందర్ రావు పార్టీ శ్రేణులకు, ప్రజలకు పిలుపునిచ్చారు. నెల రోజుల పాటు సాగే ఈ ఉత్సవాల్లో భాగంగా రక్తదాన శిబిరాలు, స్వచ్ఛ భారత్ కార్యక్రమాలు, ఉచిత వైద్య శిబిరాలు, వ్యాసరచన పోటీలు నిర్వహిస్తామన్నారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని కేంద్రంలోని మోదీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకు ప్రణాళికలు సిద్ధం చేసినట్లు వివరించారు. మోదీ పాలనలో జన్‌ధన్ యోజన, డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ (డీబీటీ) ద్వారా పేదలను నేరుగా బ్యాంకింగ్ వ్యవస్థతో అనుసంధానించి సంక్షేమ ఫలాలను పూర్తి పారదర్శకంగా అందిస్తున్నామని ఆయన తెలిపారు. యూపీఐ, డిజిటల్ చెల్లింపుల విప్లవంతో భారత్ ప్రపంచ డిజిటల్ పేమెంట్ రంగంలో అగ్రగామిగా నిలిచిందన్నారు. పీఎం విశ్వకర్మ, పీఎం స్వనిధి, ముద్ర రుణాల ద్వారా చేతివృత్తిదారులు, వీధి వ్యాపారులు, చిన్న వ్యాపారులకు ఆర్థిక చేయూతనిస్తున్నామని గుర్తుచేశారు.

# కో ఆప్షన్ సభ్యులుగా ట్రాన్స్ జెండర్లు

హైదరాబాద్ (జనంసాక్షి) : రాష్ట్రం లో క్యూర్ పరిధి వెలుపల ఉన్న 9 మున్సిపల్ కార్పొరేషన్లలో కో ఆప్షన్ సభ్యులుగా ట్రాన్స్ జెండర్లను నియమించనున్నట్టు శాసనసభలో మంత్రి శ్రీధర్ బాబు వెల్లడించారు. ప్రతి కార్పోరేషన్ లో ఒకరిని ఎంపిక చేస్తామని తెలిపారు. తెలంగాణా మున్సిపల్ చట్టం–2019 కి సవరణ కోరుతూ ఈ మేరకు ఆయన బిల్లు ప్రవేశపెట్టారు. సామాజికంగా వివక్ష ఎదుర్కొంటున్న ట్రాన్స్ జెండర్లను ప్రధాన స్రవంతిలో కి తీసుకొచ్చేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రేవంత్ రెడ్డి పలు కార్యక్రమాలు చేపట్టారని వివరించారు.

## ట్రాన్స్‌జెండర్లకు కో-ఆప్షన్ సభ్యుల బిల్లును వర్తింపజేయాలి

- ఎమ్మెల్సీ డాక్టర్ దాసోజు శ్రవణ్ డిమాండ్

హైదరాబాద్ (జనంసాక్షి) : తెలంగాణ స్థానిక సంస్థల్లో ట్రాన్స్‌జెండర్లకు కో–ఆప్షన్ సభ్యులుగా అవకాశం కల్పించేందుకు ఉద్దేశించిన నూతన బిల్లును గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్, మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్, సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ సహా రాష్ట్రంలోని అన్ని నగర కార్పొరేషన్లకు వర్తింపజేయాలని శాసనమండలి సభ్యులు డా. దాసోజు శ్రవణ్ ప్రభుత్వాన్ని గట్టిగా డిమాండ్ చేశారు. ఈ మేరకు తెలంగాణ శాసనమండలి చైర్మన్ ద్వారా ఆయన ప్రభుత్వం దృష్టికి పలు కీలక అంశాలను తీసుకెళ్లారు. సమాజంలో, పాలనా వ్యవస్థల్లో సరైన మద్దతు, ఉపాధి అవకాశాలు లేకపోవడం వల్లే ట్రాన్స్‌జెండర్లు నేటికీ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేవలం కో–ఆప్షన్ పదవులకే పరిమితం కాకుండా, ప్రభుత్వం వారికి ప్రత్యేక పింఛన్లు, స్వయం ఉపాధి రుణాలు, నైపుణ్యాభివృద్ధి (స్కిల్ బిల్డింగ్) కార్యక్రమాల్లో ప్రత్యేక కోటాను కల్పించి పూర్తిస్థాయి సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక సాధికారత అందించాలని కోరారు.

# కాంగ్రెస్ అసమర్థ పాలనతో రైతుల పరిస్థితి దయనీయం

- మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత పువ్వాడ అజయ్ ఆవేదన

హైదారాబాద్, సెప్టెంబర్ 11 (జనంసాక్షి) : ఉమ్మడి ఖమ్మం జిల్లా వ్యాప్తంగా సాగునీరు, విద్యుత్ సరఫరా సరిగా లేక రైతుల పరిస్థితి దారుణంగా తయారైందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత పువ్వాడ అజయ్ ఆవేదన వ్యక్తం చేశారు. రైతాంగం కష్టపడి పండించిన పంటలను కాపాడుకునేందుకు అవసరమైన నీటిని, నాణ్యమైన విద్యుత్‌ను అందించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. ఈ ఏడు ఎల్ నినో ప్రభావం ఉంటుందని ముందుగానే వాతావరణ శాఖ సంకేతాలు ఇచ్చినప్పటికీ, కాంగ్రెస్ ప్రభుత్వం ముందస్తు ప్రణాళికలు రూపొందించుకోవడంలో విఫలమైందని పువ్వాడ మండిపడ్డారు. ప్రభుత్వ నిర్లక్ష్యం, అసమర్థ నిర్ణయాల వల్లే క్షేత్రస్థాయిలో పంట పొలాలు ఎండిపోయే తీవ్రమైన పరిస్థితులు నెలకొన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సాగునీటి ఎద్దడి, విద్యుత్ కోతల సమస్యలపై బీఆర్ఎస్ పార్టీ మొదటి నుంచీ ప్రభుత్వాన్ని హెచ్చరిస్తూ, బాధితుల తరఫున పోరాటాలు చేస్తున్నప్పటికీ పాలకులు కనీసం స్పందించకపోవడం దారుణమన్నారు. ప్రభుత్వ ఉదాసీనత కారణంగా జిల్లా వ్యాప్తంగా వేలాది ఎకరాల్లో పంటలు దెబ్బతిని రైతులు భారీగా నష్టపోయే ప్రమాదం పొంచి ఉందని తెలిపారు. వెంటనే స్పందించి అధికారులు క్షేత్రస్థాయిలో ఎండిపోతున్న పంటలను స్వయంగా పరిశీలించాలని, అత్యవసర ప్రాతిపదికన సాగునీరు, అరకొర కోతలు లేకుండా ఉచిత విద్యుత్ సరఫరా చేసి రైతాంగాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

సంపాదకీయం

# ఎత్తుకెళ్లిన ఆయుధాలు ఎవరికి అందజేయాలని?

దేశ రక్షణకు సంబంధించిన ఆయుధాగారం నుంచి ఏకే-203 రైఫిళ్లు, ఐఎన్ఎస్ఏఎస్ ఆయుధం, పిస్టళ్లు, మేగజైన్లు, వేలాది రౌండ్ల మందుగుండు సామగ్రి, నైట్ విజన్ పరికరాలు మాయమవడం సాధారణ దొంగతనం కాదు. దేశ రక్షణ వ్యవస్థపై ప్రజలకు ఉన్న విశ్వాసాన్ని కదిలించే తీవ్రమైన భద్రతా లోపం. అత్యంత కట్టుదిట్టమైన భద్రత ఉంటుందని భావించే సైనిక కంటోన్మెంట్ నుంచి ఒక మాజీ సైనికుడు రాత్రివేళ ప్రవేశించి ఇన్ని ఆయుధాలను ఎత్తుకెళ్లగలిగాడంటే భద్రతా వ్యవస్థలోని లోపాలు ఎంత తీవ్రంగా ఉన్నాయో అర్థమవుతుంది.

పదహారేళ్లు సైన్యంలో పనిచేసిన వ్యక్తికి ఆయుధాగారాల భద్రతా విధానాలు తెలియకుండా ఉండవు. అలాంటి వ్యక్తి ఆయుధాలను ఎత్తుకెళ్లి నెల రోజుల పాటు అవి బయట ఉన్న విషయం గుర్తించబడకపోవడం మరింత ఆందోళన కలిగించే విషయం. ఆయుధాల లెక్కింపు సక్రమంగా జరిగిందా? తాళాల నిర్వహణలో నిర్లక్ష్యం జరిగిందా? సెంట్రీ డ్యూటీలో లోపం ఉందా? సీసీటీవీ నిఘా ఎలా పనిచేసింది? ఆయుధాలు మాయమైన వెంటనే ఎందుకు గుర్తించలేకపోయారు? ఈ ప్రశ్నలకు సైనిక వ్యవస్థ సమాధానం చెప్పాల్సిన అవసరం ఉంది. అయితే ఈ ఘటనలో అత్యంత కీలకమైన ప్రశ్న దొంగతనం ఎలా జరిగిందన్నది మాత్రమే కాదు. ఎత్తుకెళ్లిన ఆయుధాలు ఎవరికి అందజేయాలని? అన్నదే అసలు ప్రశ్న. పదవీ విరమణపై అసంతృప్తితోనే ఈ పని చేశాడన్న వివరణ ఒక్కటే ఈ వ్యవహారంలోని అన్ని అనుమానాలను నివృత్తి చేయదు. వ్యక్తిగత అసంతృప్తి కోసం నాలుగు ఏకే-203 రైఫిళ్లు, ఇతర ఆయుధాలు, మేగజైన్లు, వేలాది రౌండ్ల మందుగుండు సామగ్రిని ఎత్తుకెళ్లాల్సిన అవసరం ఏమిటన్నది తార్కికంగా ప్రశ్నించాల్సిన అంశమే.

ముఖ్యంగా ఆయుధాలను ఒకే చోట ఉంచకుండా కొంకూర్, యాప్రాల్, అచ్చంపేట తదితర ప్రాంతాల్లో దాచడం కూడా దర్యాప్తు సంస్థలు లోతుగా పరిశీలించాల్సిన అంశం. ఆ ప్రాంతాలను ఎందుకు ఎంచుకున్నాడు? అక్కడ అతనికి ఎవరైనా పరిచయస్తులు ఉన్నారా? ఆయుధాలను ఎవరికైనా విక్రయించేందుకు ప్రయత్నించాడా? ఎవరైనా అప్పగించేందుకు ఏర్పాట్లు చేశాడా? మధ్యవర్తులు ఎవరైనా ఉన్నారా? ఈ ఆయుధాల కోసం ఎవరైనా ముందుగానే సంప్రదించారా? నిందితుడి ఫోన్ కాల్స్, సందేశాలు, ఆర్థిక లావాదేవీలు, ప్రయాణ వివరాలు, పరిచయాలన్నింటినీ పరిశీలించినప్పుడే అసలు ఉద్దేశం వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

ఆయుధాలు స్వాధీనం కావడం ఒక ముఖ్యమైన విజయం. కానీ దాంతో కేసు పూర్తయినట్లు కాదు. ఆయుధాలు దొరికాయి కాబట్టి వాటి వెనుక ఉన్న ఉద్దేశం కూడా బయటపడిందని భావించకూడదు. ఆయుధాలు ఎవ్వరికి వెళ్లాల్సి ఉంది, ఎవరికి చేరాల్సి ఉంది, వాటిని ఎవరైనా కోరారా, వాటి అక్రమ తరలింపులో మరెవరైనా సహకరించారా అన్న కోణాల్లో దర్యాప్తు జరగాలి. ఆధారాలు లభించే వరకు ఎవరిపైనా అనుమానాలను మోపడం సరికాదు. అదే సమయంలో ఏ కోణాన్నీ ముందుగానే కొట్టిపారేయడం కూడా ప్రమాదకరం.

బొల్లారం పోలీసులు, హైదరాబాద్ టాస్క్‌ఫోర్స్, మల్కాజిగిరి ఎస్ఓటీ బృందాలు సమన్వయంతో దర్యాప్తు చేసి నిందితుడిని పట్టుకోవడం అభినందనీయం. అయితే అరెస్టుతో కాకుండా ఆయుధాల వెనుక ఉన్న పూర్తి నెట్‌వర్క్, ఉద్దేశం, పరిచయాలు వెలుగులోకి వచ్చినప్పుడే ఈ కేసు అసలు గుట్టు విప్పినట్లవుతుంది. దేశ రక్షణకు సంబంధించిన ఆయుధాలు అక్రమంగా బయటకు రావడం వెనుక వ్యక్తిగత చర్య మాత్రమే ఉందా, లేక మరేదైనా కుట్ర కోణం ఉందా అన్నది స్పష్టంగా తేలాలి.

ఇదే సమయంలో సైన్యం కూడా ఈ ఘటనను ఒక హెచ్చరికగా తీసుకోవాలి. ఆయుధాగారాల్లో లెక్కింపు విధానం, తాళాల నిర్వహణ, సెంట్రీ వ్యవస్థ, సీసీటీవీ నిఘా, ప్రవేశ నియంత్రణ, ఆకస్మిక తనిఖీలను సమీక్షించాలి. ఒక మాజీ సైనికుడికి తెలిసిన భద్రతా లోపాలను మరొకరు కూడా ఉపయోగించుకునే అవకాశం లేకుండా వ్యవస్థను మరింత పటిష్టం చేయాలి.

దేశాన్ని కాపాడే సైనికుల చేతుల్లో ఉండాల్సిన ఆయుధాలు భద్రతా వ్యవస్థలోని లొసుగుల కారణంగా బయటకు వెళ్లడం అత్యంత తీవ్రమైన విషయం. ఇది ఒక పోలీసు కేసుగా ముగిస్తే మరో ప్రమాదానికి తలుపులు తెరిచినట్లే. ఆయుధాలను ఎత్తుకెళ్లిన వ్యక్తిని పట్టుకోవడం ఎంత ముఖ్యమో, ఆ ఆయుధాలు చేరాల్సిన వ్యక్తులను గుర్తించడం అంతకంటే ముఖ్యం.

అందుకే ఈ కేసులో దర్యాప్తు సంస్థల ముందున్న అసలు ప్రశ్న ఒక్కటే-ఎత్తుకెళ్లిన ఆయుధాలు ఎవరికి అందజేయాలని? ఆ ప్రశ్నకు సమాధానం దొరికే వరకు ఈ వ్యవహారాన్ని కేవలం ఒక మాజీ సైనికుడి దొంగతనంగా పరిగణించకూడదు.

# ఏఐ కోసం పరుగులో.. మానవ భద్రత ఎక్కడ?




కృత్రిమ మేధస్సు (ఏఐ) భవిష్యత్తు గురించి జరుగుతున్న చర్చలో ఒక కొత్త హెచ్చరిక ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా తీవ్రమైన ప్రశ్నలను లేవనెత్తుతోంది. ఆంత్రోపిక్, ఓపెన్‌ఏఐ సంస్థల్లో పనిచేసిన పరిశోధకుడు జాకబ్ కాక్సన్ సెప్టెంబర్ 8న ఆంత్రోపిక్‌కు రాజీనామా చేస్తూ, అత్యంత శక్తివంతమైన, స్వయంగా మెరుగుపడగల ఏఐ వ్యవస్థలను అభివృద్ధి చేసే పోటీ మానవ భద్రత కంటే వేగంగా సాగుతోందని హెచ్చరించారు. ఆయన మాటలను కేవలం ఒక ఉద్యోగి అసంతృప్తిగా కొట్టిపారేయడం కష్టం. ఎందుకంటే ఆయన ఆందోళనకు ఆంత్రోపిక్‌లోనే ఏఐ అలైన్‌మెంట్ పరిశోధనకు నాయకత్వం వహిస్తున్న ఇవాన్ హుబింగర్ నుంచి కూడా గణనీయమైన మద్దతు లభించింది. హుబింగర్ తన వ్యక్తిగత అంచనా ప్రకారం వచ్చే దశాబ్దంలో ఏఐ మానవాళిని అంతం చేసే అవకాశం 10 శాతానికి మించి ఉందని పేర్కొన్నారు. అదే సమయంలో ప్రస్తుత ఏఐ మోడళ్ల వల్ల తక్షణ ముప్పు తక్కువగా ఉందని, తన ప్రధాన ఆందోళన భవిష్యత్తులో రికర్సివ్ సెల్ఫ్-ఇంప్రూవ్‌మెంట్ ద్వారా సూపర్‌ఇంటెలిజెన్స్ ఏర్పడటంపైనేనని ఆయన స్పష్టం చేశారు.

ఇక్కడ అసలు ప్రశ్న "ఏఐ మానవాళిని అంతం చేస్తుందా?" అన్నది మాత్రమే కాదు. అంతకంటే ముఖ్యమైన ప్రశ్న, అలాంటి ప్రమాదం ఉందని పరిశోధకులే చెబుతున్నప్పుడు, దానిని నిర్ధారించే భద్రతా వ్యవస్థలు పూర్తిగా సిద్ధం కాకముందే ఎందుకు మరింత శక్తివంతమైన వ్యవస్థలను అభివృద్ధి చేయాలి? ఇదే నేటి ఏఐ పోటీ యొక్క ప్రధాన నైతిక వైరుధ్యం. కంపెనీలు ఒకదానిని మించి మరొకటి ముందుకు వెళ్లాలని చూస్తున్నాయి. అమెరికా-చైనా సాంకేతిక పోటీ, పెట్టుబడిదారుల ఒత్తిడి, మార్కెట్ ఆధిపత్యం, కంప్యూటింగ్ సామర్థ్యాల కోసం జరుగుతున్న పోటీ, ఇవన్నీ వేగాన్ని ప్రోత్సహిస్తున్నాయి. కానీ భద్రత మాత్రం పోటీతో వేగం పెంచుకోలేని రంగం. ఒకసారి నియంత్రణ తప్పిన అత్యంత స్వయంప్రతిపత్తి కలిగిన వ్యవస్థను విడుదల చేసిన తర్వాత దాన్ని వెనక్కి తీసుకోవడం సాఫ్ట్‌వేర్ అప్‌డేట్‌ను వెనక్కి తీసుకున్నంత సులభం కాకపోవచ్చు.

అయితే ఇక్కడ విమర్శనాత్మకంగా చూడాల్సిన మరో అంశం ఉంది. "వచ్చే పదేళ్లలో మానవాళి అంతం అయ్యే అవకాశం 10 శాతానికి పైగా ఉంది" అనేది శాస్త్రీయంగా కొలిచిన వాస్తవం కాదు. అది హుబింగర్ వ్యక్తిగత సంభావ్యత అంచనా. దానికి సంబంధించిన పూర్తి గణన, ఆధారాలు, ఊహించిన పరిస్థితులు బహిరంగంగా లేవు. అందువల్ల ఆ సంఖ్యను "ఏఐ వల్ల మానవాళి అంతం కావడం 10 శాతం ఖాయం" అన్నట్టుగా ప్రచారం చేయడం కూడా బాధ్యతారాహిత్యమే. భయాన్ని వ్యాపింపజేయడం ఎంత తప్పో, ప్రమాదాన్ని పూర్తిగా తిరస్కరించడం కూడా అంతే తప్పు. శాస్త్రం అనిశ్చితిని అంగీకరిస్తుంది; ప్రజా విధానం ఆ అనిశ్చితిలో కూడా తీవ్రమైన ప్రమాదాలను ముందుగానే నియంత్రించాలి.

ఏఐ ప్రమాదం తప్పనిసరిగా రోబోట్లు మనుషులను తుపాకులతో కాల్చే హాలీవుడ్ దృశ్యంలా ఉండాల్సిన అవసరం లేదు. అత్యంత శక్తివంతమైన ఏజెంట్లు సైబర్ వ్యవస్థల్లోకి చొరబడటం, కీలక మౌలిక సదుపాయాలను ప్రభావితం చేయడం, తప్పుడు సమాచారాన్ని విస్తృత స్థాయిలో వ్యాప్తి చేయడం, మానవ నిర్ణయ ప్రక్రియలను ప్రభావితం చేయడం, లేదా జీవసాంకేతిక పరిజ్ఞానాన్ని దుర్వినియోగం చేయడానికి అవసరమైన సామర్థ్యాలను పెంచడం వంటి మార్గాల్లో ప్రమాదాన్ని సృష్టించవచ్చు. ఇటీవలి పరీక్షల్లో కొన్ని ఏజెంట్లు నిర్దేశించిన సురక్షిత వాతావరణాల సరిహద్దులను దాటి వాస్తవ వ్యవస్థలను యాక్సెస్ చేయడానికి ప్రయత్నించిన ఘటనలు కూడా ఈ చర్చకు నేపథ్యంగా ఉన్నాయి.

ఇక్కడ "అలైన్‌మెంట్" సమస్య అత్యంత కీలకం. మనిషి కోరుకున్న లక్ష్యాన్ని ఏఐకి చెప్పడం మాత్రమే దాన్ని మానవ ప్రయోజనాలకు అనుగుణంగా మార్చదు. అత్యంత తెలివైన వ్యవస్థ మన ఆదేశాలను అక్షరాలా పాటిస్తూ, మనం ఊహించని మార్గంలో వాటిని అమలు చేస్తే? మన లక్ష్యాన్ని సాధించడానికి మనం అంగీకరించని చర్యను "సరైనది"గా భావిస్తే? మన పర్యవేక్షణను అడ్డుకోవడం తన లక్ష్య సాధనకు అవసరమని నిర్ణయిస్తే? ఈ ప్రశ్నలకు సంతృప్తికరమైన సమాధానం ఇంకా లేదు. స్వయంగా తన తదుపరి తరాన్ని మరింత శక్తివంతంగా రూపొందించగల వ్యవస్థల విషయంలో ఈ సమస్య మరింత తీవ్రమవుతుంది.

అయితే "ఏఐ అభివృద్ధిని పూర్తిగా ఆపాలి" అనడం కూడా ఆచరణాత్మక పరిష్కారం కాదు. ఒక దేశం లేదా కంపెనీ ఆగితే మరొక దేశం ఆగుతుందని హామీ లేదు. ముఖ్యంగా అమెరికా-చైనా పోటీ నేపథ్యంలో ఏకపక్ష నియంత్రణ వ్యూహాత్మకంగా ప్రతికూల ఫలితాలు ఇవ్వవచ్చు. అందుకే కాక్సన్ సూచించిన అంతర్జాతీయ సమన్వయం కీలకం. అణుశక్తి, జీవ ఆయుధాలు, వాతావరణ మార్పు వంటి రంగాల్లో ప్రపంచ దేశాలు కనీసం కొన్ని నియమాలపై సహకరించినట్లే, అత్యంత శక్తివంతమైన ఏఐ వ్యవస్థల విషయంలో కూడా అంతర్జాతీయ భద్రతా ప్రమాణాలు అవసరం.

అసలు సమస్య సాంకేతికతలోనే లేదు; దానిని అభివృద్ధి చేసే వ్యవస్థలో ఉంది. ప్రజా ప్రయోజనం కంటే మార్కెట్ ఆధిపత్యం, భద్రత కంటే "ముందుగా మార్కెట్లోకి తీసుకురావడం", దీర్ఘకాలిక ప్రమాదాల కంటే తక్షణ లాభాలు ప్రాధాన్యం పొందితే అత్యాధునిక ఏఐ ప్రమాదకరంగా మారే అవకాశం పెరుగుతుంది. అందుకే స్వతంత్ర భద్రతా పరీక్షలు, తప్పనిసరి ప్రమాద అంచనాలు, మోడల్ సామర్థ్యాలకు అనుగుణమైన నియంత్రణలు, కంప్యూటింగ్ వనరుల పర్యవేక్షణ, అంతర్జాతీయ ఒప్పందాలు, ప్రమాదకర సామర్థ్యాలపై స్పష్టమైన ప్రమాణాల నియమావళి, వాటి ఆచరణ కూడా అవసరం అవుతుంది.


జాకబ్ కాక్సన్ రాజీనామాను "ఏఐ మానవాళిని అంతం చేయబోతోంది" అన్న భయ ప్రచారంగా చూడటం సరైంది కాదు. అలాగే దాన్ని "మానవ వినాశనం ఖాయం" అన్న ప్రవచనంగా మార్చడం కూడా సరైంది కాదు. కానీ ఒక విషయం మాత్రం విస్మరించలేం: ఏఐని నిర్మిస్తున్న కొందరు శాస్త్రవేత్తలకే దాని భవిష్యత్తుపై నమ్మకం కంటే భయం ఎక్కువగా కనిపిస్తే, సమాజం ఆందోళన వ్యక్తం చేయడానికి కారణం ఉంది. సాంకేతిక పురోగతిని ఆపడం లక్ష్యం కాకపోయినా, మానవ నియంత్రణకు హామీ లేని స్థాయికి సాంకేతికతను తీసుకెళ్లే ముందు భద్రతను నిరూపించడం మాత్రం తప్పనిసరి. "ముందుగా సూపర్‌ఇంటెలిజెన్స్‌ను తయారు చేద్దాం, తర్వాత దాన్ని ఎలా నియంత్రించాలో చూద్దాం" అనే విధానం శాస్త్రీయ ధైర్యం కాదు, మానవాళినే ప్రయోగశాలగా మార్చే ప్రమాదకరమైన ప్రయోగం.



డాక్టర్ కోలాహలం రామ్ కిశోర్
9849328496.

# మట్టి నుంచి మట్టికే...ఇదే ప్రకృతి ధర్మం..!

### వినాయకుడి పూజలో ప్రకృతిని మరిచిపోతే... భక్తి అసంపూర్ణమే



వినాయక చవితి వస్తోంది. ఇళ్లలో పండుగ సందడి మొదలవుతుంది. వీధుల్లో మండపాలు సిద్ధమవుతాయి. వినాయకుడి విగ్రహాలు ప్రతిష్ఠకు సిద్ధమవుతాయి. భక్తి, ఉత్సాహం, సంబరాలు ఒకవైపు...అదే సమయంలో మన ముందున్న మరో ప్రశ్న ఈ పండుగ ప్రకృతికి ఎంత మేలు చేస్తోంది..? ఎంత నష్టం చేస్తోంది..? ఇది భక్తిని ప్రశ్నించే ప్రశ్న కాదు. భక్తి పేరుతో మనం ప్రకృతిపై చూపుతున్న ప్రభావాన్ని ప్రశ్నించే ప్రశ్న. వినాయకుడిని పూజించేది విఘ్నాలు తొలగాలని. మరి అదే పండుగ తర్వాత మన చెరువులు, కుంటలు, నదులు కాలుష్యానికి గురైతే...మనం తొలగించాల్సిన విఘ్నాలను మనమే సృష్టిస్తున్నట్టుకాదా..? అందుకే ఈసారి వినాయక చవితిని ఒక కొత్త ఆలోచనతో చూడాల్సిన అవసరం ఉంది. మట్టి నుంచి పుట్టిన వినాయకుడు...మట్టిలోకే తిరిగి వెళ్లాలి. అదే ప్రకృతి ధర్మం. మనిషి జీవితం మట్టితో విడదీయలేనిది. మన ఆహారం మట్టిలోనే పుడుతుంది. చెట్లు మట్టిలోనే పెరుగుతాయి. మన జీవన వ్యవస్థకు ఆధారమైన నీరు, నేల, జీవవైవిధ్యం అన్నీ పరస్పరం అనుసంధానమై ఉంటాయి. అలాంటి మట్టితో వినాయకుడిని తయారు చేసి పూజించడం మన సంస్కృతిలోని ప్రకృతి అనుబంధాన్ని గుర్తు చేస్తుంది. కానీ కాలక్రమంలో పండుగ రూపం మారింది. సహజ మట్టికి బదులుగా కొన్ని చోట్ల కృత్రిమ పదార్థాలతో విగ్రహాల తయారీ పెరిగింది. రసాయన రంగుల వినియోగం పెరిగింది. భారీ విగ్రహాలు, భారీ అలంకరణలు, అధిక శబ్దాలు పండుగ వైభవానికి కొలమానాలుగా మారుతున్నాయి. అక్కడే మనం ఒక్కసారి ఆగి ఆలోచించాలి. పండుగ గొప్పదనం విగ్రహం ఎత్తులో ఉందా..? లేక మన ఆలోచన ఎత్తులో ఉందా..? నిమజ్జనం తర్వాత ఏమవుతుంది అన్నది కూడా పండుగలో భాగమే. సహజ మట్టితో తయారైన విగ్రహం నీటిలో కరిగి తిరిగి ప్రకృతిలో కలిసిపోవడం సహజ ప్రక్రియ. కానీ కృత్రిమ పదార్థాలు, రసాయన రంగులు నీటిలోకి చేరితే నీటి నాణ్యత, జలచరాల జీవనంపై ప్రతికూల ప్రభావాలు ఏర్పడే అవకాశం ఉంటుంది. మన పండుగ ముగిసిన చోట ప్రకృతికి సమస్య మొదలైతే...ఆ పండుగను ఒకసారి పునరాలోచించాల్సిందే. అందుకే మట్టి వినాయకుడిని ఎంచుకోవడం కేవలం పర్యావరణహితమైన ఒక ప్రత్యామ్నాయం కాదు. అది మనం తీసుకునే ఒక సామాజిక నిర్ణయం. మన పండుగ కోసం ప్రకృతికి అనవసరమైన భారాన్ని మోపబోమనే బాధ్యతాయుతమైన ప్రకటన. మనం అర్థం చేసుకోవాల్సిన అంశం ఏంటంటే మట్టి వినాయకుడు ఒక విగ్రహం కాదు... ఒక ఆలోచన. మట్టి వినాయకుడిని ఇంటికి తీసుకురావడం అంటే ఒక విగ్రహాన్ని కొనడం మాత్రమే కాదు. మన పిల్లలకు ఒక విలువను పరిచయం చేయడం. మట్టితో వినాయకుడిని స్వయంగా తయారు చేసే అవకాశం పిల్లలకు ఇస్తే అది కళను నేర్పడమే కాదు, ప్రకృతిని అర్థం చేసుకునే అవకాశం కూడా. మట్టి ఎక్కడి నుంచి వస్తుంది..? విగ్రహం ఎలా తయారవుతుంది..? నిమజ్జనం తర్వాత అది ఎలా ప్రకృతిలో కలుస్తుంది..? అనే విషయాలను పిల్లలు అనుభవం ద్వారా నేర్చుకుంటారు. పర్యావరణ స్పృహ ప్రసంగాలతో మాత్రమే రాదు. చిన్ననాటి అలవాట్లతో కూడా వస్తుంది. అందుకే పాఠశాలలు, కళా సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు మట్టి వినాయకుల తయారీ కార్యక్రమాలను ప్రోత్సహించాలి. తల్లిదండ్రులు పిల్లలను ఇందులో భాగస్వాములను చేయాలి. స్థానిక సంస్థలు పర్యావరణహిత నిమజ్జన విధానాలకు ప్రాధాన్యం ఇవ్వాలి. మన పండుగలు ప్రకృతికి దూరంగా ఉండాల్సిన అవసరం లేదు. నిజానికి మన సంప్రదాయాల్లో ప్రకృతికి ఎంతో ప్రాధాన్యం ఉంది. చెట్లు, నీరు, నేల, జంతువులు, పక్షులు... ఇవన్నీ మన జీవనంలో భాగాలుగానే భావించబడ్డాయి. కాబట్టి పండుగను ఆధునికంగా నిర్వహించడం అంటే ప్రకృతిని పక్కన పెట్టడం కాదు. ప్రకృతితో కలిసి పండుగను జరుపుకోవడం నేర్చుకోవడం. వినాయకుడు జ్ఞానానికి ప్రతీక. ఆయనను పూజించే మనం ప్రకృతిని కాపాడాల్సిన జ్ఞానాన్ని కూడా ఆచరణలో పెట్టాలి. భక్తి ఉండాలి... ప్రకృతీ బతకాలి. పండుగ ఉండాలి... కాలుష్యం ఉండకూడదు. నిమజ్జనం జరగాలి... నీటి జీవనం దెబ్బతినకూడదు.

ఇదే పండుగకు కొత్త నిర్వచనం కావాలి. మట్టి వినాయకుడిని ఎంచుకోవడం ద్వారా ప్రపంచం ఒక్కరోజులో మారిపోదు. కానీ మార్పు ఎప్పుడూ ఒక చిన్న నిర్ణయంతోనే మొదలవుతుంది.

ఒక కుటుంబం మట్టి వినాయకుడిని ఎంచుకుంటుంది. మరో కుటుంబం సహజ రంగులను ఎంచుకుంటుంది. ఒక పాఠశాల పిల్లలకు మట్టి విగ్రహాల తయారీ నేర్పుతుంది. ఒక కాలనీ పర్యావరణహిత నిమజ్జనాన్ని నిర్వహిస్తుంది. ఇలా చిన్న చిన్న నిర్ణయాలు కలిసి పెద్ద సామాజిక మార్పుగా మారతాయి. మన పండుగ మన ఆనందం కోసం. కానీ ఆ ఆనందానికి ప్రకృతి మూల్యం చెల్లించకూడదు. మన భక్తి నీటిని కలుషితం చేయకూడదు. మన సంబరం నేలను విషపూరితం చేయకూడదు. మన పూజ భవిష్యత్తు తరాలపై భారంగా మారకూడదు. అందుకే ఈ వినాయక చవితికి ఒక చిన్న నిర్ణయం తీసుకుందాం. మట్టి వినాయకుడినే ఎంచుకుందాం. సహజ రంగులకే ప్రాధాన్యం ఇద్దాం. పర్యావరణహిత నిమజ్జనాన్నే పాటిద్దాం. ప్రకృతిని కూడా కాపాడుదాం.అప్పుడు మాత్రమే మన భక్తి సంపూర్ణం అవుతుంది. పండుగకు అర్థం వస్తుంది. మన తర్వాతి తరాలకు జీవించే భవిష్యత్తు మిగులుతుంది.



- కస్తూరిదారా
jannukastoori@gmail.com

# తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట చరిత్రను మతతత్వ రాజకీయాలకు బలి చేయొద్దు




సెప్టెంబర్ 17ను కేవలం నిజాం లొంగిపోయిన రోజుగా.. హైదరాబాద్ భారత యూనియన్‌లో చేరిన రోజుగా చెప్పడం ఎంత అసంపూర్ణమో, దాన్ని హిందూ - ముస్లిం ఘర్షణగా చిత్రీకరించడం అంతే ప్రమాదకరం. భూమి, భుక్తి, వెట్టి విముక్తి, సామాజిక గౌరవం, ప్రజాస్వామ్యం కోసం రైతులు, కూలీలు, మహిళలు, దళితులు, ఆదివాసీలు సాగించిన తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటమే సెప్టెంబర్ 17 చరిత్రకు కేంద్రబిందువు. విలీనం అనే ఒక్క మాటలోనూ, విమోచనం అనే మతతత్వ నినాదంలోనూ ఈ చరిత్రను బంధించలేం. ఇది ప్రజల పోరాట చరిత్ర.

తెలంగాణలో సెప్టెంబర్ 17 చరిత్రను అర్థం చేసుకోవాలంటే ఆ తేదీకి దారి తీసిన సామాజిక, ఆర్థిక, రాజకీయ పరిణామాలను చూడాలి. నిజాం నిరంకుశ పాలనకు అండగా ఉన్న భూస్వామ్య - జాగీర్దారీ వ్యవస్థ, వెట్టి చాకిరీ, అక్రమ వసూళ్లు, కౌలు రైతులపై దోపిడీ, దొరల ఆధిపత్యం, ప్రజాస్వామిక హక్కుల నిరాకరణకు వ్యతిరేకంగా గ్రామీణ ప్రజల్లో సంవత్సరాలుగా పేరుకుపోయిన అసంతృప్తి ఒక దశలో తిరుగుబాటుగా మారింది. బానిసత్వాన్ని భరించిన ప్రజలు "ఇక చాలు" అంటూ ఎదిరించారు. ఆ ఎదురు తిరుగుదలే తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి పునాది వేసింది.

ఈ పోరాటాన్ని కేవలం నిజాం వ్యతిరేకతకే పరిమితం చేయడం దాని వర్గ స్వభావాన్ని కుదించడం. ఇది భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి నిర్మూలన కోసం, దొరల పెత్తనానికి ముగింపు కోసం, సామాజిక గౌరవం కోసం, ప్రజాస్వామిక హక్కుల కోసం సాగిన ప్రజా ఉద్యమం. అందుకే ఈ చరిత్రలో మతం, కులం, ప్రాంతం అనే గోడలను దాటి నిలిచిన ప్రజలు కనిపిస్తారు. షేక్ బందగీ నుంచి దొడ్డి కొమురయ్య వరకు, చాకలి ఐలమ్మ నుంచి జాటోత్ ఠానూ నాయక్ వరకు, షోయబుల్లా ఖాన్, మఖ్దూం మొహియుద్దీన్, హసన్ నాసిర్ వంటి ప్రజా నాయకుల వరకు ఈ పోరాట చరిత్ర విస్తరించింది.

ఈ ప్రజా ఉద్యమానికి కమ్యూనిస్టులు నాయకత్వం వహించారు. ఆంధ్ర మహాసభ ప్రజా చైతన్యానికి వేదికగా నిలిచింది. చిన్న చిన్న హక్కుల కోసం సాగిన ఉద్యమం క్రమంగా భూమి, భుక్తి, వెట్టి విముక్తి, ప్రజాస్వామ్యం కోసం జరిగిన విస్తృత రైతాంగ పోరాటంగా ఎదిగింది. సుమారు మూడు వేల గ్రామాలకు విస్తరించిన ఈ ఉద్యమం అనేక ప్రాంతాల్లో గ్రామ ప్రజా పాలనా నిర్మాణాలకు దారితీసింది. భూస్వాముల ఆధీనంలో ఉన్న భూములను స్వాధీనం చేసుకుని పేద రైతులకు పంచే ప్రక్రియ సాగింది. సుమారు పది లక్షల ఎకరాల భూమి పేదలకు అందినట్లు పోరాట చరిత్రలో నమోదైంది.

ఈ అంశాలను పక్కనబెట్టి సెప్టెంబర్ 17ను కేవలం ఒక రాజు లొంగిపోయిన రోజుగా చెప్పడం అంటే తెలంగాణ చరిత్రలోని ప్రజా శక్తిని చెరిపివేయడమే. హైదరాబాద్ సంస్థానంలో నిజాం పాలనకు రాజకీయ అధికారం ఉండటమే కాకుండా, గ్రామీణ ప్రాంతాల్లో భూస్వామ్య, జాగీర్దారీ, దేశ్‌ముఖ్, దొరల ఆధిపత్యం ప్రజల జీవితాలను నియంత్రించేది. భూమి మీద హక్కు లేని రైతు పంట పండించినా దాని మీద పూర్తి హక్కు ఉండేది కాదు. శ్రమించినా దాని ఫలితం అతని చేతిలో ఉండేది కాదు. వెట్టి పేరుతో ఉచిత శ్రమ చేయించేవారు. అక్రమ పన్నులు, బలవంతపు వసూళ్లు, కౌలు దోపిడీ, సామాజిక అవమానాలు గ్రామీణ జీవితంలో భాగమయ్యాయి.

"దొర బాంచెన్... నీ కాల్మొక్తా..." అంటూ తలవంచిన ప్రజలే ఒక దశలో "ఇక చాలు" అన్నారు. ఆ మాటలోనే తెలంగాణ రైతాంగ తిరుగుబాటు రాజకీయ అర్థం ఉంది. అది కేవలం ఒక వ్యక్తి మీద కోపం కాదు. ఒక దోపిడీ వ్యవస్థ మీద తిరుగుబాటు. భూమి మీద హక్కు, శ్రమకు విలువ, మనిషికి గౌరవం, జీవించడానికి స్వేచ్ఛ కోసం జరిగిన పోరాటం. అందుకే.. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటాన్ని ఒక మతానికి వ్యతిరేకంగా జరిగిన యుద్ధంగా చిత్రీకరించడం చరిత్రను వక్రీకరించడమే. నిజాం పాలనలోని నిరంకుశత్వాన్ని వ్యతిరేకించిన ప్రజలలో హిందువులున్నారు, ముస్లింలున్నారు. దళితులు, ఆదివాసీలు, వెనుకబడిన వర్గాల ప్రజలున్నారు. మహిళలు ముందుండి పోరాడారు. భూమి, శ్రమ, గౌరవం, ప్రజాస్వామ్యం అనే ప్రశ్నలు మతాలకతీతమైనవి. దోపిడీకి మతం ఉండదు. వెట్టికి మతం ఉండదు. భూస్వామ్య దోపిడీకి మతం ఉండదు. అలాగే విముక్తి కోసం జరిగే పోరాటానికి కూడా మతపు గోడలు ఉండవు.

1947 ఆగస్టు 15న భారతదేశం బ్రిటిష్ వలస పాలన నుంచి స్వాతంత్ర్యం పొందినప్పటికీ హైదరాబాద్ సంస్థానం వెంటనే భారత యూనియన్‌లో విలీనం కాలేదు. నిజాం స్వతంత్రంగా ఉండాలని ప్రయత్నించాడు. ఇదే సమయంలో సంస్థానంలోని ప్రజల ప్రజాస్వామిక ఆకాంక్షలు, భూస్వామ్య వ్యతిరేక పోరాటం మరింత ఉధృతమయ్యాయి. కమ్యూనిస్టుల నాయకత్వంలోని రైతాంగ పోరాటం గ్రామీణ ప్రాంతాల్లో విస్తరిస్తుండగా, నిజాం ప్రభుత్వం దాన్ని అణచివేయడానికి సైన్యం, పోలీసులు, రజాకార్లను ఉపయోగించింది. 1948 సెప్టెంబర్‌లో భారత ప్రభుత్వం చేపట్టిన సైనిక చర్యతో నిజాం పాలన ముగిసింది. సెప్టెంబర్ 13న సైనిక చర్య ప్రారంభమై, సెప్టెంబర్ 17న నిజాం భారత ప్రభుత్వానికి లొంగిపోయాడు. హైదరాబాద్ సంస్థానం భారత యూనియన్‌లోకి వచ్చింది. ఇది చరిత్రలో ఒక కీలక పరిణామం. అయితే సెప్టెంబర్ 17తో ప్రజల పోరాటం ముగిసిపోయిందని చెప్పడం కూడా వాస్తవానికి సరిపోదు. నిజాం పాలన ముగిసిన తర్వాత కూడా కమ్యూనిస్టుల ఆధ్వర్యంలోని రైతాంగ పోరాటంపై సైనిక దమనకాండ కొనసాగింది. భూస్వామ్య ప్రయోజనాలను కాపాడే ప్రయత్నాలు జరిగాయి. ప్రజలు సాధించిన భూములు, హక్కులపై తిరిగి దాడులు జరిగాయి. ఇక్కడే సెప్టెంబర్ 17 చరిత్రను కేవలం "విలీనం" అనే ఒకే పదంతో నిర్వచించడంలోని పరిమితి బయటపడుతుంది. భారత యూనియన్‌లో హైదరాబాద్ సంస్థానం చేరడం ఒక రాజకీయ పరిణామం. దానికి దారితీసిన ప్రజా పోరాటం మరో విస్తృత చారిత్రక ప్రక్రియ. ఈ రెండింటినీ కలిపి చూడాలి. ఒకదానిని మరొకటి మింగివేయకూడదు. అదే సమయంలో సెప్టెంబర్ 17 తర్వాత జరిగిన హింసను కూడా చరిత్ర నుంచి తొలగించలేం. హైదరాబాద్ సంస్థానం భారత యూనియన్‌లో విలీనమైన తరువాత కొన్ని ప్రాంతాల్లో ముస్లిం ప్రజలపై సామూహిక హింస చోటుచేసుకుంది. సుందర్‌లాల్ కమిటీ నివేదిక ఈ హింసలో జరిగిన ప్రాణనష్టాన్ని నమోదు చేసింది. ఈ అంశాన్ని ప్రస్తావించడం నిజాం నిరంకుశత్వాన్ని సమర్థించడం కాదు. రజాకార్ల హింసను సమర్థించడం కాదు. చరిత్రలో జరిగిన ప్రతి ప్రజా విషాదాన్ని దాని సామాజిక రాజకీయ సందర్భంలో గుర్తించడం మాత్రమే. ఒక దశలో జరిగిన ముస్లిం ప్రజలపై హింసను దాచిపెట్టి, మొత్తం చరిత్రను హిందూ - ముస్లిం విజయగాథగా మార్చడం చరిత్రకు, ప్రజలకు రెండింటికీ అన్యాయం.

ఇప్పుడు సెప్టెంబర్ 17ను చుట్టుముట్టి జరుగుతున్న రాజకీయ పోరాటాన్ని ఈ చారిత్రక నేపథ్యంతోనే చూడాలి. భారతీయ జనతా పార్టీ, సంఘ్ పరివార్ సంస్థలు దీనిని "హైదరాబాద్ విమోచన దినోత్సవం"గా ప్రచారం చేస్తూ ప్రధానంగా హిందూ - ముస్లిం విభజన కోణంలో చరిత్రను చెప్పేందుకు ప్రయత్నిస్తున్నాయి. నిజాం పాలనను వ్యతిరేకించిన ప్రజల పోరాటాన్ని ఒక మతానికి చెందిన ప్రజలపై జరిగిన విముక్తి పోరాటంగా చూపడం ద్వారా కమ్యూనిస్టుల నాయకత్వాన్ని, రైతాంగ పోరాట స్వభావాన్ని, భూస్వామ్య వ్యతిరేక లక్ష్యాలను పక్కకు నెట్టే ప్రయత్నం జరుగుతోంది. చరిత్రలో ఎవరు పోరాడారు..? ఎవరు జైలుకెళ్లారు..? ఎవరు ప్రాణాలు కోల్పోయారు..? ఎవరు భూమి కోసం తుపాకీ పట్టారు..? ఎవరు వెట్టికి వ్యతిరేకంగా నిలబడ్డారు..? మహిళలు ఏ పాత్ర పోషించారు..? దళితులు, ఆదివాసీలు, పేద రైతులు ఏ స్థాయిలో పాల్గొన్నారు? ఈ ప్రశ్నలకు సమాధానం చెప్పకుండా కేవలం "విమోచనం" అనే పదాన్ని ముందుకు తేవడం చరిత్రను రాజకీయ ప్రచారంగా మార్చడమే.

సర్దార్ వల్లభభాయ్ పటేల్ నేతృత్వంలోని భారత ప్రభుత్వ సైనిక చర్యకు చారిత్రక ప్రాధాన్యం ఉంది. దాన్ని ఎవరూ తిరస్కరించాల్సిన అవసరం లేదు. కానీ ఆ చర్య ఒక్కటే తెలంగాణ ప్రజల విముక్తి చరిత్ర కాదు. సైనిక చర్యకు ముందే సంవత్సరాలుగా సాగిన ప్రజా ఉద్యమాన్ని, కమ్యూనిస్టుల నాయకత్వంలోని రైతాంగ పోరాటాన్ని, గ్రామాల్లో ప్రజలు నిర్మించుకున్న ప్రత్యామ్నాయ అధికార నిర్మాణాలను చరిత్ర నుంచి తొలగించలేం. పటేల్ పాత్రను గుర్తించడం కోసం ప్రజల పాత్రను చెరిపివేయాల్సిన అవసరం లేదు. కాంగ్రెస్ ప్రభుత్వం సెప్టెంబర్ 17ను "తెలంగాణ ప్రజా పాలన దినోత్సవం"గా గుర్తించడం మతతత్వ వ్యాఖ్యానాలకంటే భిన్నమైన రాజకీయ భాషను సూచిస్తుంది. అయినప్పటికీ ఒక పేరు పెట్టడం మాత్రమే ప్రజా పోరాట లక్ష్యాలను నెరవేర్చదు. ప్రజా పాలన అంటే భూమి కొద్దిమంది చేతుల్లో కేంద్రీకృతం కాకపోవడం, శ్రమకు న్యాయమైన ప్రతిఫలం లభించడం, కుల వివక్షకు ముగింపు, మహిళలకు సమాన హక్కులు, దళితులకు గౌరవం, ఆదివాసీలకు జల్ - జంగల్ - జమీన్‌పై హక్కు, యువతకు ఉపాధి, ప్రజలకు ప్రజాస్వామిక స్వేచ్ఛ ఉండటం. భారత రాష్ట్ర సమితి ప్రభుత్వం కూడా సెప్టెంబర్ 17ను "తెలంగాణ జాతీయ సమైక్యతా దినోత్సవం"గా నిర్వహించింది. సమైక్యత అనే భావనకు ప్రజాస్వామిక విలువ ఉన్నప్పటికీ, చరిత్రను ఒక అధికారిక ఉత్సవంగా మార్చడం వల్ల దాని వర్గ స్వభావం మరుగునపడే ప్రమాదం ఉంది. ప్రజల చరిత్రను పాలకుల కార్యక్రమాల చరిత్రగా మార్చకూడదు.



- మామిండ్ల రమేష్ రాజా
రాష్ట్ర కార్యదర్శి, సీపీఐ (ఎంఎల్)
లిబరేషన్ తెలంగాణ

మిగితా తరువాయి
రేపటి సంచికలో..

## పాడి రైతులకు గిట్టుబాటు ధర..
# గోపాలమిత్రలకు సంక్షేమ సౌకర్యాలు

- మధిర, కొడంగల్‌లో సెర్ప్ భాగస్వామ్యంతో పాడి గేదెల పంపిణీ
- పశుసంవర్ధక శాఖలో 1100 మందికిపైగా ఉద్యోగులకు ప్రమోషన్లు.. పారదర్శకంగా బదిలీలు : మంత్రి వాకిటి శ్రీహరి

**హైదరాబాద్ (జనంసాక్షి) :** రాష్ట్రంలో పాడి పరిశ్రమను మరింత బలోపేతం చేసి, పాడి రైతులను మెరుగైన ఆదాయం కల్పించడంతో పాటు గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర పశు సంవర్ధక, పాడి పారిశ్రామికాభివృద్ధి, మత్స్య శాఖ మంత్రి వాకిటి శ్రీహరి తెలిపారు. శుక్రవారం శాసనసభలో సభ్యులు పట్నోళ్ల సంజీవరెడ్డి, చిక్కుడు వంశీకృష్ణ, గండ్ర సత్యనారాయణ రావు, వీర్లపల్లి శంకరయ్యలు అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానం ఇచ్చారు. రాష్ట్రంలో పాల ఉత్పత్తి క్రమంగా పెరుగుతోందని మంత్రి తెలిపారు. 2024-25లో 59.35 లక్షల టన్నులు, 2025--26లో 61.75 లక్షల టన్నుల పాల ఉత్పత్తి నమోదైందన్నారు. 2026--27లో ఆరు నెలల కాలానికి సుమారు 30 లక్షల టన్నుల పాల ఉత్పత్తి జరుగుతుందని ముందస్తు అంచనా ఉన్నట్లు వెల్లడించారు.

**పాడి రైతులకు గిట్టుబాటు ధర : మంత్రి**

పాడి రైతుల కష్టానికి తగిన ప్రతిఫలం అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని మంత్రి తెలిపారు. 2026 ఆగస్టు 16 నుంచి గేదె పాలకు ప్రతి కిలో వెన్నకు రూ.914, ఆవు పాలకు ప్రతి కిలో వెన్నతో పాటు మొత్తం ఘనపదార్థాల ప్రాతిపదికన రూ.340 ధరలను నిర్ణయించినట్లు మంత్రి వెల్లడించారు. రైతులకు నాణ్యమైన పాల సేకరణకు అనుగుణంగా గిట్టుబాటు ధరలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని, పాడి రంగాన్ని గ్రామీణ కుటుంబాలకు స్థిరమైన ఆదాయ వనరుగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ ఉద్దేశమని తెలిపారు.

**మధిర, కొడంగల్‌లో పాడి గేదెల పంపిణీ**

పాడి రైతుల ఆదాయాన్ని పెంచే దిశగా మధిర,



కొడంగల్ నియోజకవర్గాల్లో సెర్ప్ భాగస్వామ్యంతో పాడి గేదెల పంపిణీ కార్యక్రమాన్ని చేపడుతున్నామని మంత్రి తెలిపారు. పాడి పశువుల సంఖ్యను పెంచడంతో పాటు, రైతులకు నిరంతర ఆదాయం వచ్చేలా పాడి ఆధారిత జీవనోపాధిని ప్రోత్సహిస్తున్నామని పేర్కొన్నారు.

**గోపాలమిత్రల సంక్షేమానికి ప్రాధాన్యం**

పాడి రంగంలో క్షేత్రస్థాయిలో కీలక సేవలు అందిస్తున్న గోపాలమిత్రల సంక్షేమానికి ప్రజా ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి తెలిపారు. గోపాలమిత్రలకు మెడిక్లెయిమ్, వ్యక్తిగత ప్రమాద బీమా, సకాలంలో గౌరవ వేతనం, శిక్షణ, సాంకేతిక సహాయం, పర్యవేక్షణ వంటి సౌకర్యాలు కల్పిస్తున్నట్లు వెల్లడించారు. పశువుల ఆరోగ్యం, పాడి రైతుల ప్రయోజనాలు, గ్రామీణ పాడి వ్యవస్థ బలోపేతంలో గోపాలమిత్రల పాత్ర కీలకమని మంత్రి అన్నారు.

**పశుసంవర్ధక శాఖలో ప్రమోషన్లు.. పారదర్శక బదిలీలు**

పశుసంవర్ధక శాఖలో సిబ్బంది సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందని మంత్రి తెలిపారు. 1100 మందికిపైగా ఉద్యోగులకు ప్రమోషన్లు ఇచ్చి, బదిలీల ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించామని వెల్లడించారు. ఉద్యోగుల సంక్షేమంతో పాటు శాఖ పనితీరును మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. పాడి పరిశ్రమలో ఆక్సిటోసిన్ ఇంజెక్షన్ల వినియోగాన్ని నిరోధించేందుకు ప్రస్తుతం ప్రభుత్వం వద్ద ప్రత్యేకమైన ప్రతిపాదన ఏదీ లేదని మంత్రి స్పష్టం చేశారు.

**బీసీల జనాభా లెక్కలు తేల్చాలి..**
**కులగణన చేపట్టాలి : మంత్రి వాకిటి**

దేశవ్యాప్తంగా బీసీల జనాభా, సామాజిక, విద్యా, ఆర్థిక పరిస్థితులపై స్పష్టమైన గణాంకాలు అందుబాటులోకి రావాలంటే కేంద్ర ప్రభుత్వం చేపట్టే జనగణనలో బీసీల కులగణనను తప్పనిసరిగా చేపట్టాలని రాష్ట్ర పశుసంవర్ధక, పాడి పారిశ్రామికాభివృద్ధి, మత్స్య, యువజన సర్వీసులు & క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి డిమాండ్ చేశారు. శుక్రవారం అసెంబ్లీలో కులగణనపై జరిగిన చర్చలో మంత్రి మాట్లాడారు. బీసీలకు రిజర్వేషన్లు ఎవరో ఇచ్చిన దానం కాదని, అది బీసీల హక్కు అని, సామాజిక న్యాయం కోసం దశాబ్దాలుగా సాగిన పోరాటం ఫలితమని మంత్రి స్పష్టం చేశారు.

# సీఎం ప్రజావాణి కార్యక్రమం స్ఫూర్తినిచ్చింది

## బీహార్‌లోనూ ఇదే తరహా విధానాలు అమలు చేస్తాం : బీహార్ గ్రూప్-1 అధికారుల వెల్లడి



**హైదరాబాద్, సెప్టెంబర్ 11 (జనంసాక్షి) :** రాష్ట్ర ప్రణాళికా మండలి వైస్ చైర్‌పర్సన్, రాష్ట్ర స్థాయి సీఎం ప్రజావాణి ఇన్‌చార్జ్ గద్వాల్ విజయలక్ష్మితో 120 మందితో కూడిన బీహార్ రాష్ట్ర గ్రూప్-1 అధికారుల బృందం శుక్రవారం మహాత్మా జ్యోతిబా పూలే ప్రజా భవన్‌లో భేటీ అయింది. ఈ సందర్భంగా బీహార్ అధికారులు సీఎం ప్రజావాణి కార్యక్రమం అమలు తీరును ప్రత్యక్షంగా పరిశీలించారు. ప్రజల నుంచి వినతులు స్వీకరించడం, వాటిని సంబంధిత శాఖలకు పంపించడం, సమస్యల పరిష్కారాన్ని పర్యవేక్షించడం వంటి విధానాలపై సీఎం ప్రజావాణి అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. అదే సమయంలో రాష్ట్ర స్థాయి సీఎం ప్రజావాణి ఇన్‌చార్జ్ గద్వాల్ విజయలక్ష్మి ప్రజల నుంచి వచ్చిన వినతులను స్వయంగా స్వీకరించారు. వారి సమస్యలను ఓపికగా విని, సంబంధిత అధికారులతో మాట్లాడి, అర్హమైన సమస్యలపై త్వరితగతిన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ప్రజావాణికి వచ్చే ప్రతి వినతిని బాధ్యతగా పరిశీలించి, సాధ్యమైనంత త్వరగా పరిష్కారం చూపేలా కృషి చేయాలని అధికారులకు తెలిపారు. ప్రజలతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకోవడం, అక్కడికక్కడే సంబంధిత అధికారులతో సమన్వయం చేయడం వంటి ప్రక్రియను బీహార్ అధికారుల బృందం ఆసక్తిగా పరిశీలించింది. "సీఎం ప్రజావాణి కార్యక్రమం మాకు ఎంతో స్ఫూర్తినిచ్చింది. బీహార్ రాష్ట్రంలోనూ ఇదే తరహా విధానాలను అమలు చేయడానికి ప్రయత్నిస్తాం. ప్రస్తుతం బీహార్‌లో అమలవుతున్న 'ప్రజా దర్బార్' వ్యవస్థలో కూడా ఇలాంటి సమర్థవంతమైన మార్పులు అవసరం" అని బీహార్ గ్రూప్-1 అధికారులు అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా గద్వాల్ విజయలక్ష్మి మాట్లాడుతూ, ముఖ్యమంత్రి శ్రీ ఎ. రేవంత్ రెడ్డి ప్రజల సమస్యలకు వేగంగా పరిష్కారం చూపాలనే లక్ష్యంతో ప్రజావాణి కార్యక్రమాన్ని రాష్ట్ర స్థాయి నుంచి జిల్లా, డివిజన్, మండల స్థాయి వరకు విస్తరించారని తెలిపారు. ప్రజల నుంచి అందుతున్న వినతులను సంబంధిత శాఖలతో సమన్వయం చేస్తూ పరిష్కరించేందుకు ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేశామని, సీఎం ప్రజావాణి ద్వారా సమస్యల పరిష్కారంలో 74 శాతం సక్సెస్ రేట్ సాధించామని ఆమె పేర్కొన్నారు. "ప్రజలు తమ సమస్యకు పరిష్కారం లభిస్తుందనే నమ్మకంతో ప్రజావాణికి వస్తున్నారు. ఆ నమ్మకాన్ని నిలబెట్టుకోవడమే మా ప్రధాన బాధ్యత" అని గద్వాల్ విజయలక్ష్మి అన్నారు. ఈ కార్యక్రమంలో సీఎం ప్రజావాణి స్టేట్ నోడల్ అధికారి కె. విద్యాసాగర్, ఎం సీ ఆర్ హెచ్ ఆర్ డీ అధికారి ఉషారాణి, డిప్యూటీ కలెక్టర్ వెంకటేశ్వర్లు, ఏ సీ పీ ఉమేందర్ పాల్గొన్నారు.

# ఎంబీబీఎస్ అడ్మిషన్ల కన్వీనర్ కోటా రెండో విడత కౌన్సెలింగ్ ప్రారంభం

**నేటి నుంచి 14వ తేదీ వరకూ వెబ్ ఆప్షన్లకు గడువు**

**15న సీట్ల కేటాయింపు, 16వ తేదీన మేనేజ్మెంట్ కోటా ఫస్ట్ ఫేజ్ సీట్ల కేటాయింపు**

**హైదరాబాద్, సెప్టెంబర్ 11 (జనంసాక్షి) :** ఎంబీబీఎస్ కన్వీనర్ కోటా సెకండ్ ఫేజ్ కౌన్సెలింగ్‌కు కాళోజీ నారాయణరావు యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్ (ఖచీ=ఖనూ) శుక్రవారం నోటిఫికేషన్ విడుదల చేసింది. అభ్యర్థులు సెప్టెంబర్ 11 సాయంత్రం 4:30 గంటల నుంచి సెప్టెంబర్ 14 మధ్యాహ్నం 1:00 గంటల వరకు వెబ్ ఆప్షన్లు నమోదు చేసుకోవచ్చు. ఈ కౌన్సెలింగ్‌లో ఖాళీగా ఉన్న ఎంబీబీఎస్ సీట్లతో పాటు పెంచిన సీట్లు కూడా అందుబాటులో ఉంటాయి. అభ్యర్థులు యూనివర్సిటీ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్న సీట్ల వివరాలను పరిశీలించి, తమ వెబ్ ఆప్షన్లను జాగ్రత్తగా నమోదు చేసుకోవాలని యూనివర్సిటీ సూచించింది. సెప్టెంబర్ 15న సీట్లు కేటాయిస్తామని తెలిపింది. అలాగే, మేనేజ్‌మెంట్ కోటా కింద మొదటి విడత ఎంబీబీఎస్ /బీడీఎస్ సీట్ల కేటాయింపును సెప్టెంబర్ 16న విడుదల చేయనున్నట్లు యూనివర్సిటీ తెలిపింది.

# బీసీ కులగణన చేపట్టకపోతే బిజెపినీ గద్దె దింపడం ఖాయం

## తక్షణమే జాతి జనగణను నిలిపివేయాలి

**జనగణన ప్రశ్నావళిని వెంటనే రద్దు చేయాలి**

**వచ్చే నెలలో లక్షలాదీ మందితో పార్లమెంట్ ముట్టడి చేపడతాం**

**బీసీల ధర్మ పోరాట దీక్షలో వక్తల హెచ్చరిక**



**ముషీరాబాద్ (జనంసాక్షి) :** దేశంలోని ఎనబై కోట్ల మంది బీసీల జీవితాలతో కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం చెలగాటమాడుతుందని, పేరుకు కులగనన చేస్తున్నామని చెప్తూనే కులగనన ప్రశ్నావళిలో బీసీ కాలం చేర్చకుండా, ప్రతి కులానికి యూనికోడ్ కేటాయించకుండా బీసీలను నమ్మించి వంచిస్తుందని, ఇదే వైఖరి అవలంబిస్తే దేశంలోని బీసీలు ఒక్కటై బిజెపిని గద్దె దించడం ఖాయమని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ ప్రధాని నరేంద్ర మోడీని తీవ్రంగా హెచ్చరించారు. ప్రస్తుతం జరుగుతున్న జాతి జనగణనలో ఓబీసీ కాలం చేర్చాలని, ప్రతి కులానికి ఒక యూనిక్ కోడ్ కేటాయించాలని డిమాండ్ చేస్తూ బీసీ సంక్షేమ సంఘం ఇచ్చిన పిలుపుమేరకు ఈరోజు రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాలలో బీసీల ధర్మ పోరాట దీక్షలు చేపట్టారు అందరూ భాగంగానే హైదరాబాదులోని ఇందిరా పార్క్ వద్ద పెద్ద ఎత్తున బీసీల ధర్మ పోరాట దీక్ష నిర్వహించారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ దీక్షకు రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు వి హనుమంతరావు, టిఆర్ఎస్ శాసనసభా పక్ష నేత సిరికొండ మధుసూదనాచారి, సిపిఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, మాజీ ఎమ్మెల్యే ఈరావత్రి అనిల్ కుమార్ తో పాటు 80 కుల సంఘాలు, 30 బీసీ సంఘాలు, విద్యార్థి, యువజన, మహిళ, ఉద్యోగ సంఘాల నేతలు పాల్గొన్నారు. ముందుగా జాజుల శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ బీసీలకు ఎలాంటి ప్రయోజనం లేని జాతి జనగణను తక్షణమే నిలిపివేయాలని, కేంద్ర ప్రభుత్వం 40 ప్రశ్నలతో ఇచ్చిన గెజిట్ ను రద్దుచేసి జాతీయస్థాయిలో అఖిలపక్ష పార్టీలు, సామాజిక నిపుణులతో సమావేశం ఏర్పాటు చేసిన తర్వాతనే జనగణన ప్రారంభించాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు. దేశంలోని బీసీ సమాజమంతా బీసీ లెక్కలు కావాలని, బీసీలకు జనాభా దామాషా ప్రకారం రాజ్యాంగబద్ధమైన హక్కులు కల్పించాలని ఉద్యమిస్తుంటే బీసీ ప్రధాని అయి ఉండి కూడా బీసీలకు న్యాయం చేయడం లేదని, బిజెపి బీసీలు ద్రోహుల పార్టీగా వ్యవహరిస్తుందని ఆయన తీవ్రంగా మండిపడ్డారు, బీసీ కులగన చేపట్టని బిజెపి నాయకులకు బీసీ బీసీలు అంతా కలిసి పిండ ప్రదానం చేస్తామని ఆయన తీవ్రంగా హెచ్చరించారు, ఈనెల 20వ తేదీన హైదరాబాదులో బీసీ కులగన్న పై జాతీయ సదస్సు నిర్వహిస్తున్నామని ఆ సదస్సులో దేశవ్యాప్తంగా మరో మండల్ ఉద్యమానికి రూపకల్పన చేస్తామని, కేంద్రం దిగివచ్చే వరకు ఉద్యమాన్ని గల్లి నుంచి ఢిల్లీ వరకు తీవ్రతరం చేస్తామని జాజుల శ్రీనివాస్ గౌడ్ హెచ్చరించారు. ప్రభుత్వ సలహాదారులు వి హనుమంతరావు, మాజీ ఎమ్మెల్యే ఈరావత్రి అనిల్ కుమార్ లు మాట్లాడుతూ బీసీ కులగనన చేయకుండా కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తుందని బీసీ కాలం చేర్చాలని ప్రధాన డిమాండ్ కాంగ్రెస్ పార్టీ జాతీయస్థాయిలో వంద రోజులపాటు దేశవ్యాప్తంగా సభలో సమావేశాలు ఏర్పాటు చేస్తుందని, వంద రోజుల తర్వాత రాహుల్ గాంధీ నేతృత్వంలో ఢిల్లీలో లక్షలాది మందితో బహిరంగ సభ నిర్వహించి బీసీల నిరసన సెగను కేంద్రానికి రుచి చూపిస్తామని వారు తెలిపారు బీసీ సంఘాలు చేస్తున్న పోరాటానికి తమ పార్టీ తరఫున సంపూర్ణ మద్దతు ఉంటుందని వారు తెలిపారు.

# గర్భస్థ శిశు లింగ నిర్ధారణను అడ్డుకోవాలి

## పీసీ పీఎన్‌డీటీ నిబంధనలు కచ్చితంగా పాటించాలి : జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా.కె.ఆనంద్

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 11 (జనంసాక్షి)**

గర్భస్థ శిశు లింగ నిర్ధారణను నిరోధించడంతో పాటు పీసీ పీఎన్‌డీటీ చట్ట నిబంధనలను కఠినంగా అమలు చేయాలని జిల్లా వైద్యఆరోగ్య శాఖ అధికారి డా.కె.ఆనంద్ అన్నారు. మహిళా శిశు సంరక్షణకు భరోసా కల్పించడం, వైద్య రంగంలో చట్టబద్ధమైన, నైతిక ప్రమాణాలను పరిరక్షించడం వైద్యఆరోగ్య శాఖ ప్రధాన బాధ్యత అని పేర్కొన్నారు.

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్, జిల్లా మేజిస్ట్రేట్ ఆమోదంతో ఏర్పాటైన జిల్లా పీసీ పీఎన్‌డీటీ సలహా కమిటీ (డీఏసీ) సమావేశం శుక్రవారం అంతాయిపల్లిలోని జిల్లా వైద్యఆరోగ్య శాఖ అధికారి కార్యాలయంలో డా.కె.ఆనంద్ అధ్యక్షతన నిర్వహించారు. జిల్లాలో గర్భస్థ శిశు లింగ నిర్ధారణను అరికట్టడం, పీసీ--పీఎన్‌డీటీ చట్టాన్ని సమర్థంగా అమలు చేయడం, వైద్య సంస్థల కార్యకలాపాలను చట్టబద్ధంగా పర్యవేక్షించడం వంటి అంశాలపై సమావేశంలో చర్చించారు. ఈ సందర్భంగా అల్ట్రాసోనోగ్రఫీ కేంద్రాలు, జన్యు సలహా కేంద్రాలు, జన్యు ప్రయోగశాలలు, ఇమేజింగ్ కేంద్రాల ఏర్పాటుకు సంబంధించిన 18 నూతన దరఖాస్తులు, ఇప్పటికే ఉన్న కేంద్రాల రెన్యువల్‌కు సంబంధించిన 12 దరఖాస్తులను కమిటీ పరిశీలించింది. ఆయా వైద్య సంస్థలకు అనుమతులు మంజూరు చేయడం, రెన్యువల్ ప్రక్రియను చేపట్టే అంశాలపై పీసీ--పీఎన్‌డీటీ చట్ట నిబంధనలకు అనుగుణంగా సమగ్రంగా పరిశీలన



జరిపారు. డా. కె. ఆనంద్ మాట్లాడుతూ.. గర్భస్థ శిశు లింగ నిర్ధారణను నిరోధించడం, మహిళా శిశు సంరక్షణకు భరోసా కల్పించడం, వైద్య రంగంలో నైతిక ప్రమాణాలను పరిరక్షించడం తమ శాఖ బాధ్యత అని స్పష్టం చేశారు. మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కలెక్టర్, జిల్లా మేజిస్ట్రేట్ ఆమోదంతో ఏర్పాటైన జిల్లా పీసీ పిఎన్ డిటి సలహా కమిటీ సమావేశం (డిల్ఏసి) జిల్లా వైద్యఆరోగ్య శాఖ అధికారి డా.కె.ఆనంద్ అధ్యక్షతన
అంతాయిపల్లి లోని జిల్లా వైద్యఆరోగ్య శాఖ అధికారి కార్యాలయం నిర్వహించారు. జిల్లాలో గర్భస్థ శిశు లింగ నిర్ధారణను నిరోధించడం, పీసీ పిఎన్డిటి, చట్ట నిబంధనలను కఠినంగా అమలు చేయడం, వైద్య సంస్థల కార్యకలాపాలను చట్టబద్ధంగా పర్యవేక్షించడం లక్ష్యంగా ఈ కమిటీ పనిచేస్తోంది. ఈ సమావేశంలో అల్ట్రాసోనోగ్రఫీ కేంద్రాలు, జన్యు సలహా కేంద్రాలు, జన్యు ప్రయోగశాలలు, ఇమేజింగ్ కేంద్రాల ఏర్పాటుకు సంబంధించిన 18 నూతన దరఖాస్తులు, ఇప్పటికే ఉన్న కేంద్రాల రెన్యువల్‌కు సంబంధించిన 12 దరఖాస్తులను కమిటీ పరిశీలించింది. సంబంధిత వైద్య సంస్థలకు అనుమతులు మంజూరు చేయడం, రెన్యువల్స్ ప్రక్రియను చేపట్టడం వంటి అంశాలను పీసీ ఒ పి ఎన్ డి టి చట్ట నిబంధనలకు అనుగుణంగా సమగ్రంగా పరిశీలించారు. ప్రతి దరఖాస్తును నిబంధనల ప్రకారం పరిశీలించి, పారదర్శకమైన విధానంలో నిర్ణయాలు తీసుకునేలా చర్యలు చేపట్టారు. సమావేశంలో జిల్లా స్థాయి సలహా కమిటీ సభ్యులు, సంబంధిత అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.



# హైడ్రా వెబ్‌సైట్‌ను ప్రారంభించిన కమిషనర్

**అందుబాటులోకి హైడ్రా అధికారిక పోర్టల్**
**ఒకే వేదికపై పౌర సేవల సమాచారం**

**హైదరాబాద్, సెప్టెంబర్ 11 (జనంసాక్షి):** హైడ్రా (హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ) అందిస్తున్న సేవల వివరాలతో పాటు.. కార్యకలాపాలను వెబ్‌సైట్ ద్వారా తెలుసుకునే వెసులుబాటు హైడ్రా కల్పించింది. https://hydraa.telangana.gov.in/ పేరిట రూపొందించిన పోర్టల్‌ను హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ శుక్రవారం ప్రారంభించారు. హైడ్రాకు సంబంధించిన వివిధ సేవలు, సమాచారం, అత్యవసర సహాయం, వాతావరణ వివరాలు, భూములు, చెరువులు, అధికార పరిధి తదితర అంశాలను తెలుసుకోవచ్చు. చెరువుల హద్దులు, కాలువల లెక్కలు, ప్రభుత్వ భూముల వివరాలు, విపత్తు నిర్వహణ సమాచారంతో పాటు హైడ్రా కార్యకలాపాలన్నీ ఈ వెబ్‌సైట్ ద్వారా తెలుసుకోవచ్చు.

**అత్యవసర సహాయానికి 1070**

హైడ్రా 24 గంటల అత్యవసర హెల్ప్‌లైన్ 1070 వివరాలను పోర్టల్‌లో ప్రముఖంగా పొందుపరిచారు. చెట్లు కూలిపోవడం, అగ్ని ప్రమాదాలు, రహదారులపై నీరు నిలవడం, వరదలు, సహాయక చర్యలు, ఇతర విపత్తు సంబంధిత అత్యవసర పరిస్థితులపై పౌరులు ఈ నంబరుకు సమాచారం ఇవ్వవచ్చు.

# దేశం సూపర్‌పవర్‌గా మారాలంటే కులవ్యవస్థ పోవాల్సిందే

**దేశాభివృద్ధికి, విప్లవోద్యమానికి అదే ప్రధాన ఆటంకం**

**ప్రజల్ని చీల్చుతున్నది కులతత్వమే.. పాలకులు కావాల్సిందీ అదే**

**పెట్టుబడిదారుల అదనపు దోపిడీకి అది ఒక ఆయుధం**

**కుల వ్యతిరేక, ఆర్థిక పోరాటాలు జమిలిగా సాగాలి**

**సీతారాం ఏచూరి వర్ధంతి సభ స్మారకోపన్యాసంలో బీవీ రాఘవులు**




**హైదరాబాద్, సెప్టెంబర్ 11 (జనంసాక్షి):**

అమెరికా, చైనా మాదిరిగా మన దేశం కూడా సూపర్ పవర్‌గా ఎదగడం కులవ్యవస్థ పోతేనే సాధ్యమవుతుందని సీపీఐ(ఎం) పొలిట్ బ్యూరో సభ్యులు బీవీ.రాఘవులు స్పష్టం చేశారు. దేశాభివృద్ధికి, విప్లవోద్యమానికి కులమే ప్రధాన ఆటంకంగా మారిందని తెలిపారు. అది ప్రజలు ఐక్యం కాకుండా నిలువునా చీల్చుతున్నదనీ, పాలకులు కూడా అదే కావాలని కోరుకుంటున్నారని విమర్శించారు. పెట్టుబడిదారుల దోపిడీకి కూడా అది ఒక ఆయుధంగా మారిందని చెప్పారు. మన దేశంలో బలంగా పాతుకుపోయిన కులవ్యవస్థ పోవాలంటే కుల వ్యతిరేక, ఆర్థిక పోరాటాలు జమిలిగా సాగాలనీ, ఆ దిశగా కలుసొచ్చే శక్తులను ముందుకెళ్లాలని పిలుపునిచ్చారు. శుక్రవారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సీతారాం ఏచూరి రెండో వర్ధంతి సభను సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు టి.జ్యోతి అధ్యక్షతన నిర్వహించారు. కార్యక్రమంలో ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పి.ప్రభాకర్, హైదరాబాద్ సెంట్రల్‌సిటీ కార్యదర్శి ఎం.వెంకటేశ్ పాల్గొన్నారు. సభలో 'కుల నిర్మూలన-మార్క్సిస్టు దృక్పథం' అనే అంశంపై బీవీ.రాఘవులు స్మారకోపాన్యాసం చేశారు. లౌకిక, ప్రజాస్వామిక, భారత రాజ్యాంగ విలువలను కాపాడేందుకు, దేశంలో మతోన్మాద శక్తులను ప్రాబల్యాన్ని తగ్గించేందుకు సీతారాం ఏచూరి ఎంతో కృషి చేశారని గుర్తుచేశారు. మావో మార్క్సిజాన్ని చైనా పరిస్థితులకు ఆపాదించి విప్లవాన్ని తీసుకురావడంలో సక్సెస్ అయ్యారని చెప్పారు. అదే మన దేశంలో వేళ్లూరుకుని పాతుకుపోయిన కుల వ్యవస్థ విప్లవోద్యమానికి ప్రధాన ఆంటకంగా మారిందని చెప్పారు. దాన్ని నిర్మూలించకుండా ముందుకు పోలేమని స్పష్టం చేశారు. కులం శ్రమను గౌరవించదనీ, కుల వ్యవస్థ మనిషి పుట్టుక నుంచే శ్రమజీవులను చిన్నచూపు చూస్తోందని తెలిపారు. మహిళలు, దళితులు, వెనుబడిన తరగతుల వారికి చదువే అవసరం లేదని కులం చెబుతున్నదనీ, అలాంటప్పుడు దేశం ఎలా ముందుకు పోతుందని ప్రశ్నించారు. మన కంటే చిన్న దేశాలు ఉత్పాదకతలో, జీడీపీలో ఎంతో ముందు వరుసలో ఉన్నాయనీ, మన దేశం అలా ఎదగకపోవడానికి కులం కూడా ఒక కారణమని చెప్పారు. దేశంలో మతోన్మాద శక్తుల ఆగడాలు రోజురోజుకీ పెరిగిపోతున్నాయని చెప్పారు. ఢిల్లీ ఐఐటీ ప్రాంగణంలో బ్రాహ్మణులు తెలివిగలవాళ్లు ...శూద్రులు తెలివితక్కువ వాళ్లు అని పోస్టర్లు వెలవడం పట్ల ఆందోళన వ్యక్తం చేశారు. ఉత్తరాఖండ్‌లో ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే ఉపన్యాసం చేసిన వేదికను హిందూత్వ సంస్థకు చెందినవాళ్లు పసుపు నీళ్లతో శుద్ధి చేయడం ఎంతవరకు సబబు? అసలు మన దేశం ఎక్కడకు పోతుంది? అని ఆందోళన వ్యక్తం చేశారు. గద్వాల జిల్లాలో కులాంతర వివాహం చేసుకున్న యువకుడి ఇంటిని కూల్చేయడాన్ని బట్టే పరిస్థితులు ఎటువైపు వెళ్తున్నాయో అర్థం చేసుకోవాలన్నారు. కుల వ్యవస్థ పోకపోతే అభివృద్ధి సాధ్యం కాదని ఆనాడే భక్తి ఉద్యమకారులు, గౌతమబుద్ధుడు, అంబేద్కర్, పూలే, భగత్‌సింగ్, వివేకానందుడు, సింగారపువేలు శెట్టియార్, తదితరులు చెప్పిన విషయాన్ని గుర్తుచేశారు. పెట్టుబడిదారీ వ్యవస్థ కూడా తమ అధిక మిగులు కోసం, ప్రజల్ని చీల్చడం కోసం, అతి చౌకగా శ్రామికుల శ్రమను వాడుకోవడం కోసం కుల వ్యవస్థను వాడుకుంటున్న తీరును క్షుణ్ణంగా వివరించారు. బూర్జువా పార్టీలు మతం, కులం పేరుతో రాజకీయాలు చేస్తున్న తీరును ఎండగట్టారు. దేశాన్ని మళ్లీ వెనుటి కాలానికి తీసుకెళ్లడానికి బీజేపీ పాలకులు చేస్తున్న కుట్రలను తిప్పికొట్టడానికి బలమైన కుల నిర్మూలన ఉద్యమాలు రావాలనీ, కుటుంబం నుంచే సంస్కరణ మొదలు కావాలనీ, ప్రతి ఒక్కరూ తమ పిల్లలను కుల,మతద్వేషాలు లేకుండా చైతన్యపూరితంగా పెంచే రోజులు రావాలనీ, కులాంతర వివాహాలు పెరగాలని ఆకాంక్షించారు. అలా అన్ని పాయలు కలిస్తేనే కులవ్యవస్థ నాశనం సాధ్యమవుతుందని చెప్పారు.

# పోలీసు రిక్రూట్‌మెంట్ సమస్యలను మండలిలో ప్రస్తావించిన ప్రభుత్వ విప్



**హైదరాబాద్, సెప్టెంబర్ 11 (జనంసాక్షి):** పోలీసు నియామకాల్లో అభ్యర్థులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వ విప్ డాక్టర్ బల్మూర్ వెంకట్ శాసనమండలిలో ప్రస్తావించారు. ఏజెన్సీ ప్రాంతాల్లో గతంలో మాదిరిగానే సివిల్ కానిస్టేబుల్ పోస్టుల్లో 75 శాతం స్థానిక ఆదివాసీ అభ్యర్థులకు కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరారు. పోలీసు రిక్రూట్‌మెంట్ ఈవెంట్లలో లాంగ్‌జంప్ అర్హత ప్రమాణాలను సడలించాలని విజ్ఞప్తి చేశారు. ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కేరళ, కర్ణాటక రాష్ట్రాల్లో అమలు చేస్తున్న విధంగా తెలంగాణలోనూ పురుష అభ్యర్థులకు లాంగ్‌జంప్ ప్రమాణాన్ని 4 మీటర్ల నుంచి 3.8 మీటర్లకు, మహిళా అభ్యర్థులకు 2.5 మీటర్ల నుంచి 2.3 మీటర్లకు తగ్గించాలని కోరారు. పోలీసు నియామకాల్లో వయోపరిమితి పెంపుపై ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకోవడం పట్ల ముఖ్యమంత్రి, ప్రజా ప్రభుత్వానికి బల్మూర్ వెంకట్ కృతజ్ఞతలు తెలిపారు.

# మల్లికార్జున ఖర్గేను కలిసిన మధుయాష్కి గౌడ్

## ఏఐపీసీ చైర్ పర్సన్‌గా నియమించినందుకు కృతజ్ఞతలు



**హైదరాబాద్ (జనంసాక్షి) :** ఆల్ ఇండియా ప్రొఫెషనల్స్ కాంగ్రెస్ చైర్ పర్సన్‌గా నియమితులైన మాజీ పార్లమెంట్ సభ్యులు మధుయాష్కి గౌడ్ ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గేని బెంగళూరులోని వారి నివాసంలో కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఖర్గేకి పుష్పగుచ్ఛం అందించి, శాలువాతో సత్కరించిన మధుయాష్కి.. తనపై ఎంతో నమ్మకంతో ఇంత పెద్ద బాధ్యత అప్పగించినందుకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. వివిధ రంగాల్లోని వృత్తి నిపుణులు, మేధావులను కాంగ్రెస్ పార్టీకి అనుసంధానం చేస్తూ.. వారందరినీ జాతీయస్థాయిలో ఒక వేదికపై తీసుకువచ్చే గురుతర బాధ్యతను సమర్థవంతంగా నిర్వహించాలని ఈ సందర్భంగా ఖర్గే మధుయాష్కికి దిశానిర్దేశం చేశారు.

# శ్రీశైలంలో నీళ్లు పుష్కలం.. పాలమూరుకు సాగునీరు కరువు

### కేఎల్ఐ పంపులు 24 గంటలు నడిపించాలి : మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి

### ఫ్యూచర్ సిటీపై ఉన్న శ్రద్ధ రైతులపై లేదు.. రేవంత్ సర్కారుపై మాజీ మంత్రుల ధ్వజం



**వనపర్తి బ్యూరో సెప్టెంబర్ 11 జనంసాక్షి**

శ్రీశైలం ప్రాజెక్టులో సమృద్ధిగా నీటి నిల్వలు ఉన్నప్పటికీ పాలమూరు రైతులకు సాగునీరు అందించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి ఆరోపించారు. రేవల్లి మండలం గౌరీదేవిపల్లి వద్ద మహాత్మాగాంధీ కల్వకుర్తి ఎత్తిపోతల పథకం (కేఎల్ఐ) స్టేజ్-3 పంప్‌హౌస్‌ను మాజీ మంత్రులు శ్రీనివాస్‌గౌడ్, డాక్టర్ సి.లక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు మర్రి జనార్ధన్‌రెడ్డి, హర్షవర్ధన్‌రెడ్డిలతో కలిసి ఆయన పరిశీలించారు.

నిరంజన్‌రెడ్డి మాట్లాడుతూ.. వానాకాలం సీజన్ ప్రారంభం నుంచే ప్రభుత్వం అప్రమత్తంగా ఉండాలని తాము సూచిస్తున్నప్పటికీ పట్టించుకోలేదన్నారు. ఎగువ ప్రాంతాల నుంచి వరదలు వచ్చే అవకాశం ఉందని ముందుగానే హెచ్చరించామని తెలిపారు. శ్రీశైలంలో పెద్దఎత్తున నీరు ఉన్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం నీళ్లు లేవంటూ చెబుతోందని విమర్శించారు.

**ఏపీకి నీళ్లు.. తెలంగాణ రైతులకు నిర్లక్ష్యం**

పోతిరెడ్డిపాడు ద్వారా ఆంధ్రప్రదేశ్ భారీగా నీటిని తరలించుకుపోతున్నా రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని నిరంజన్‌రెడ్డి ఆరోపించారు. రోజుకు 10 నుంచి 12 టీఎంసీల వరకు ఏపీ నీటిని తీసుకెళ్తోందని, తెలంగాణకు అందుబాటులో ఉన్న నీటిని సమర్థంగా వినియోగించుకోవడంలో ప్రభుత్వం విఫలమైందని అన్నారు. కేఎల్ఐ పంపులను 24 గంటలు నడిపి రైతులకు సాగునీరు అందించాలని ఆయన డిమాండ్ చేశారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని 33 నెలలుగా పెండింగ్‌లో పెట్టారని నిరంజన్‌రెడ్డి ఆరోపించారు. శ్రీశైలంలో ఉన్న నీటిని సద్వినియోగం చేసుకుంటే యాసంగి పంటలకు కూడా సాగునీరు అందించే అవకాశం ఉందన్నారు.

మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌కు నీళ్లు వెళ్తున్నా తెలంగాణకు సాగునీరు రావడం లేదని ఆరోపించారు. ఏపీ అనధికారికంగా నీటిని తరలించుకుపోతున్నా సీఎం, జిల్లా మంత్రులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. కేఎల్ఐ మోటార్లకు విద్యుత్ సరఫరా చేయకపోవడం దారుణమన్నారు. మాజీ మంత్రి డాక్టర్ సి.లక్ష్మారెడ్డి మాట్లాడుతూ రైతులకు సాగునీరు అందించాలన్న సోయి ప్రభుత్వానికి లేదని విమర్శించారు. బీఆర్ఎస్ నాయకులు ఆందోళనకు సిద్ధమవుతున్నారంటేనే ప్రభుత్వం అప్రమత్తమవుతోందన్నారు. మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్ధన్‌రెడ్డి మాట్లాడుతూ కేఎల్ఐ పంపులను నిరంతరాయంగా నడపడం లేదని ఆరోపించారు. 15 రోజుల్లోనే ఏపీకి భారీగా నీళ్లు తరలిపోయాయని, మరోవైపు కేఎల్ఐ మోటార్లకు విద్యుత్ సరఫరా చేయకపోవడం దారుణమన్నారు. రైతులకు నీళ్లు ఇవ్వాలని ఒక్క ఎమ్మెల్యే అయినా ప్రశ్నించారా అని నిలదీశారు. మాజీ ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ పాలమూరు జిల్లాపై ప్రేమ ఉంటే పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టును పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా మీడియా కన్వీనర్ నందిమల్ల అశోక్ మాట్లాడుతూ ఎమ్మెల్యేలకు రైతుల సంక్షేమంపై పట్టింపు లేదని విమర్శించారు.

# మహబూబ్‌నగర్‌లో గీత కార్మికుల రగడ

### కుమార్ గౌడ్ వర్గాన్ని అరెస్ట్ చేసిన పోలీసులు

### కులవృత్తిదారులకు తీవ్ర అన్యాయం

### న్యాయం చేయాలని గీత కార్మికుల ఆవేదన



**మహబూబ్‌నగర్ బ్యూరో సెప్టెంబర్ 11 (జనంసాక్షి):**

మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో గీత కార్మికుల మధ్య విభేదాలు భగ్గుమన్నాయి. కులవృత్తినే నమ్ముకొని జీవనం సాగిస్తున్న తమకు తీవ్ర అన్యాయం జరుగుతోందని గీత కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

జిల్లా కేంద్రంలో గీత కార్మికుల సంఘం నాయకుడిగా గతంలో కుమార్ గౌడ్ వ్యవహరిస్తున్న నేపథ్యంలో, ఆయనను కాదని ప్రతాప్ గౌడ్ కు నాయకత్వ బాధ్యతలు ఎలా అప్పగిస్తారని కుమార్ గౌడ్ వర్గీయులు ప్రశ్నిస్తున్నారు. ఈ విషయంలోనే ఇరు వర్గాల మధ్య మాటామాటా పెరిగి ఘర్షణకు దారితీసినట్లు తెలుస్తోంది. గీత కార్మికుల హక్కుల విషయంలో, గీత దుకాణాల కేటాయింపు, కల్లు దుకాణాల లైసెన్సుల విషయంలో తమకు అన్యాయం జరుగుతోందని కుమార్ గౌడ్ వర్గం ఆరోపిస్తోంది. కులవృత్తిదారులైన తమకు ప్రాధాన్యత ఇవ్వకుండా వేరే వారికి అనుకూలంగా వ్యవహరిస్తున్నారని వారు వాపోతున్నారు.



ఘర్షణ సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే రంగంలోకి దిగి పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. ఘర్షణకు దిగిన కుమార్ గౌడ్ వర్గానికి చెందిన పలువురిని పోలీసులు అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించినట్లు సమాచారం. దీంతో పట్టణంలో కొంతకాలంగా ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. అయితే ఏది ఏమైనా రాజకీయాలకు అతీతంగా అందరికీ న్యాయం చేసే దిశగా అధికారులు చూడాలని, కులవృత్తిదారులైన గీత కార్మికులందరికీ సమన్యాయం చేయాలని పట్టణంలోని గీత కార్మికులు కోరుతున్నారు. నిజమైన కులవృత్తిదారులను గుర్తించి న్యాయం చేయకపోతే పెద్ద ఎత్తున ఆందోళనకు దిగుతామని హెచ్చరిస్తున్నారు.



# విద్యుత్ కోతలపై రోడెక్కిన అన్నదాతలు

### ఐజ-గద్వాల రహదారిపై రాస్తారోకో


### స్తంభించిన రవాణా సౌకర్యం

**మల్దకల్, సెప్టెంబర్ 11 (జనంసాక్షి)** జోగులాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండల కేంద్రంలోని శుక్రవారం ఐజ- గద్వాల రహదారుపై అన్నదాతలు రోడ్డుఎక్కారు. వ్యవసాయానికి 24 గంటల నిరంతర ఉచిత విద్యుత్ సరఫరా చేయాలని డిమాండ్ చేస్తూ జోగులాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండల కేంద్రంలో రైతులు ఆందోళన చేపట్టారు. అప్రకటిత విద్యుత్ కోతలు, లో-వోల్టేజీ సమస్యల వల్ల పంటలు ఎండిపోతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేస్తూ, రైతులందరూ కలిసి ఐజ-గద్వాల ప్రధాన రహదారిపై బైఠాయించి రాస్తారోకో నిర్వహించారు. పంటలు ఎండిపోతున్నాయని, రైతులఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుత సాగు సీజన్‌లో వర్షాలు లేక బోర్లపైనే ఆధారపడి వ్యవసాయం చేస్తున్నామని, ప్రభుత్వం 24 గంటల కరెంట్ ఇస్తున్నామని చెబుతున్నా, క్షేత్రస్థాయిలో కనీసం నాణ్యమైన విద్యుత్ అందడం లేదని మండిపడ్డారు. కరెంట్ ఎప్పుడు వస్తుందో, ఎప్పుడు పోతుందో తెలియని పరిస్థితి నెలకొందని, దీనివల్ల మోటార్లు కాలిపోయి తీవ్ర నష్టం వాటిల్లుతోందని ఆరోపించారు. కష్టపడి సాగు చేసిన పంటలు కళ్లముందే ఎండిపోతుంటే తట్టుకోలేక రోడ్డెక్కాల్సి వచ్చిందని రైతులు పేర్కొన్నారు.

**స్తంభించిన రవాణా :** రైతులు ప్రధాన రహదారిపై బైఠాయించి నిరసన తెలపడంతో ఐజ - గద్వాల మార్గంలో ఇరువైపులా వాహనాలు నిలిచిపోయి రవాణా పూర్తిగా స్తంభించింది. దాదాపు మూడు గంటల పాటు రైతులు ధర్నా చేపట్టారు. పై అధికారులు వచ్చి రైతులకు స్పష్టమైన హామీ ఇవ్వడంతో రైతులు ధర్నాను విరమించారు. ఐజ, గద్వాల్ వెళ్లే ప్రయాణికులు విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు.

# చిట్యాల బీసీ కళాశాల భవన నిర్మాణానికి రూ.10 కోట్లు

### ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి ప్రత్యేక చొరవతో పరిపాలనా అనుమతులు



**వనపర్తి బ్యూరో (జనంసాక్షి) :** వనపర్తి మండలం చిట్యాలలోని మహాత్మా జ్యోతిబా పూలే తెలంగాణ వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల విద్యాసంస్థల బాలుర జూనియర్ కళాశాల భవన నిర్మాణానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రూ.10 కోట్ల నిధులు మంజూరు చేసింది. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని నియోజకవర్గంలో విద్యా మౌలిక వసతుల అభివృద్ధికి ప్రత్యేకంగా కృషి చేస్తున్న వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి ప్రత్యేక చొరవతో ఈ నిధులు మంజూరయ్యాయి. వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ప్రభుత్వ ఉత్తర్వులు సంఖ్య 93, తేదీ 16-07-2026 ద్వారా రూ.10 కోట్లకు పరిపాలనా అనుమతులు జారీ చేసింది. ప్రస్తుతం ఉన్న మహాత్మా జ్యోతిబా పూలే తెలంగాణ వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల బాలుర పాఠశాల ప్రాంగణంలోని స్థలంలో నూతన జూనియర్ కళాశాల భవనాన్ని నిర్మించనున్నారు. భవన నిర్మాణ పనులను తెలంగాణ విద్యా, సంక్షేమ మౌలిక వసతుల అభివృద్ధి సంస్థ ద్వారా చేపట్టేందుకు ప్రభుత్వం 05-09-2026న అనుమతి ఇచ్చింది. గ్రామీణ ప్రాంతాలకు చెందిన వెనుకబడిన తరగతుల విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణాన్ని కల్పించడంతో పాటు, ఇంటర్మీడియట్ విద్యను మరింత సౌకర్యవంతంగా అభ్యసించేందుకు ఈ నూతన భవనం ఎంతో ఉపయోగపడుతుందని ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి పేర్కొన్నారు. విద్యార్థులకు మెరుగైన వసతులు అందుబాటులోకి రావడం ద్వారా వారు ఉన్నత విద్య వైపు మరింత ముందుకు సాగేందుకు అవకాశం కలుగుతుందని తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, జిల్లా మంత్రులు జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి, నాగర్‌కర్నూల్ పార్లమెంట్ సభ్యులు డాక్టర్ మల్లు రవిలకు ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

# తుపాకుల మిస్సింగ్‌పై అచ్చంపేటలో కలకలం

### ఇద్దరు అదుపులో అంటూ ప్రచారం.. పోలీసుల విచారణపై ఉత్కంఠ

### మాజీ ఆర్మీ ఉద్యోగి అదుపులోకి.. : ఖండించిన డీఎస్పీ



**అచ్చంపేట, సెప్టెంబర్ 10 (జనంసాక్షి):** హైదరాబాద్‌లోని మిలిటరీ ఆయుధ కార్యాలయంలో తుపాకులు మిస్సింగ్ అయిన ఘటనకు సంబంధించి ఉన్నతస్థాయి పోలీసు యంత్రాంగం దర్యాప్తు ముమ్మరం చేసిన నేపథ్యంలో నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట పట్టణంలో పలు ప్రచారాలు కలకలం రేపుతున్నాయి. ఈ వ్యవహారంతో సంబంధం ఉన్నారనే అనుమానాల నేపథ్యంలో ఇద్దరు వ్యక్తులను అచ్చంపేట పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారనే ప్రచారం స్థానికంగా జోరుగా సాగుతోంది. ముఖ్యంగా మాజీ ఆర్మీ ఉద్యోగి ఒకరు పోలీసుల అదుపులో ఉన్నారనే ప్రచారం మరింత ఆసక్తిని రేకెత్తిస్తోంది. అయితే ఈ ప్రచారంపై అధికారికంగా ఎలాంటి ధ్రువీకరణ వెలువడలేదు.

**అదుపులోకి ఎవరినీ తీసుకోలేదు: డీఎస్పీ**

విషయంపై స్పష్టత కోసం అచ్చంపేట డీఎస్పీ పల్లె శ్రీనివాస్, సీఐ నాగరాజును ఫోన్ ద్వారా సంప్రదించగా.. అచ్చంపేటలో తుపాకుల మిస్సింగ్ వ్యవహారానికి సంబంధించి ఎవరినీ అదుపులోకి తీసుకున్న సమాచారం తమకు లేదని స్పష్టం చేసినట్లు తెలిపారు. ఎలాంటి అరెస్టులు కూడా జరగలేదని పేర్కొన్నారు.

**గుంటూరు అచ్చంపేటతో గందరగోళమా?**

ప్రచారంలో పేర్కొంటున్న ఘటన తెలంగాణలోని నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేటకు కాకుండా ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు జిల్లా అచ్చంపేట ప్రాంతానికి సంబంధించినదై ఉండవచ్చని డీఎస్పీ సూచించినట్లు సమాచారం. దీంతో అసలు తుపాకుల మిస్సింగ్ వ్యవహారంలో అచ్చంపేటకు సంబంధం ఉందా? లేదా పేర్ల సారూప్యతతో గందరగోళం ఏర్పడిందా? అనే అంశంపై స్పష్టత రావాల్సి ఉంది. పోలీసులు ఎవరినీ అదుపులోకి తీసుకున్నట్లు అధికారికంగా ధ్రువీకరించకపోవడంతో అచ్చంపేటలో జరుగుతున్న ప్రచారానికి తెరపడలేదు. ఉన్నతస్థాయి దర్యాప్తు నేపథ్యంలో ఈ వ్యవహారంపై మరిన్ని వివరాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందన్న చర్చ స్థానికంగా సాగుతోంది.

## ట్రాక్టర్లు టార్గెట్... బ్యాటరీలు, డీజిల్ మాయం

**మహమ్మదాబాద్, సెప్టెంబర్ 11 (జనంసాక్షి) :** మహమ్మదాబాద్ మండలంలోని రాత్రి సమయంలో ట్రాక్టర్లను టార్గెట్ చేసుకుని డీజిల్ బ్యాటరీలు చోరీ చేసుకుంటున్న ఘటనలు చోటుచేసుకుంటున్నాయి. మండలంలోని ఆయా గ్రామాలలో రాత్రివేళ పొలాల వద్ద నిలిపి ఉంచిన ట్రాక్టర్ల నుంచి బ్యాటరీలు, డీజిల్, సెల్ఫ్ మోటార్లను అపహరిస్తున్నట్లు వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మహమ్మదాబాద్ మండలంలోని గాధిర్యాల్ గ్రామానికి చెందిన గుండాల సురేష్, రుసుంపల్లి, రోడ్డువైపు పొలాల వద్ద తన ట్రాక్టర్‌ను నిలిపి ఇంటికి వెళ్లాడు. ఆగస్టు 20 అర్ధరాత్రి సమయంలో గుర్తుతెలియని దుండగులు ట్రాక్టర్ నుంచి బ్యాటరీ, డీజిల్‌ను చోరీ చేశారు. ఉదయం వచ్చి చూడగా బ్యాటరీ, డీజిల్ కనిపించకపోవడంతో బాధితుడు పోలీసులను ఆశ్రయించాడు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు మహమ్మదాబాద్ ఎస్ఐ శేఖర్‌రెడ్డి తెలిపారు. మండలంలో వరుసగా ట్రాక్టర్ చోరీలు జరుగుతుండటంతో పోలీసులు నిఘా పెంచాలని రైతులు కోరుతున్నారు.

# అల్లీపూర్‌లో క్షుద్రపూజల కలకలం


### ప్రభుత్వ పాఠశాల వెనుక క్షుద్ర పూజలు - నలుగురికి గ్రామస్తుల దేహశుద్ధి



**మహబూబ్‌నగర్ బ్యూరో (జనంసాక్షి):** మహబూబ్‌నగర్ జిల్లా రూరల్ మండలం అల్లీపూర్ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల వెనుక క్షుద్ర పూజలు చేస్తున్న నలుగురు వ్యక్తులను గ్రామస్తులు పట్టుకుని దేహశుద్ధి చేసిన ఘటన కలకలం రేపింది. బుధవారం అర్ధరాత్రి ఈ ఘటన చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన కొందరు యువకులు రాత్రి వేళ పాఠశాల వెనుక వైపు వెళ్తుండగా అనుమానాస్పదంగా నలుగురు వ్యక్తులు క్షుద్ర పూజలు చేస్తుండటాన్ని గమనించారు. అక్కడ పసుపు, కుంకుమ, నిమ్మకాయలు, కొబ్బరికాయలు, పూలు తదితర క్షుద్రపూజ సామగ్రితో పూజలు చేస్తుండటంతో యువకులు వెంటనే గ్రామస్తులకు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న గ్రామస్తులు పెద్ద సంఖ్యలో ఘటనా స్థలానికి చేరుకుని నలుగురిని చుట్టుముట్టారు. పాఠశాల పిల్లలు చదువుకునే ప్రాంతంలో ఇలాంటి మూఢనమ్మకపు పూజలు చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ వారికి దేహశుద్ధి చేశారు. అనంతరం రూరల్ పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న రూరల్ పోలీసులు హుటాహుటిన గ్రామానికి చేరుకుని నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారు ఎవరు, ఎక్కడి నుంచి వచ్చారు, ఎందుకు క్షుద్ర పూజలు చేస్తున్నారు అనే కోణంలో విచారణ చేపడుతున్నట్లు పోలీసులు తెలిపారు. పూజా సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. పాఠశాల వెనుక క్షుద్ర పూజలు చేయడం వల్ల చిన్నారులు భయభ్రాంతులకు గురవుతున్నారని, ఇలాంటి మూఢనమ్మకాలను ప్రోత్సహించవద్దని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

### కోడంగల్-నారాయణపేట ఎత్తిపోతల పథకంలో భూములు కోల్పోతున్న

# రైతులకు మార్కెట్ విలువ ప్రకారం పరిహారం ఇవ్వాలి



**మద్దూరు సెప్టెంబర్ 11 (జనం సాక్షి) :** కోడంగల్ నారాయణపేట ఎత్తిపోతల పథకంలో భాగంగా కాలువ నిర్మాణం కోసం భూములు కోల్పోతున్న రైతులకు ప్రస్తుత మార్కెట్ విలువ ప్రకారం నష్టపరిహారం చెల్లించాలని నాగిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన రైతులు కోరుతున్నారు. కాలువ పనుల కోసం గ్రామ పరిధిలోని విలువైన వ్యవసాయ భూములు కోల్పోతున్నామని రైతులు తెలిపారు. గ్రామానికి సమీపంలో ఉండటంతో పాటు రహదారి సౌకర్యం కలిగిన ఈ భూములకు ప్రస్తుతం మార్కెట్‌లో ఎకరాకు సుమారు రూ.50 లక్షల నుంచి రూ.60 లక్షల వరకు విలువ ఉందని పేర్కొన్నారు. తమ కుటుంబాల జీవనాధారం ప్రధానంగా వ్యవసాయ భూములపైనే ఆధారపడి ఉందని, భూములు కోల్పోవడం వల్ల తీవ్రంగా నష్టపోతామని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తమ పరిస్థితిని పరిగణనలోకి తీసుకుని, భూముల ప్రస్తుత మార్కెట్ విలువను ఆధారంగా చేసుకుని న్యాయమైన నష్టపరిహారం అందించాలని వారు తాసిల్దార్ కి విజ్ఞప్తి చేశారు. భూములు కోల్పోతున్న ప్రతి రైతుకు న్యాయం జరిగేలా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని రైతులు కోరారు. ఈ కార్యక్రమంలో వంచర్ల వేణుగోపాల్, మహేందర్ రెడ్డి, మహిపాల్ రెడ్డి, నర్సిరెడ్డి, వంచర్ల గోపాల్, రాజు గౌడ్, గోపాల్ గౌడ్, కృష్ణ నాయక్ తదితరులు పాల్గొన్నారు.



# జ్వరంతో వచ్చే ప్రతి రోగికి డెంగ్యూ పరీక్షలు చేయాలి

### ప్రభుత్వ ఆసుపత్రుల్లో అందుబాటులో ఉన్న సదుపాయాలను

### పూర్తిస్థాయిలో వినియోగించాలి : జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి

**వనపర్తి బ్యూరో, సెప్టెంబర్ 11జనంసాక్షి :** జ్వర లక్షణాలతో ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే ప్రతి రోగికి డెంగ్యూ పరీక్షలు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి వైద్యులను ఆదేశించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో అందుబాటులో ఉన్న ల్యాబ్, ఎక్స్‌రే తదితర సదుపాయాలను పూర్తిస్థాయిలో వినియోగించి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. శుక్రవారం ఖిల్లాఘనపూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ సందర్శించారు. ఆసుపత్రిలోని వివిధ విభాగాలను పరిశీలించి, రోగులకు అందుతున్న వైద్య సేవలపై వైద్యులు డాక్టర్ చైతన్య గౌడ్, సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. డెంగ్యూ వ్యాధిని సకాలంలో గుర్తించి అవసరమైన చికిత్స అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. క్షయ వ్యాధి అనుమానం ఉన్న రోగులను గుర్తించి అవసరమైన వారికి ఎక్స్‌రే పరీక్షలు విస్తృతంగా నిర్వహించాలని సూచించారు.

**ఎస్సీ బాలుర హాస్టల్‌కు నూతన భవనం నిర్మించాలి**

ఖిల్లాఘనపూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఎస్సీ బాలుర వసతి గృహాన్ని కూడా జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి పరిశీలించారు. శిథిలావస్థకు చేరిన ప్రస్తుత భవనం పరిస్థితిని క్షేత్రస్థాయిలో పరిశీలించి, సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. హాస్టల్ భవనం పరిస్థితిపై పూర్తి వివరాలతో ఫైల్ సిద్ధం చేసి సమర్పించాలని ఎస్సీ సంక్షేమ అధికారిని ఆదేశించారు.

**సర్వేకు వెళ్లే ముందు రైతులకు సమాచారం ఇవ్వాలి**

భూ రీ-సర్వే ప్రక్రియను నిబంధనల ప్రకారం పకడ్బందీగా, ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి అధికారులను ఆదేశించారు. సర్వేకు వెళ్లే ముందు సంబంధిత రైతులకు ముందస్తుగా సమాచారం అందించి, వారి సమక్షంలోనే సర్వే ప్రక్రియ నిర్వహించాలని సూచించారు. శుక్రవారం ఖిల్లాఘనపూర్ మండలం మల్కాపూర్ గ్రామంలో కొనసాగుతున్న భూ రీ-సర్వే ప్రక్రియను అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వినోద్ కుమార్‌తో కలిసి జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రోవర్‌లను వినియోగిస్తూ సర్వేయర్లు భూములను కొలుస్తున్న విధానాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించి, పలు సూచనలు చేశారు. అనంతరం రీ-సర్వేకు సంబంధించిన మ్యాప్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ముందుగా సంబంధిత భూముల సరిహద్దులను నిర్దేశించి, అనంతరం సర్వే ప్రక్రియను ప్రారంభించాలని సూచించారు. సర్వే నిర్వహించే విషయాన్ని ముందుగానే రైతులకు తెలియజేసి, వారు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. రైతుల సమక్షంలో సర్వే నిర్వహించడం ద్వారా భవిష్యత్తులో అభ్యంతరాలు, భూ వివాదాలకు అవకాశం లేకుండా చూడవచ్చని తెలిపారు.

### సింప్లీ ఫ్రెష్ పరిశ్రమలో మహిళల్ని వేధించిన

# సూపర్వైజర్‌ను తొలగించాలి

**చేర్యాల (జనంసాక్షి) సెప్టెంబర్ 11 :** చేర్యాల మండలం అర్జున్ పట్ల గ్రామ పరిధిలో ఉన్న సింప్లి ఫ్రెష్ పరిశ్రమలో మహిళల్ని వేధింపులు గురిచేసిన సూపర్వైజర్ ను తొలగించి కేసు నమోదు చేయాలని, పరిశ్రమలో మహిళ అంతర్గత భద్రత కమిటీ ఏర్పాటు చేయాలని సిఐటియు సిద్దిపేట జిల్లా అధ్యక్ష కార్యదర్శులు సందబోయిన ఎల్లయ్య కాముని గోపాలస్వామి పరిశ్రమ యజమాన్యాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం పరిశ్రమ సందర్శించి సిఐటియు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పరిశ్రమ యజమాన్యానికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పరిశ్రమ మండలానికి దూరంగా ఉంటూ పరిశ్రమలో ఆటవిక రాజ్యాన్ని తలపిస్తుంది, పురుష సూపర్వైజర్లు మహిళలపై పరిశ్రమంలో వేధింపులకు పాల్పడుతున్నారు. 18 ఎకరాల స్థలంలో పరిశ్రమ ఉండటం వల్ల ఒంటరిగా ఉన్న మహిళలను వేధింపుల గురి చేస్తున్నారని, 2013 చట్టం ప్రకారం మహిళ అంతర్గత కమిటీ ఉండాల్సి ఉన్న కమిటీ లేదని అన్నారు, కాంట్రాక్టు సూపర్వైజర్లు నచ్చినవారిని, ముఖాలు చూసుకుంటూ పని కల్పించడం, నచ్చని వారిని అక్రమంగా తొలగింపులు జరుగుతున్నాయి. పరిశ్రమలో కార్మికులందరికీ జీవో 6 ప్రకారం కనీస వేతనాలు, ఈఎస్ఐ, పిఎఫ్, జాతీయ పండుగ సెలవులు చట్టపరమైన సౌకర్యాలు అమలు జరగడం లేదన్నారు.

# జూలాజికల్ పార్క్‌కు 148 మందితో ఎక్స్‌పోజర్ విజిట్




**మెదక్ బ్యూరో, సెప్టెంబర్ 11 ( జనంసాక్షి) :** మెదక్ జిల్లాలోని ప్రత్యేక అవసరాలు గల విద్యార్థుల కోసం జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు, జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్. రాజు ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని నెహ్రూ జూలాజికల్ పార్క్‌కు ఎక్స్‌పోజర్ విజిట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 63 మంది ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులు, 63 మంది తల్లిదండ్రులు, 18 మంది సమగ్ర విద్యా వనరుల ఉపాధ్యాయులు, 13 మంది సంరక్షకులు, 4 మంది విద్యాశాఖ కార్యాలయ సిబ్బంది కలిపి మొత్తం 148 మంది మూడు బస్సుల్లో హైదరాబాద్‌కు వెళ్లారు. ఈ సందర్భంగా జిల్లా విద్యాశాఖ అధికారి రాజు మాట్లాడుతూ ప్రత్యేక అవసరాలు గల పిల్లలు ఇంటి పరిసరాలకే పరిమితం కాకుండా బయటి ప్రపంచాన్ని కూడా చూసే అవకాశం కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ఇలాంటి సందర్శనల ద్వారా పిల్లల్లోని భయం, సంకోచం తగ్గి ఆత్మవిశ్వాసం పెరుగుతుందని తెలిపారు. కొత్త ప్రదేశాలను సందర్శించడం, వివిధ వ్యక్తులను కలవడం ద్వారా వారి సామాజిక నైపుణ్యాలు, ఇతర సామర్థ్యాలు మెరుగుపడతాయని పేర్కొన్నారు. తద్వారా భవిష్యత్తులో పిల్లలు మరింత ధైర్యంగా ముందుకు సాగేందుకు ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో సమగ్ర విద్యా సమన్వయకర్త కె. రాజు, సమగ్ర విద్యా వనరుల ఉపాధ్యాయులు, సంరక్షకులు, విద్యాశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# భూవివాదంలో వ్యక్తిపై దాడి

- నిందితుడికి 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్



**తాండూర్, సెప్టెంబర్ 11(జనం సాక్షి) :** మండలంలో భూమి వివాదం నేపథ్యంలో ఓ వ్యక్తిపై దాడికి పాల్పడిన కేసులో నిందితుడిని తాండూరు పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసుల వివరాల ప్రకారం... మంచిర్యాల జిల్లా తాండూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని బోయపల్లి గ్రామంలో భూమి విషయమై గత కొంతకాలంగా వివాదం నడుస్తోంది. ఈ క్రమంలో నిందితుడైన కయిత శ్రీ నిఖిల్, భూమి యజమానిపై తీవ్రంగా దాడి చేసి గాయపరిచాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టి, శుక్రవారం రోజున నిందితుడిని అరెస్ట్ చేశారు. అనంతరం నిందితుడిని గౌరవ బెల్లంపల్లి న్యాయస్థానంలో హాజరుపరచగా, న్యాయమూర్తి నిందితుడికి 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించారు. ఈ మేరకు నిందితుడిని జైలుకు తరలించారు. చట్టాన్ని చేతుల్లోకి తీసుకుంటే కఠిన చర్యలుభూమి వివాదాలు లేదా వ్యక్తిగత తగాదాల పేరుతో ఎవరైనా చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని దాడులకు పాల్పడితే సహించేది లేదని, అలాంటి వారిపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తాండూరు ఎస్ఐ ప్రసాద్ రావు హెచ్చరించారు. సమస్యలు ఉంటే చట్టబద్ధంగా పరిష్కరించుకోవాలే తప్ప, హింసకు పాల్పడితే ఉపేక్షించబోమని స్పష్టం చేశారు.

# పోలీస్ స్టేషన్ వద్ద నిప్పంటించుకున్న యువకుడు

- మంటలు ఆర్పే క్రమంలో రైటర్ ప్రవీణ్‌కు గాయాలు
- భార్యాభర్తల మధ్య గొడవలే కారణం
- గాయపడ్డ వారిని ఎంజీఎం కు తరలింపు
- వరంగల్లో సంచలనం రేపిన సంఘటన



**వరంగల్ బ్యూరో, సెప్టెంబర్ 11 (జనం సాక్షి) :** వరంగల్ మిల్స్‌కాలనీ పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం ఊహించని పరిణామం చోటుచేసుకుంది. వరంగల్ నగరంలోని కరీమాబాదుకు చెందిన కట్ల హర్షిత్ అనే యువకుడు ఒంటిపై పెట్రోల్ పోసుకుని ఠాణాలోకి దూసుకొచ్చిన సంఘటన కలకలం రేపింది. మీల్స్ కాలనీ పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ స్వామి తెలిపిన వివరాల ప్రకారం. వరంగల్ నగరంలోని కరీమాబాద్ ప్రాంతానికి చెందిన కట్ల హర్షిత్ అదే ప్రాంతానికి చెందిన వైష్ణవిని నాలుగు సంవత్సరాల క్రితం ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. భార్యాభర్తల మధ్య మనస్పర్ధలు రావడంతో గత రెండు సంవత్సరాలుగా వైష్ణవి తన తల్లి గారి ఇంటి వద్దనే ఉంటుంది. పెద్ద మనుషుల మధ్య పంచాయతీ పెట్టి వైష్ణవినీ భర్త ఇంటికి పంపించారు. కొద్ది రోజుల తర్వాత మళ్లీ వైష్ణవిని భర్త హర్షిత్ కొడుతుండడంతో పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసింది. ఈ విషయంలో పోలీసులు కేసు నమోదు చేశారు. అంతేకాకుండా తనకు భర్త హర్షిత్కు విడాకులు ఇవ్వాలంటూ వైష్ణవి కోర్టును ఆశ్రయించగా కోర్టులో జడ్జి వైష్ణవి ని విడాకులు కావాల అని అడిగినప్పుడు విడాకులు ఇవ్వండి అని చెప్పింది. కోర్టు నుంచి బయటికి వచ్చిన తర్వాత వైష్ణవిని హర్షిత్ బెదిరించినట్లు వివరించారు. అంతేకాకుండా వైష్ణవి ఉన్న తల్లిగారింటికి వెళ్లి పెట్రోల్ పోసుకొని చేస్తానని హర్షిత్ బెదిరించినట్లు పేర్కొన్నారు. ఈ క్రమంలో శుక్రవారం పోలీస్ స్టేషన్ వద్ద హర్షిత్ పెట్రోల్ పోసుకొని వచ్చి అక్కడే ఉన్నటువంటి తన అత్తను పట్టుకునే ప్రయత్నం చేయగా పోలీస్ స్టేషన్ రైటర్ ప్రవీణ్, మధ్యం అడ్డుకునే క్రమంలో ప్రవీణ్ కు కూడా గాయాలైనట్లు సిఐ వివరించారు. వెంటనే గాయపడ్డ వారిని పోలీసులు చికిత్స నిమిత్తం ఎంజీఎం హాస్పిటల్ కు తరలించినట్లు సిఐ పేర్కొన్నారు. ఇదిలా ఉండగా అత్త, భార్య వేధింపుల కారణంగానే తాను ఈ తీవ్ర నిర్ణయం తీసుకున్నట్లు హర్షిత్ వెల్లడించినట్లు సమాచారం. అయితే ఘటనకు దారితీసిన పూర్తి కారణాలు, వివాదానికి సంబంధించిన ఇతర వివరాలు పోలీసుల విచారణలో తేలాల్సి ఉంది.

# ఒప్పంద ప్రాతిపదికన పోస్టుల భర్తీకి చర్యలు

- జిల్లా అదనపు కలెక్టర్లు యువరాజ్ మర్మాట్, ఎం.డేవిడ్



**కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 11(జనంసాక్షి ):** జిల్లాలోని ప్రభుత్వ వైద్య కళాశాలలో ఖాళీ పోస్టుల భర్తీకి చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యువరాజ్ మర్మాట్, జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎం.డేవిడ్ సంయుక్తశీగా తెలిపారు. శుక్రవారం జిల్లాలోని ప్రభుత్వ వైద్య కళాశాలలో భర్తీకి వాక్-ఇన్ ఇంటర్వ్యూలు నిర్వహించడం జరిగిందని తెలిపారు. ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, సీనియర్ రెసిడెంట్ల పోస్టులను ఒక సంవత్సరం కాలపరిమితికి ఒప్పంద ప్రాతిపదికన భర్తీ చేయడం జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వ వైద్య కళాశాలలో విద్యార్థులకు నాణ్యమైన వైద్య విద్య, శిక్షణ అందించడంతో పాటు, అనుబంధ ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు అవసరమైన వైద్య బోధనా సిబ్బందిని సమకూర్చడం జరుగుతుందని తెలిపారు. వైద్య విద్యా ప్రమాణాలను మరింత మెరుగుపరచడంతో పాటు, ఆసుపత్రిలో రోగులకు సకాలంలో నాణ్యమైన వైద్య సేవలు అందేలా అవసరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.

# పాఠశాలలో ఘనంగా 'మట్టి గణపతుల' తయారీ



- పర్యావరణ పరిరక్షణకు విద్యార్థుల పిలుపు

**ఖిలా వరంగల్, సెప్టెంబర్ 11 (జనం సాక్షి) :** వినాయక చవితి పండగను పురస్కరించుకుని వరంగల్ నగరంలోని కరీమాబాద్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా "మట్టి గణపతుల తయారీ" కార్యక్రమాన్ని అత్యంత ఉత్సాహంగా నిర్వహించారు. క్రాఫ్ట్ టీచర్ కరుణకుమారి ఆధ్వర్యంలో విద్యార్థులు మట్టి గణపతి లను తయారు చేశారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ , ప్రమాదకర రసాయన రంగులతో చేసే విగ్రహాల వల్ల నీరు, పర్యావరణం కాలుష్యమవుతున్నందున, విద్యార్థులంతా స్వహస్తాలతో సహజసిద్ధమైన మట్టి గణపతులను తయారు చేసి పర్యావరణ స్పృహను చాటుకున్నారు. పాఠశాల ప్రాంగణంలో జరిగిన ఈ కార్యక్రమంలో వివిధ తరగతుల విద్యార్థులు అత్యంత సృజనాత్మకతతో రకరకాల ఆకారాల్లో మట్టి వినాయక విగ్రహాలను తీర్చిదిద్దారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు మాట్లాడుతూ "ప్రకృతిని కాపాడుకోవడం మనందరి ప్రాథమిక బాధ్యత. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాల వల్ల చెరువులు, నదులలోని జలచరాలు తీవ్రంగా దెబ్బతింటున్నాయి. ప్రతిఒక్కరూ ఇంట్లోనే మట్టి గణపతినే పూజించి, పర్యావరణాన్ని కాపాడాలి" అని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు రమేష్ రాజమౌళి, పోగు అశోక్, తిలక్,మమత, విశ్వప్రసాద్, కరంచంద్ ప్రగత్ కుమార్ ,అనూష, పి.ఈ.టీ అనిల్ తదితరులు పాల్గొన్నారు.

# వాస్తవాలను మాత్రమే ప్రచారం చేయండి

- కేసుల వ్యవహారంతో కుటుంబం తీవ్ర మానసిక ఒత్తిడికి గురైంది
- ఇకనైనా కుటుంబ సభ్యుల ఇబ్బందులను అర్థం చేసుకోవాలి
- మీడియా, సోషల్ మీడియాకు సుమంత్ భార్య విజ్ఞప్తి



**వరంగల్ బ్యూరో, సెప్టెంబర్ 11 (జనం సాక్షి) :** తమ కుటుంబానికి సంబంధించిన విషయాల్లో నిర్ధారణ కాని అంశాలను ప్రచారం చేయకుండా వాస్తవాలను మాత్రమే ప్రజల ముందుకు తీసుకురావాలని మాజీ ఓఎస్డీ సుమంత్ భార్య డాక్టర్ మనీషా మీడియాను కోరారు. ఈ మేరకు ఆమె ఓ వీడియోను మీడియాకు విడుదల చేశారు. సుమంత్ విషయంలో చోటుచేసుకున్న పరిణామాలతో తమ కుటుంబం తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొంటోందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. కేసుల వ్యవహారంతో కుటుంబ సభ్యులంతా మానసికంగా తీవ్ర ఒత్తిడికి గురయ్యామని తెలిపారు. తన మామయ్య కూడా ఈ ఒత్తిడిని తట్టుకోలేక ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారని, ప్రస్తుతం ఆయన పరిస్థితి విషమంగా ఉందని పేర్కొన్నారు. సుమంత్ ఐఐఎంలో చదువుకున్నారని, కార్పొరేట్ రంగంలో అవకాశాలు ఉన్నప్పటికీ ప్రజాసేవ చేయాలనే ఉద్దేశంతో ఓఎస్డీగా పనిచేశారని ఆమె తెలిపారు. ప్రస్తుతం చోటుచేసుకుంటున్న పరిణామాల నేపథ్యంలో కుటుంబం వ్యాపారంపై దృష్టి సారించి ప్రశాంతంగా జీవించేందుకు ప్రయత్నిస్తోందన్నారు. అయినప్పటికీ సుమంత్‌కు సంబంధించిన వ్యవహారాల కారణంగా తమ బంధువులు, కుటుంబ సభ్యులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితుల్లో మీడియా కూడా సంయమనం పాటించి, అందుబాటులో ఉన్న ఆధారాలు, అధికారిక సమాచారం ఆధారంగానే వార్తలను ప్రచారం చేయాలని విజ్ఞప్తి చేశారు. తమ కుటుంబం ఎదుర్కొంటున్న పరిస్థితులను అర్థం చేసుకుని, వ్యక్తిగత జీవితానికి భంగం కలగకుండా సహకరించాలని ఆమె కోరారు. వాస్తవాలను ప్రజలకు తెలియజేయడంలో మీడియా బాధ్యత కీలకమని పేర్కొన్నారు.

# రూర్బన్ కన్వెన్షన్ హాల్‌లో కలెక్టర్ తనిఖీ



**వరంగల్, సెప్టెంబర్ 11 (జనంసాక్షి) :** పర్వతగిరి మండల కేంద్రంలో నిర్మిస్తున్న రూర్బన్ కన్వెన్షన్ హాల్‌ను జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద పరిశీలించారు. ఈ సందర్భంగా నిర్మాణ పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. సుమారు రూ.2.00 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించిన కన్వెన్షన్ హాల్ నిర్మాణ పనులను నాణ్యతా ప్రమాణాలతో, నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ప్రజలకు ఉపయోగకరంగా ఉండేలా హాల్‌లో అవసరమైన మౌలిక వసతులు, సౌకర్యాలను కల్పించాలని సూచించారు. నిర్మాణ పనుల్లో నాణ్యత విషయంలో రాజీ పడకుండా, నిరంతరం పర్యవేక్షించాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ తనిఖీలో డిఆర్డిఓ నాగపద్మజా, వరంగల్ ఆర్డీవో సుమ, పర్వతగిరి తహసిల్దార్ వెంకట స్వామి సంబధిత అధికారులు జిల్లా కలెక్టర్ వెంట ఉన్నారు.

# మంత్రాల నెపంతో బాలికతో అసభ్య ప్రవర్తన

- వ్యక్తి అరెస్టు



**లక్షెట్టిపేట సెప్టెంబర్ 11 (జనంసాక్షి) :** పోలిస్ స్టేషన్ పరిధిలో ఫిర్యాదిదారు ఇచ్చిన పిర్యాదు మేరకు ధర్మపురికి చెందిన బాధితురాలి తల్లి తన కూతురుకి ఆరోగ్యం బాగులేక పోవడంతో లక్షెట్టిపేట్ గోదావరి రోడ్ కి చెందిన ఒక వ్యక్తి జాతకాలు చూసి బాగు చేస్తాడని తెలిసి తేది: 10.09.2026 రోజున లక్షెట్టిపేట్ గోదావరి రోడ్ కి చెందిన పెండెం సతీష్ అను వ్యక్తి దగ్గరకి రాగ అట్టి పెండెం సతీష్ అను వ్యక్తి ఇదే అదును అనుకుని అట్టి అమ్మాయి(బాధితురాలు)ని ఒంటరిగా పూజ రూమ్ పక్కన బయట వైపు తీసుకెళ్ళి అసభ్యకరంగా ప్రవర్తించి, లైంగికంగా వేదించినాడు. ఇట్టి విషయాన్నీ తల్లి తండ్రులకి చెప్తే చంపుతానని బెదిరించగా బాదితురాలు ఆ రోజు ఎం చెప్పలేదు. తిరిగి తేది: 10.09.2026 రోజున అమ్మాయి ఇట్టి విషయం తల్లి తండ్రులకి చెప్పగా, అమ్మాయి తల్లి లక్షెట్టిపేట్ పోలిస్ స్టేషన్ లో దరఖాస్తు ఇవ్వగా ఇట్టి పెండెం సతీష్ పై పోక్సో కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నాం. ఇట్టి దర్యాప్తు లో బాగంగా పెండెం సతీష్ ని రిమాండ్ నిమిత్తం కోర్ట్ ముందు హాజరు పరుస్తున్నాం. ఈ కేసును సిపి అంబర్ కిషోర్ ఝా ఆదేశాలపై, మంచిర్యాల డి సి పి ఎగ్గడి భాస్కర్ ఉత్తర్వుల మేరకు, మంచిర్యాల ఏ సి పి ప్రకాశ్ పర్యవేక్షణలో, లక్షెట్టిపేట సీఐ రమణ మూర్తి, లక్షెట్టిపేట ఎస్సై సురేష్ సిబ్బంది చాక చక్యంగా నిందితుడిని పట్టుకోవడం జరిగింది. ఇట్టి నిందితుడిని పట్టుకోవడంలో చాక చక్యంగా వ్యవహరించిన లక్షెట్టిపేట సీఐ రమణ మూర్తి, లక్షెట్టిపేట ఎస్సై సురేష్ సిబ్బంది ఏఎస్ఐ అన్వర్ హుస్సేన్, హెచ్ సి వసంత్, సుధాకర్, రాజమౌళి, సత్యనారాయణ, మల్లేష్, కుమారస్వామి, సాంబరి రమేష్, రవీందర్, బానావత్ రమేష్, మహేష్, తిరుపతి, శ్రీకాంత్, ప్రేం సాగర్, సాగర్, మనీషా, ప్రవలికలను సిపి డిసిపి అబినందించినారు.

లక్షెట్టిపేట్ సర్కిల్ పరిదిలో పట్టణ, గ్రామీణ ప్రజలందరికి తెలియచేయునది ఏమనగా మాయలు, మంత్రాలు, తంత్రాల, కడుపులో మందు పోయడం, ఎత్తి పోయడం లాంటి మూడ నమ్మకాలు లాంటివి ఉండవు, ఇట్టి మూడ నమ్మకాలు నమ్మి ఎవరు మోసపోవద్దు. మంత్రాల ద్వారా రోగాలు నయమవుతాయని, గుప్తనిధులు లభిస్తాయని లేదా ఇతరులకు కీడు జరుగుతుందని చెప్పే దొంగ బాబాలు, మంత్రగాళ్ల మాటలను ఎట్టిపరిస్థితుల్లోనూ నమ్మవద్దు. శారీరక లేదా మానసిక అనారోగ్య సమస్యలు తలెత్తినప్పుడు వెంటనే అర్హత కలిగిన వైద్యులను లేదా ప్రభుత్వ ఆసుపత్రిని సంప్రదించాలి తప్ప, మంత్రగాళ్ల వద్దకు వెళ్లి సమయాన్ని, ప్రాణాలను పణంగా పెట్టవద్దు. ఈ విధమైన చర్యలు సమాజ శాంతిభద్రతలకు విఘాతం కలిగించడమే కాకుండా చట్టరీత్యా తీవ్రమైన నేరం. ఇట్టి నమ్మకాలతో అమాయక ప్రజలను మోసం చేయడానికి ఎవరైనా పాల్పడితే కటిన చర్యలు తీసుకోబడును. లక్షెట్టిపేట సిఐ రమణ మూర్తి, తెలిపారు

# అడవి పంది మాంసం విక్రయిస్తున్న ముగ్గురు వ్యక్తులపై కేసు




**గూడూరు, సెప్టెంబర్ 11 (జనంసాక్షి):** మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం మట్టె వాడ గ్రామ సమీపంలో అటవీ జంతువులను వేటాడి వాటి మాంసాన్ని విక్రయిస్తున్న ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు అటవీ శాఖ రేంజ్ అధికారి ప్రసాద రావు తెలిపారు. వివరాల్లోకి వెళ్లగా ఈనెల 5న అటవీ శాఖ అధికారులు తన సిబ్బందితో పెట్రోలింగ్ తనిఖీలు నిర్వహిస్తుండగా బయ్యారం మండలం జాప్ర తండాకు చెందిన గుగులోత్ గౌరీ శంకర్ అటవీ జంతువు మాంసం తీసుకుని వెళ్తుండగా అటవీశాఖ అధికారులను చూసి మాంసాన్ని అక్కడ వదిలేసి పరారయ్యారు. అధికారులు అతనిని అదుపులోకి తీసుకొని విచారించగా మట్టేవాడ గ్రామానికి చెందిన గుండెబోయిన హరీష్,బానోత్ సురేష్, మాంసాన్ని విక్రయించారాని, వారు పరారీలో ఉండగా ఈనెల 9న వారిని అదుపులోకి తీసుకొని విచారించగా అటవీ ప్రాంతంలో అడవి పందిని వేటాడి మాంసమును అమ్మినట్లు వారు ఒప్పుకున్నారని, అనంతరం వారిపై కేసు నమోదు చేసి వారిని కోర్టులో హాజరు పరిచారు. ఈసందర్భంగా అటవీ శాఖ అధికారి ప్రసాద రావు మాట్లాడుతూ ఎవరు అటవీ జంతువులను వేటాడొద్దని,నేరాలకు పాల్పడొద్దని,వన్యప్రాణి చట్టం ప్రకారం వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# గణపతి ఉత్సవాలను శాంతియుతంగా జరుపుకోవాలి

- డీజేల వినియోగం నిబంధనలను తప్పకుండా పాటించాలి
- ఏసీపీ నర్సయ్య



**పాలకుర్తి, సెప్టెంబరు 11(జనంసాక్షి)** ఈ నెల 14 నుంచి ప్రారంభం కానున్న గణపతి నవరాత్రి ఉత్సవాలను మతాలకు అతీతంగా శాంతియుతంగా జరుపుకోవాలని వర్ధన్నపేట ఏసీపీ నర్సయ్య కోరారు. శుక్రవారం మండల కేంద్రంలోని పోలీస్టేషన్ లో పాలకుర్తి, దేవరుప్పుల, కొడకండ్ల మండలాల గణపతి నిర్వాహకులు, డీజేల ఆపరేటర్లతో శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ నర్సయ్య ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ గణపతి ఉత్సవ కమిటి నిర్వాహకులు నిబంధనలు పాటిస్తూ మండపాలను ఏర్పాటు చేసుకోవాలని, వాటి ఏర్పాటుకు ముందు పోలీసులు అనుమతి తీసుకోవాలన్నారు. డీజేల వినియోగంపై ఉన్న నిబంధనలను ప్రతి ఒక్కరు ఖచ్చితంగా పాటించాలని, ఉత్సవాల సమయంలో ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అందరు పోలీసులకు సహకరించాలని, వినాయక నిమజ్జనం రోజు నిర్వహిం చే శాంతి యాత్రలో శాంతి భద్రతలకు కాపాడే క్రమంలో యువకులు, మండపాల నిర్వాహకులు పోలీసులకు పూర్తి సహకరించాలని సూచించారు. సమావేశంలో సీఐ భరత్ సుమన్, పాలకుర్తి, కొడకండ్ల ఎస్సై లు దూలం పవన్ కుమార్, రాజు, వివిధ గ్రామాల గణపతి ఉత్సవ కమిటీల నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.



# గుప్తా స్కూల్ ఉపాధ్యాయునికి ఉత్తమ ఉపాధ్యాయ ప్రశంస

- అభినందించిన జిల్లా కలెక్టర్....

**భీమిని, సెప్టెంబర్11 (జనంసాక్షి) :** మండల కేంద్రంలోని గుప్తా ప్రాథమికోన్నత పాఠశాల లో ఉపాధ్యాయునిగా విధులు నిర్వహిస్తున్న మేడి మల్లేష్ ను జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డువారించింది. శుక్రవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ కుమార్ దీపక్ చేతుల మీదుగా జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ ప్రశంస పత్రాన్ని అందుకున్నాడు. ఉత్తమ ఉపాధ్యాయుడిగా ప్రశంసలు పొందిన మేడి మల్లేశం పాఠశాల కరస్పాండెంట్ ప్రసాద్ గుప్తా మరియు ఉపాధ్యాయులు అభినందించారు. ట్రాస్మా నుండి కరస్పాండెంట్ ప్రసాద్ గుప్తా మరియు ఉపాధ్యాయ నిర్వహిస్తున్న గార్డెన్ శేఖర్ ను మండల ఉత్తమ ఉపాధ్యాయులుగా గుర్తించి ప్రశంసించినట్లు కరస్పాండెంట్ తెలిపారు. ప్రశంస పత్రం అందజేసిన జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులకు చక్కని విద్యా బోధన చేస్తూ మరిన్ని అవార్డులను పొందాలని ఆశాభావం వ్యక్తం చేశారు ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

# గడ్డి మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

**బయ్యారం సెప్టెం బర్ 11( జనంసాక్షి) :** భార్యతో ఏర్పడిన చిన్న మనస్పర్ధల కారణంగా మనస్థాపాన్ని గురైన ఓ వ్యక్తి పురుగుమందు తాగి మృతి చెందిన సంఘటన మండలంలోని వినొబానగర్ గ్రామంలో చోటుచేసుకుంది. స్థానిక ఎస్సై ప్రశాంత్ బాబు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని గౌరారం గ్రామపంచాయతీ వినోబా నగర్ గ్రామానికి చెందిన మేకల పర్వతాలు ( 65) కూలి నాలి చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఇటీవల కుటుంబ సమస్యల్లో భాగంగా భార్యతో చిన్నపాటి గొడవ జరిగింది. దీంతో భార్య అలిగి పుట్టింటికి వెళ్ళింది. మనస్థాపానికి గురైన పర్వతాలు ఈ నెల 6 వ తేదీన ఇంట్లో ఎవరు లేని సమయంలో కలుపు నివారణకు వాడే గడ్డి మందును తాగి వాంతులు చేసుకుంటుండగా పక్కింటి వారు గమనించి వెంటనే మహబూబాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిల్లో వైద్య సేవలు అందుకుంటునే పర్వతాలు శుక్రవారం మరణించాడు. మృతుడి కుమారుడు యాకయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

# సిపిఎం కార్యాలయంలో ఆదర్శ వివాహం

**బయ్యారం సెప్టెంబర్ 11( జనంసాక్షి) :** మండల కేంద్రంలోని సిపిఎం కార్యాలయంలో శుక్రవారం ఒక ప్రేమ జంటకు పార్టీ నాయకులు ఆదర్శ వివాహం జరిపించారు వివరాలు ఇలా ఉన్నాయి. ఖమ్మం జిల్లా కారేపల్లి మండలం మాదారం గ్రామానికి చెందిన ముక్తి రామారావు, రేఖల కుమార్తె ముక్తి పవిత్ర, మహబూబాబాద్ జిల్లా బయ్యారం గ్రామానికి చెందిన యాట వెంకన్న , లత కుమారుడైన యాట వీరబాబు ఇరువురు గత కొంతకాలంగా ప్రేమ లోవున్నారు. వారు వేరు వేరు కులాలకు చెందిన వారు కావడం తో ఇరుకుటుంబాల పెద్దలు పెండ్లికి అంగీకరిస్తారో లేదో అనే ఆలోచనతో ప్రేమికులు ఇరువురు స్థానిక సిపిఎం నాయకులను ఆశ్రయించారు. దీంతో నాయకులు మండ రాజన్న, నంబూరి మదు, అంగిరేకుల నాగేశ్వరావు,వల్లాల వెంకన్న, చంటి ల సమక్షంలో ఇరుకుటుంబాల పెద్దలను పిలిచి సంప్రదించగా అమ్మాయి కుటీంబీకులు కులాంతర వివాహనికి అంగీకరించక పోవడంతో ఇరువురు మేజర్లు కావడంతో పార్టినాయకులే పెళ్లి పెద్దలుగా మండ రాజన్న ఆచార్యులుగా వివాహం జరిపించారు. ఆదర్శ వివాహం చేసుకున్న జంటను పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలోకత్తి రమేష్ రాజా, వెన్నుమోహన్,కంకటి వీరన్న ,బొమ్మగాని శీను, హేమంత్, సునీల్, లోకేష్ ,వెంకటేష్ ,భరత్ విష్ణు పాల్గొన్నారు.

# భద్రాచలంలో గోల్డ్ షాపులపై కొరడా

### నకిలీ హాల్‌మార్క్ ఆరోపణలపై అధికారుల మెరుపు దాడులు

### నిబంధనలకు విరుద్ధంగా ఉన్న పలు దుకాణాలు సీజ్



**భద్రాచలం సెప్టెంబరు 11 (జనంసాక్షి)** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఏజెన్సీ ప్రాంత గిరిజన వినియోగదారులను మోసం చేస్తున్నారన్న ఆరోపణల నేపథ్యంలో భద్రాచలంలోని బంగారు దుకాణాలపై అధికారులు కొరడా ఝుళిపించారు. నకిలీ హాల్‌మార్క్ గుర్తులతో బంగారు ఆభరణాలను విక్రయిస్తున్నారన్న సమాచారంతో అధికారులు ఆకస్మిక తనిఖీలకు దిగారు. దీంతో గోల్డ్ షాపుల యాజమానుల్లో ఒక్కసారిగా కలకలం రేగింది. అధికారుల తనిఖీల్లో నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నట్లు గుర్తించిన పలు దుకాణాలను సీజ్ చేసినట్లు సమాచారం. బంగారం నాణ్యత, హాల్‌మార్క్ గుర్తులు, బీఐఎస్ నిబంధనలు, విక్రయ బిల్లులు తదితర అంశాలను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించినట్లు తెలుస్తోంది.

**గిరిజన వినియోగదారులే టార్గెట్టా?**

ఏజెన్సీ ప్రాంతం కావడంతో భద్రాచలానికి పెద్ద సంఖ్యలో గిరిజనులు బంగారం కొనుగోలు చేసేందుకు వస్తుంటారు. ఈ నేపథ్యంలో నాణ్యత విషయంలో ఏమాత్రం తేడా జరిగినా వినియోగదారులు తీవ్రంగా నష్టపోయే అవకాశం ఉందని అధికారులు పేర్కొన్నట్లు సమాచారం. బంగారం కొనుగోలు చేసే సమయంలో హాల్‌మార్క్, బీఐఎస్ గుర్తు, బరువు, బిల్లు తప్పనిసరిగా పరిశీలించాలని సూచించారు. వినియోగదారులను మోసం చేసే వ్యాపారులపై కఠిన చర్యలు తప్పవని అధికారులు హెచ్చరించినట్లు తెలుస్తోంది. అయితే సీజ్ చేసిన దుకాణాల్లో అసలు ఏ మేరకు అక్రమాలు బయటపడ్డాయి? ఎంత మొత్తంలో బంగారం స్వాధీనం చేసుకున్నారు? యాజమాన్యాలపై కేసులు నమోదు చేశారా? అనే అంశాలపై అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది.

# గురువులే గురువిందలైతే ఎలా..?

- ఉపాధ్యాయ సంఘంలో నిర్మాణం కోసం సేకరించిన నిధులపై ప్రశ్నలు
- పెరిగిన వ్యయంపై పలు ప్రశ్నలు
- లెక్కలు తేల్చాలంటున్న ఓ వర్గం
- 'సూట్'కు సిద్ధమవుతున్నట్లు సమాచారం

**నిర్మాణం కోసం సేకరించిన నిధుల వ్యవహారంలో సుమారు రూ.70-80 లక్షల మేర మొత్తం ఉన్నట్లు జరుగుతున్న ప్రచారంపై కూడా స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అయితే ఈ మొత్తానికి సంబంధించిన అధికారిక లెక్కలు వెల్లడించాల్సి ఉంది.**



**ఖమ్మం (జనంసాక్షి) :** సమాజానికి మార్గదర్శకులుగా నిలవాల్సిన ఉపాధ్యాయులే.. తమ సంఘ వ్యవహారాల్లో లెక్కలు, పారదర్శకతపై ప్రశ్నలు ఎదుర్కొంటున్న పరిస్థితి చర్చనీయాంశంగా మారింది. జిల్లాలో ఎంతో ప్రయారిటీ గల ఒక ప్రముఖ ఉపాధ్యాయ సంఘంలో నిర్మాణం కోసం సేకరించిన నిధులు, వాటి ఖర్చు, నిర్మాణ వ్యయానికి సంబంధించిన వివరాలపై అదే సంఘంలోని ఒక వర్గం అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నట్లు సమాచారం. ముఖ్యంగా నిర్మాణ వ్యయం ఎలా పెరిగింది..? పెరిగిన వ్యయానికి కారణాలేమిటి? సేకరించిన నిధులు ఎంత? ఇప్పటివరకు ఖర్చు ఎంత? ఖర్చులకు సంబంధించిన బిల్లులు, రసీదులు ఉన్నాయా? అనే ప్రశ్నలు తెరపైకి వచ్చినట్లు తెలుస్తోంది.

నిర్మాణం కోసం సేకరించిన నిధుల వ్యవహారంలో సుమారు రూ.70-80 లక్షల మేర మొత్తం ఉన్నట్లు జరుగుతున్న ప్రచారంపై కూడా స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అయితే ఈ మొత్తానికి సంబంధించిన అధికారిక లెక్కలు వెల్లడించాల్సి ఉంది.

**లెక్కలు అడిగితే సమాధానం చెప్పాల్సిందే**

సభ్యుల నుంచి సేకరించిన ప్రతి రూపాయికి లెక్క ఉండాలని, నిర్మాణానికి సంబంధించిన ఆదాయ, వ్యయ వివరాలను సభ్యుల ముందుంచాలని ఒక వర్గం కోరుతున్నట్లు సమాచారం. దీనివల్ల వాస్తవాలు స్పష్టమవుతాయని, అనవసరమైన అనుమానాలకు తావుండదని వారు భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఇదే సమయంలో, ఈ వ్యవహారంపై అదే యూనియన్‌లోని నిబంధనల ప్రకారం 'సూట్' వేసేందుకు ఒక వర్గం సిద్ధమవుతున్నట్లు సమాచారం.

**గురువులు సమాజానికి ఆదర్శంగా నిలవాల్సిందే కదా!**

విద్యార్థులకు నిజాయితీ, బాధ్యత, నైతిక విలువలు బోధించే ఉపాధ్యాయుల సంఘంలోనే నిధుల లెక్కలపై ప్రశ్నలు తలెత్తడం సహజంగానే చర్చకు దారితీస్తోంది. "సమాజానికి మార్గదర్శకంగా నిలవాల్సిన గురువులే.. తమ వ్యవహారాల్లో పారదర్శకతకు ఎందుకు పరీక్ష పెట్టుకుంటున్నారు?" అన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి.

గురువు అంటే కేవలం పాఠాలు చెప్పే వ్యక్తి మాత్రమే కాదు.. తన ఆచరణతో సమాజానికి ఆదర్శంగా నిలిచే వ్యక్తి. అలాంటి గురువులే పరస్పరం లెక్కలు అడిగే పరిస్థితి వస్తే.. అది ఆ సంఘానికే కాదు, మొత్తం ఉపాధ్యాయ వర్గానికి ఆలోచించాల్సిన అంశంగా మారుతుంది. గురువులు గురువిందలుగా మారకూడదంటే.. మాటల్లో చెప్పే నీతి, నిజాయితీ, పారదర్శకత వారి సంఘ వ్యవహారాల్లోనూ కనిపించాల్సిందే. ప్రముఖ ఉపాధ్యాయ సంఘంలో జరుగుతున్న అంతర్గత విషయాలు ఉపాధ్యాయులను కలవరానికి గురి చేస్తున్నాయి.



# జర్నలిస్టులకు 'ఎల్ఐజీ, స్కీంను వర్తింపజేయండి

- హౌసింగ్ టవర్లు నిర్మించి 2బీహెచ్ కే ఫ్లాట్లు ఇవ్వండి
- లేదా 200 గజాల స్థలం ఇచ్చి, ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయండి
- ఖమ్మం ప్రెస్ క్లబ్ పై విచారణ పూర్తి చేసి ఎన్నికలు జరపండి
- జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్ ను కోరిన డబ్ల్యూజేఐ ప్రతినిధులు
- విజ్ఞప్తిపై సానుకూలంగా స్పందించిన కలెక్టర్ దివాకర టి.ఎస్

**ఖమ్మం, సెప్టెంబర్11, (జనంసాక్షి) :** జర్నలిస్టుల ఇండ్ల స్థలాల సమస్య, ఖమ్మం ప్రెస్ క్లబ్ ఎన్నికల నిర్వహణపై వర్కింగ్ జర్నలిస్ట్స్ ఆఫ్ ఇండియా (డబ్ల్యూజేఐ) ఖమ్మం జిల్లా ప్రతినిధులు కలెక్టర్ దివాకర టి.ఎస్ ను కలిశారు. ప్రస్తుతం హైదారాబాద్ లో అమలు చేస్తున్న ఎల్ఐజీ (లో ఇన్కమ్ గ్రూప్) స్కీమును జర్నలిస్టులకు కూడా వర్తింపజేయాలని కోరారు. జర్నలిస్టుల కోసం ప్రత్యేకంగా హౌసింగ్ టవర్లు నిర్మించి, వాటిలో సుమారు 1200 అడుగుల విస్తీర్ణంలో 2బీహెచ్ కే ఫ్లాట్లు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఇది సాధ్యం కానీ పక్షంలో అర్హత కలిగిన ప్రతి జర్నలిస్టుకు 200 గజాల ఇంటి స్థలం కేటాయించి, ఇందిరమ్మ ఇంటిని కూడా మంజూరు చేయాలని కోరారు. ఈ మేరకు డబ్ల్యూజేఐ రాష్ట్ర కార్యదర్శి నారా సుబ్రమణ్యేశ్వర రావు (ఎన్.ఎస్.రావు), జిల్లా కన్వీనర్ గంటెల ఆనంద్, కో కన్వీనర్ ఏం.ఏ అన్సార్ పాషా, ఖమ్మం అసెంబ్లీ నియోజక వర్గ మరియు ప్రెస్ క్లబ్ ఇంచార్జి కె. కళ్యాణ్ చక్రవర్తి, జిల్లా నాయకులు జాబిశెట్టి కుటుంబ రావు, ఏనిగండ్ల శ్రీనివాస రావు, బొడ్డుపల్లి రవీందర్, పసుపులేటి ఉపేందర్ తదితరులు కలెక్టర్ దివాకర టి.ఎస్ కు వినతి పత్రం అందజేశారు. దీనిపై స్పందించిన కలెక్టర్ ఈ ప్రతిపాదనను రాష్ట్ర ప్రభుత్వానికి పంపుతామని చెప్పారు. ఈ సందర్భంగా ఖమ్మం ప్రెస్ క్లబ్ ఎన్నికల నిర్వహణపై కూడా డబ్ల్యూజేఐ ప్రతినిధులు కలెక్టర్ తో సుధీర్ఘంగా చర్చించారు. చాలా కాలంగా ఖమ్మం ప్రెస్ క్లబ్ కు ఎన్నికలు జరగడంలేని తెలిపారు. ప్రస్తుతం, ప్రెస్ క్లబ్ నిర్వహణపై జరుగుతున్న విచారణను వెంటనే పూర్తి చేసి, ఎన్నికలు జరపాలని కోరారు. ఈ అంశంపై కూడా సానుకూలంగా స్పందించిన కలెక్టర్ దివాకర టి.ఎస్, అందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని డబ్ల్యూజేఐ ప్రతినిధులకు హామీ ఇచ్చారు.

# సాగునీరు, కరెంటు కష్టాలతో రైతుల పరిస్థితి అగమ్యగోచరం

### మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్



**ఖమ్మం కార్పొరేషన్ (జనంసాక్షి) :** ఉమ్మడి ఖమ్మం జిల్లాలో సాగునీరు, విద్యుత్ కష్టాలతో రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారిందని మాజీ మంత్రి పువ్వాడ అజయ్ ఆందోళన వ్యక్తం చేశారు. రైతులు పండించిన పంటలకు అవసరమైన సాగునీరు, విద్యుత్ అందించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫల మైందని విమర్శించారు. ఎల్ నినో ప్రభావం ఉంటుందని ముందుగానే తెలిసినప్పటికీ కాంగ్రెస్ ప్రభుత్వం ముందస్తు ప్రణాళికతో వ్యవహరించక పోవడం వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. రైతుల సమస్యలపై బీఆర్ఎస్ ఎప్పటికప్పుడు ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూ, పోరాటాలు చేస్తున్నప్పటికీ ప్రభుత్వం కనీసం స్పందించకపో వడం వల్ల ప్రస్తుతం పంటలు ఎండిపోయే పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు.జిల్లా వ్యాప్తంగా కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యం, అసమర్ధ పాలన కార ణంగా పంట పొలాలు తీవ్రంగా దెబ్బతింటున్నాయని, రైతులు భారీగా నష్టపోయే పరిస్థితి ఏర్పడిందని రైతులకు తక్షణమే అవసరమైన సాగునీరు, విద్యుత్ అందిం చేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలని క్షేత్ర స్థాయిలో పంటలను పరిశీలించి అత్యవసర ప్రాతిపదికన సాగునీరు అందించి రైతులను ఆదుకోవాలని మాజీ మంత్రి డిమాండ్ చేశారు.

## ఆశా వర్కర్ల అరెస్టులను ఖండిస్తూ నిరసన



**మర్రిగూడ, సెప్టెంబర్ 11 (జనంసాక్షి) :** హైదరాబాద్‌లో తమ సమస్యల పరిష్కారం కోసం ధర్నాకు తరలివెళ్లిన ఆశా వర్కర్లను పోలీసులు అరెస్టు చేసి నిర్బంధించడాన్ని ఖండిస్తూ శుక్రవారం మర్రిగూడ మండల కేంద్రంలోని బస్టాండ్ సెంటర్‌లో ఆశా వర్కర్స్ యూనియన్, సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఏర్పుల యాదయ్య మాట్లాడుతూ.. ఆశా వర్కర్లు తమ న్యాయమైన సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు హైదరాబాద్‌కు వెళ్లగా వారిని అరెస్టు చేసి పోలీస్ స్టేషన్లలో నిర్బంధించడం సరికాదన్నారు. ఎన్నికల సమయంలో ఆశా వర్కర్ల సమస్యలను పరిష్కరిస్తామని హామీలు ఇచ్చిన ప్రభుత్వం ప్రస్తుతం వారి సమస్యలపై సానుకూలంగా స్పందించాలని కోరారు.


## అప్పు తీర్చాలన్నందుకు దాడి, బెదిరింపులు

### ఇద్దరిపై కేసు నమోదు

**కొత్తగూడెం క్రైమ్, సెప్టెంబర్11 ( జనం సాక్షి):** అప్పుగా తీసుకున్న డబ్బులు తిరిగి ఇవ్వాలని అడిగినందుకు ఓ వ్యక్తిపై దాడి చేసి, ప్రాణాలతో తీస్తామని బెదిరించిన సంఘటన పాల్వంచ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం... పాల్వంచ రాహుల్ గాంధీ నగర్‌కు చెందిన మద్దంశెట్టి సాయిబాబు (44) బోర్వెల్ వ్యాపారం నిర్వహిస్తున్నారు. లక్ష్మీదేవిపల్లి-సోములగూడెం గ్రామంలో ఇండియన్ పెట్రోల్ బంక్ ఎదురుగా ఉన్న ఆయన బోర్వెల్ ఆఫీస్ పక్కన ఫాస్ట్ ఫుడ్ సెంటర్ నడిపే మడిపల్లి అనిల్ కుమార్ అనే వ్యక్తి, కుటుంబ అవసరాల కోసం గతంలో విడతల వారీగా ?5 లక్షలు అప్పుగా తీసుకున్నాడు. ?తీసుకున్న డబ్బులు తిరిగి ఇవ్వమని సాయిబాబు పలుమార్లు కోరగా, అనిల్ కుమార్ దాటవేస్తూ వచ్చాడు. దీంతో బాధితుడు కోర్టులో ప్రైవేట్ కేసు దాఖలు చేశారు. మనసులో కోపం ఉంచుకున్న అనిల్ కుమార్, (శుక్రవారం) సాయంత్రం 4:20 గంటల ప్రాంతంలో బీరు సీసాతో సాయిబాబు ఆఫీస్‌లోకి వచ్చి "నాపై కేసు వేస్తావా, నీకు డబ్బులు ఇవ్వను, ఏం చేస్తావో చేసుకో" అని బెదిరింపులకు దిగాడు. ?కేకలు వేస్తూ బూతులు తిడుతుండగా, కొంతసేపటికి అనిల్ కుమార్ తండ్రి వెంకటేశ్వర్లు కూడా అక్కడికి చేరుకున్నాడు. ఇద్దరూ కలిసి ఆఫీస్‌లోని ప్రవేశించి సాయిబాబును తోసివేసి, చంపుతామని బెదిరించడమే కాకుండా, షాపులోని రూ. 2,000 విలువైన ప్లాస్టిక్ కుర్చీలను ధ్వంసం చేశారు.అక్రమంగా ఆఫీస్‌లోకి చొరబడి దాడికి పాల్పడటంతో పాటు బెదిరింపులకు దిగిన తండ్రీకొడుకులు అనిల్ కుమార్, వెంకటేశ్వర్ల పరిధిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బాధితుడు పాల్వంచ రూరల్ ఎస్ఐ కి ఫిర్యాదు చేయగా శుక్రవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్సై సురేష్ తెలిపారు.

# భర్త మృతిపై న్యాయం కోసం ఆర్లెగూడెంలో మహిళ నిరాహార దీక్ష

### భర్త మృతిపై సమగ్ర విచారణ జరిపించాలని బాధితురాలి డిమాండ్



**చిలుకూరు (జనంసాక్షి) :** చిలుకూరు మండలంలోని ఆర్లెగూడెం గ్రామంలో తమకు న్యాయం చేయాలంటూ నాగారం గ్రామానికి చెందిన భత్తుల శేషమ్మ ఆందోళనకు దిగారు. తన భర్త భత్తుల ఆంజయ్య మృతిపై సమగ్ర విచారణ జరిపించి న్యాయం చేయాలని ఆమె డిమాండ్ చేశారు. శేషమ్మ మాట్లాడుతూ.. అర్వపల్లిలో ఓ వివాహ కార్యక్రమానికి హాజరైన సమయంలో తన భర్త ఆంజయ్యను హత మార్చారని తెలిపారు. తన భర్త మృతికి ఆవుదొడ్డి లక్ష్మమ్మ, భత్తుల వెంకన్న, బత్తుల శ్రీను, ఆవుదొడ్డి మహేష్ కారణమని ఆమె ఆరోపించారు. ఈ విషయంపై నాగారం, తిరుమలగిరి పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. తన భర్తకు సంబంధించిన పోస్టుమార్టం నివేదికను ఉగ్ర నరసింహ వద్ద ఉంచి తనకు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని శేషమ్మ ఆరోపించారు. పెద్దమనుషులుగా ఉన్న బండి వీరయ్య, కోటయ్య, ఉగ్ర నరసింహ, బత్తుల ఎల్లయ్యలు తమకు న్యాయం చేయకుండా ఇబ్బందులు పెడుతున్నారని పేర్కొన్నారు. అలాగే తనకు న్యాయం జరిగే వరకు ఆవుదొడ్డి లక్ష్మమ్మ ఇంటి వద్ద నిరాహార దీక్ష కొనసాగిస్తానని తెలిపారు. తనకు అండగా నిలిచే జానపాటి కాశయ్యను కూడా చంపుతామని బెదిరింపులు వచ్చాయని ఆరోపించారు. సమస్యను పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పరిష్కారం కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు.వెంటనే సంబంధిత అధికారులు స్పందించి తన భర్త మృతిపై సమగ్రంగా విచారణ జరిపి, పోస్టుమార్టం నివేదికను అందజేసి, తనకు న్యాయం చేయాలని శేషమ్మ కోరారు. బాధితురాలి ఫిర్యాదుపై అధికారులు స్పందించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.



# నకిలీ డీజిల్ ఎగ్జాస్ట్ ఫ్లూయిడ్ 360 లీటర్లు స్వాధీనం

### కేసు నమోదు

**చిలుకూరు, సెప్టెంబర్ 11 (జనంసాక్షి):** చిలుకూరు గ్రామ శివారులోని మురగన్ వేబ్రిడ్జి సమీపంలో ఎన్ హెచ్-167 రహదారి పక్కన ఏర్పాటు చేసిన డీజిల్ ఎగ్జాస్ట్ ఫ్లూయిడ్ స్టాల్‌లో నకిలీ డీజిల్ ఎగ్జాస్ట్ ఫ్లూయిడ్ విక్రయిస్తున్నట్లు గుర్తించి 360 లీటర్ల నకిలీ ఉత్పత్తిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఇఐపిఆర్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సంస్థలో సీనియర్ ఆపరేషన్స్ మేనేజర్‌గా పనిచేస్తున్న గరికిముక్కు విజయ్ కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు చర్యలు చేపట్టారు. ఖానారం ప్రజాపత్ అనే వ్యక్తి స్టాల్ ఏర్పాటు చేసి సేల్స్ మెన్‌ను నియమించి టాటా మోటార్స్ లిమిటెడ్, గల్ఫ్ ఆయిల్ లూబ్రికెంట్స్ లిమిటెడ్ సంస్థల పేర్లు, లోగోలను ఉపయోగించి నకిలీ డీజిల్ ఎగ్జాస్ట్ ఫ్లూయిడ్‌ను అసలైన ఉత్పత్తులుగా విక్రయిస్తున్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో సంబంధిత స్థలంలో తనిఖీలు నిర్వహించిన పోలీసులు 360 లీటర్ల నకిలీ డీజిల్ ఎగ్జాస్ట్ ఫ్లూయిడ్‌ను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. ఈ ఘటనపై దర్యాప్తు కొనసాగుతున్నట్లు చిలుకూరు ఎస్ఐ బి. మోహన్ బాబు తెలిపారు.

# బాలిక ఆత్మహత్యపై కుటుంబ సభ్యుల ధర్నా

### నిందితులను అరెస్ట్ చేయాలని పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళన

### అధికార పార్టీ నాయకుడిపై కేసును తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారంటూ ఆరోపణ



**మర్రిగూడ, సెప్టెంబర్ 11 (జనంసాక్షి) :** మండలంలోని లెంకలపల్లి గ్రామానికి చెందిన 18 ఏళ్ల మౌనిక ఈ నెల 2న ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటనపై కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్తులు శుక్రవారం ఆందోళనకు దిగారు. బాలిక ఆత్మహత్యకు కారణమైన వారిని వెంటనే అరెస్ట్ చేసి తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ మర్రిగూడ పోలీస్‌స్టేషన్ ఎదుట ధర్నా నిర్వహించారు. బాలిక మృతి ఘటనపై ఇప్పటికే పోలీసులకు ఫిర్యాదు చేసినప్పటికీ నిందితులపై ఇప్పటి వరకు అరెస్ట్ చర్యలు తీసుకోలేదని కుటుంబ సభ్యులు ఆరోపించారు. దీంతో న్యాయం కోసం పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళన చేపట్టాల్సి వచ్చిందని తెలిపారు.

**వేధింపులే కారణమని కుటుంబ సభ్యుల ఆరోపణ :** కుటుంబ సభ్యుల ఆరోపణల మేరకు.. అదే గ్రామానికి చెందిన ఏర్పుల రాకేష్, దామెర శివ బాలికను వేధింపులకు గురిచేసినట్లు తెలిపారు. వారి వేధింపుల కారణంగానే మౌనిక తీవ్ర మనస్తాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడిందని ఆరోపించారు. ఆత్మహత్యకు ముందు బాలిక రాసినట్లు చెబుతున్న సూసైడ్ నోట్ తమ వద్ద ఉన్నట్లు, దానిని పోలీసులకు అందజేసినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆ లేఖలో పేర్కొన్న అంశాలను కూడా పరిగణనలోకి తీసుకుని సమగ్ర విచారణ చేపట్టాలని కోరారు. బాలిక ఆత్మహత్య చేసుకున్న రోజే ఆమె తండ్రి శ్రీనివాస్ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. ఫిర్యాదు చేసి రోజులు గడుస్తున్నా నిందితులపై చర్యలు తీసుకోకపోవడంపై వారు ఆవేదన వ్యక్తం చేశారు.

**అధికార పార్టీ నాయకుడిపై ఆరోపణలు :** బాలిక కుటుంబ సభ్యులు మరో కీలక ఆరోపణ చేశారు. అధికార పార్టీకి చెందిన ఓ నాయకుడు కేసును తప్పుదోవ పట్టించేందుకు ప్రయత్నిస్తున్నారని, నిందితు లకు అండగా ఉంటున్నారని ఆరోపించారు. రాజకీయ ఒత్తిళ్లకు తావు లేకుండా ఘటనపై నిష్పక్షపాతంగా విచారణ జరిపించా లని డిమాండ్ చేశారు. అయితే ఈ ఆరోపణలకు సంబంధించి సదరు నాయకుడి వివరణ వెలువడాల్సి ఉంది. ఆరోపణలు విచారణలో నిర్ధారణ కావాల్సి ఉంది.

**పోలీసుల హామీతో ధర్నా విరమణ :** పోలీస్‌స్టేషన్ ఎదుట కుటుంబ సభ్యులు, గ్రామస్తులు ధర్నాకు దిగడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. ఆందోళనకారులతో మాట్లాడిన పోలీసులు ఘటనపై సమగ్ర విచారణ చేపడతామని తెలిపారు. హామీతో కుటుంబ సభ్యులు, గ్రామస్తులు ధర్నాను విరమించారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబ సభ్యులు, పోలీసుల మధ్య కొద్దిసేపు వాగ్వాదం చోటుచేసుకుంది.

# ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రానికి తాళమేనా?

### పేరుకే వైద్య కేంద్రం.. అత్యవసర వేళల్లో అందని వైద్యం

### తాళం తీయండి.. వైద్య సేవలు అందించండి




**చింతపల్లి, సెప్టెంబర్ 11(జనంసాక్షి) :** చింతపల్లి మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రం నిర్వహణ తీరుపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎప్పుడు చూసినా ఉపకేంద్రానికి తాళం వేసి ఉండటంతో అత్యవసర వైద్యం అవసరమైన సమయంలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వాపోతున్నారు. పేరుకే ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రంగా ఉందే తప్ప.. ప్రజలకు అందుబాటులో ఉండడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.గ్రామంలో ఎవరికైనా అనారోగ్య సమస్యలు తలెత్తినా, ప్రాథమిక వైద్యం అవసరమైనా ఉపకేంద్రానికి వెళ్లే పరిస్థితి లేకుండా పోయిందని గ్రామస్తులు పేర్కొంటున్నారు. ఉపకేంద్రం ఎప్పుడు తెరుస్తారో.. ఎప్పుడు మూస్తారో తెలియని పరిస్థితి నెలకొనడంతో ప్రజలు ఇతర ప్రాంతాల్లోని ఆస్పత్రులను ఆశ్రయించాల్సి వస్తోందని తెలిపారు. ప్రభుత్వం ప్రజలకు వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావాలనే ఉద్దేశంతో ఆరోగ్య ఉపకేంద్రాలను ఏర్పాటు చేసినప్పటికీ, సిబ్బంది అందుబాటులో లేకపోవడం, కేంద్రం తరచూ మూసి ఉండటం వల్ల వాటి లక్ష్యం నీరుగారుతోందని గ్రామస్తులు అంటున్నారు.ప్రజల ఆరోగ్యంతో ముడిపడిన అంశంపై అధికారులు నిర్లక్ష్యం చేయకుండా వెంటనే స్పందించాలని, ఉపకేంద్రం నిర్ణీత సమయాల్లో నిత్యం తెరిచి ఉండేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. వైద్య సిబ్బంది అందుబాటులో ఉండేలా పర్యవేక్షణ పెంచి, ప్రజలకు నిరంతర ప్రాథమిక వైద్య సేవలు అందించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రానికి ఎప్పుడూ తాళం వేసి ఉంచడం సరికాదు. రోజూ సిబ్బంది వచ్చి వైద్య సేవలు అందించాలి. పేద ప్రజలకు అందుబాటులో వైద్యం ఉండేలా చూడాలి. వెంటనే ఉన్నతాధికారులు స్పందించి, కేంద్రాన్ని క్రమం తప్పకుండా తెరిచేలా చర్యలు తీసుకోవాలి" అని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు నల్ల ఆంజనేయులు అన్నారు.

# జపాన్ వేదికపై సత్తాచాటిన తెలుగు టీచర్

### రాజశేఖర్‌కు అంతర్జాతీయ ప్రశంసా పత్రం



**గరిడేపల్లి, సెప్టెంబర్ 11 (జనంసాక్షి):** తెలంగాణ పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో జపాన్‌లో నిర్వహించిన అంతర్జాతీయ విద్యా అధ్యయన పర్యటనలో సూర్యాపేట జిల్లాకు చెందిన ప్రముఖ ఉపాధ్యాయుడు వ్యక్తిత్వ వికాస నిపుణుడు చారుగుండ్ల రాజశేఖర్ అంతర్జాతీయ స్థాయిలో ప్రశంసలు అందుకున్నారు.పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ డాక్టర్ ఇ. నవీన్ నికోలస్ నేతృత్వంలో సెప్టెంబర్ 5 నుండి 12 వరకు జరిగిన ఈ పర్యటనలో రాష్ట్రం నుండి 29 మంది ఉపాధ్యాయులు విద్యా నిపుణులు పాల్గొన్నారు. బృందం జపాన్ లోని ప్రముఖ విద్యా సంస్థలను సందర్శించి అక్కడి ఆధునిక విద్యా విధానం రోబోటిక్స్, సాంకేతిక విద్య, ఉపాధ్యాయ నైపుణ్యాభివృద్ధి, ప్రత్యేక అవసరాలు గల పిల్లల విద్యా విధానాలను క్షుణ్ణంగా అధ్యయనం చేసింది.ఈ సందర్భంగా అంతర్జాతీయ వేదికపై చారుగుండ్ల రాజశేఖర్ సమర్పించిన రీసెర్చ్ పేపర్ ప్రజెంటేషన్ అందరినీ ఆకట్టుకుంది. ఆయన ప్రతిభను గుర్తించిన జపాన్ అంతర్జాతీయ విద్యాశాఖ సంచాలకులు డాక్టర్ ఆఖావో ప్రత్యేక ప్రశంసా పత్రాన్ని అందజేసి అభినందించారు. అంతర్జాతీయ వేదికపై తెలుగు ఉపాధ్యాయుడికి దక్కిన ఈ గౌరవం పట్ల పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ డాక్టర్ నవీన్ నికోలస్, స్వర్ణభారతి చారిటబుల్ ట్రస్ట్, విజయీభవ ట్రస్ట్ ప్రతినిధులు, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు డాక్టర్ నీలా సత్యనారాయణ, చారుగుండ్ల ప్రవీణ రాజశేఖర్, కందిబండ వెంకటేశ్వరరావు, పైడిమర్రి నారాయణరావు, పైడిమర్రి సత్యబాబు, అవోపా జిల్లా అధ్యక్షులు ఇమ్మడి రమేష్, మండల విద్యాధికారి చత్రు నాయక్, పలువురు ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.




## యాపిల్ రేట్ల దెబ్బకు.. ఐఫోన్ల విక్రయాలు తగ్గొచ్చు..!

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**యాపిల్ తన కొత్త మోడల్ 'ఐఫోన్ 18'ను విడుదల చేసిన వెంటనే భారత్‌లో పాత ఐఫోన్ల ధరలు భారీగా పెంచేసింది. మరోవైపు, కొత్తగా విడుదల చేసిన ఫోల్డబుల్ ఫోన్‌తో పాటు ఐఫోన్ 18 శ్రేణి ధరలు కూడా విపరీతంగా ఉన్నాయి. దీనిపై ఇప్పటికే నెట్టింట సెటైర్లు పేలుతున్నాయి. అయితే, ఈ ధరల ప్రభావం దేశీయంగా ఐఫోన్ విక్రయాలపై ప్రతికూల ప్రభావం చూపొచ్చని మార్కెట్ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. 2026 క్యాలెండర్ సంవత్సరంలో భారత్‌లో ఐఫోన్ విక్రయాలు కాస్త తగ్గే అవకాశం ఉందని మార్కెట్ రీసెర్చర్స్ ఐడీసీ ఇండియా, కౌంటర్‌పాయింట్ అంచనా వేశాయి. దేశీయంగా ఈ విక్రయాల్లో తొలిసారి క్షీణత నమోదవ్వొచ్చని పేర్కొన్నాయి. అయితే, అమ్మకాల విలువ పరంగా చూస్తే మాత్రం.. 6-7శాతం వృద్ధి ఉండొచ్చని అంచనా వేశాయి. మరోవైపు, ఐఫోన్ల ధరల పెంపు వల్ల గ్రే మార్కెట్ విక్రయాలు, వ్యక్తిగత దిగుమతులు పెరిగే అవకాశం ఉందని ఆల్ ఇండియా మొబైల్ రిటైలర్స్ అసోసియేషన్ ఆందోళన వ్యక్తం చేసింది. దీనివల్ల రిటైల్ మార్కెట్ దెబ్బతిని, వ్యాపారులు నష్టపోయే ప్రమాదం ఉందని పేర్కొంది.

ఐఫోన్ పాత మోడళ్ల ధరలు పెరిగాయ్

యాపిల్ కొత్తగా విడుదల చేసిన ఐఫోన్ 18 శ్రేణి ధర రూ.1,64,900 నుంచి మొదలైన సంగతి తెలిసిందే. మడతపెట్టే ఐఫోన్ డ్యూయో ప్రారంభ ధర రూ.2,99,900గా ఉంది. ఇక, ఐఫోన్ 17, ఐఫోన్ ఎయిర్, ఐఫోన్ 16 ధరలను కూడా యాపిల్ భారీగా పెంచేసింది. ఇతర దేశాల మార్కెట్లతో పోలిస్తే భారత్‌లో వీటి ధరలు దాదాపు 10-15శాతం అధికంగా ఉండటం గమనార్హం.

## ఈవీ అమ్మకాల జోరు..

### 2.98 లక్షల యూనిట్లు విక్రయం

**న్యూఢిల్లీ(జనంసాక్షి)**దేశంలో ఎలక్ట్రిక్ వాహన విక్రయాల జోరు పెరిగింది ఆగస్టులో మొత్తం 2.98 లక్షల ఈవీలు అమ్ముడయ్యాయి. గతేడాదితో పోలిస్తే 52.9 శాతం వృద్ధి నమోదు చేశాయి. మొత్తంగా మార్కెట్ వాటా 9.5 శాతం నుంచి 12.3 శాతానికి పెరిగిందని ఫెడరేషన్ ఆఫ్ ఆటోమొబైల్ డీలర్స్ అసోసియేషన్ (ఫాడా) వెల్లడించింది. ఎలక్ట్రిక్ టూవీలర్ సెగ్మెంట్‌లో 1,83,204 వాహనాలు విక్రయమయ్యాయి. గతేడాది నమోదైన 1,09,673 యూనిట్లతో పోలిస్తే 67.05 శాతం పెరిగాయి. కానీ జులైతో పోలిస్తే 10.37 శాతం తగ్గుముఖం పట్టాయి.ఎలక్ట్రిక్ ప్యాసింజర్ రిటైయిల్ వాహనాలు గతేడాదితో పోలిస్తే 51.89 శాతం వృద్ధితో 30,696 యూనిట్లు సేల్ అయ్యాయి. జులైతో పోలిస్తే 6.78 శాతం తగ్గాయి.త్రీ వీలర్ సెగ్మెంట్‌లో రిటైల్ విక్రయాలు 79,846 యూనిట్లకు చేరాయి. గతేడాదితో పోలిస్తే 25.28శాతం వృద్ధి చెందగా, జులైతో పోలిస్తే 8.28 శాతం తక్కువ. ఎలక్ట్రిక్ కమర్షియల్ వాహనాల రిటైల్ విక్రయాలు దాదాపు మూడింతలు అయ్యాయి. గతేడాదితో పోలిస్తే 188.3 శాతం వృద్ధితో 4,702 యూనిట్లు అమ్ముడయ్యాయి. జులైతో పోలిస్తే 32.23 శాతం పెరుగుదల సాధించింది.

# కోలుకున్నా తప్పని నష్టాలు

ముంబయి: దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు నష్టాలతో ముగిశాయి. ఉదయం భారీ నష్టాల్లో ప్రారంభమైన సూచీలు.. కనిష్ఠాల వద్ద కొనుగోళ్ల మద్దతుతో కోలుకున్నాయి. ముఖ్యంగా ఐటీ, ఎఫ్ఎంసీజీ, బ్యాంక్ స్టాక్స్‌లో కొనుగోళ్ల మద్దతుతో భారీగా రికవరీ అయ్యాయి. సెన్సెక్స్ దాదాపు 620 పాయింట్లు మేర కోలుకుంది. మళ్లీ ఆఖర్లో స్వల్ప నష్టాల్లోకి జారుకున్నాయి. ఆసియా మార్కెట్‌లు దాదాపు నష్టాల్లోనే ముగిశాయి.అంతర్జాతీయ మార్కెట్‌ల నుంచి ప్రతికూల సంకేతాలతో సెన్సెక్స్ ఉదయం 74,309.16 (క్రితం ముగింపు 74,902.59) వద్ద భారీ నష్టాల్లో ప్రారంభమైంది. ఇంట్రాడేలో 74,160.16 వద్ద కనిష్ఠాన్ని తాకింది. కనిష్ఠాల వద్ద కొనుగోళ్ల మద్దతుతో మధ్యాహ్నం తర్వాత సూచీ నష్టాలను భర్తీ చేసింది. చివరికి 120.83 పాయింట్ల నష్టంతో 74,781.76 వద్ద స్థిరపడింది. నిఫ్టీ సైతం 79.70 పాయింట్ల నష్టంతో 23,398 వద్ద ముగిసింది. డాలరుతో రూపాయి మారకం విలువ 95.57గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో టాటా స్టీల్, రిలయన్స్, సన్‌ఫార్మా, బజాజ్ ఫైనాన్స్, ఎన్టీపీసీ షేర్లు నష్టపోయాయి. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, టెక్ మహీంద్రా, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, ఎటర్నల్, ఇన్ఫోసిస్ షేర్లు లాభపడ్డాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 103 డాలర్ల వద్ద ట్రేడవుతుండగా.. బంగారం ఔన్సు 4347 డాలర్ల వద్ద కొనసాగుతోంది.

**ఎఫ్ఐఐ విక్రయాలు: రూ.438.24 కోట్లు**

స్టాక్ మార్కెట్‌లో జాగ్రత్త ధోరణి ఉన్నప్పటికీ.. గురువారం ట్రేడింగ్ చివరిలో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్ వంటి షేర్లలో కొనుగోళ్లు జరగడంతో మూడు రోజుల వరుస నష్టాలకు విరామం లభించింది. ఫలితంగా ప్రధాన సూచీలు సెన్సెక్స్, నిఫ్టీ స్వల్ప లాభాల్లో ముగిశాయి. అయితే బ్రెంట్ ముడి చమురు బ్యారెల్ ధర 4.06% పెరిగి 105..32 డాలర్ల వద్ద ట్రేడవుతుండటంతో, మదుపర్లు ఆచితూచి వ్యవహరించారు. డాలరుతో పోలిస్తే రూపాయి మారకపు విలువ 38 పైసలు తగ్గి 95.46 వద్ద ముగిసింది. ఆసియా మార్కెట్లలో దక్షిణ కొరియా, షాంఘై, హాంకాంగ్ సూచీలు నష్టపోయాయి. జపాన్ సూచీ లాభపడింది. ఐరోపా మార్కెట్లు మిశ్రమ ధోరణిలో కదలాడాయి. సూచీలు స్వల్పంగా లాభపడినా, బీఎస్ఈలోని నమోదిత కంపెనీల మార్కెట్ విలువ రూ.48,000 కోట్లు తగ్గి రూ.483.72 లక్షల కోట్ల (5.08 లక్షల కోట్ల డాలర్ల)కు పరిమితమైంది. సెన్సెక్స్ ఉదయం 74,742.54 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 74,764.23 పాయింట్లు) ప్రతికూలంగా ప్రారంభమైంది. రోజంతా స్తబ్దుగా కదలాడిన సూచీ 74,910.96 పాయింట్ల వద్ద గరిష్ఠాన్ని, 74,598.47 పాయింట్ల వద్ద కనిష్ఠాన్ని నమోదు చేసింది. చివరకు 138.36 పాయింట్లు లాభపడి 74,902.59 పాయింట్ల వద్ద స్థిరపడింది. నిఫ్టీ 50 సూచీ 46.30 పాయింట్లు పెరిగి 23,477.80 పాయింట్ల వద్ద ముగిసింది. ఇంట్రాడేలో ఈ సూచీ 23,494.95-23,380.10 పాయింట్ల మధ్య కదలాడింది. సెన్సెక్స్ 30 షేర్లలో 15 లాభపడ్డాయి. పవర్‌గ్రిడ్ 2.27%, యాక్సిస్ బ్యాంక్ 1.65%, అల్ట్రాటెక్ సిమెంట్ 1.44%, ఎన్టీపీసీ 1.13%, టెక్ మహీంద్రా 1.09%, భారతీ ఎయిర్‌టెల్ 1%, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ 0.98%, ఎల్ అండ్ టీ 0.76%, కోటక్ బ్యాంక్ 0.62% పెరిగాయి. హెచ్‌సీఎల్ టెక్ 2.43%, టాటా స్టీల్ 1.38%, ట్రెంట్ 1.12%, ఐటీసీ 0.84%, అదానీ పోర్ట్స్ 0.79%, బీఈఎల్ 0.79%, మారుతీ సుజుకీ 0.78% తగ్గాయి. కీలక రేట్లు పెంచిన ఐరోపా: ద్రవ్యోల్బణాన్ని అదుపులో పెట్టడం కోసం యూరోపియన్ సెంట్రల్ బ్యాంక్(ఈసీబీ) కీలక రేట్లను 0.25% పెంచి 2.5 శాతానికి చేర్చింది.




వొడాఫోన్ ఐడియాకు ఎస్‌బీఐ నేతృత్వంలోని బ్యాంకుల బృందం 3.5 బి.డా. (రూ.33,250 కోట్ల) రుణం ఇచ్చేందుకు అంగీకరించినట్లు సమాచారం.సోనాసెలక్షన్ ఇండియా ఐపీఓ ధరల శ్రేణి రూ.94-99 టెక్స్‌టైల్ కంపెనీ సోనాసెలక్షన్ ఇండియా లిమిటెడ్, రూ.141.6 కోట్ల ఐపీఓకు ధరల శ్రేణిని రూ.94-99గా నిర్ణయించింది. ఇష్యూ ఈ నెల 17న ప్రారంభమై 21న ముగుస్తుంది. 1.43 కోట్ల ఈక్విటీ షేర్లను తాజాగా జారీ చేస్తున్నారు.

**హీరో మోటార్స్ ఐపీఓ ధరల శ్రేణి రూ.79-84**

వాహన విడిభాగాల తయారీ సంస్థ హీరో మోటార్స్ లిమిటెడ్ ఐపీఓ ఈ నెల 16-18 తేదీల్లో రాబోతోంది. ధరల శ్రేణి రూ.79-84. తాజా షేర్ల జారీ ద్వారా రూ.600 కోట్లు, ఓఎఫ్ఎస్‌లో రూ.400 కోట్లు సమీకరించబోతోంది.

**కనోహర్ ఎలక్ట్రికల్స్ ఐపీఓకు 90 రెట్ల స్పందన**

కనోహర్ ఎలక్ట్రికల్స్ ఐపీఓ ముగిసేసరికి 90.59 రెట్ల అధిక స్పందన లభించింది. గ్లాస్ వాల్ సిస్టమ్స్ ఐపీఓకు 81.65 రెట్ల స్పందన దక్కింది. ప్రసోల్ కెమికల్స్ ఐపీఓకు చివరి రోజుకు 3.30 రెట్ల స్పందన లభించింది. వీగాల్యాండ్ ఐపీఓకు తొలి రోజున 62% స్పందన దక్కింది. ఇష్యూ ధరల శ్రేణి రూ.130-140. ఈ నెల 15న ఇష్యూ ముగియనుంది. ఎల్‌సీసీ ప్రాజెక్ట్స్ ఐపీఓకు రెండో రోజుకు 3.84 రెట్ల స్పందన వచ్చింది. ధరల శ్రేణి రూ.139-146. కరమ్తారా ఇంజినీరింగ్ ఐపీఓ రెండో రోజుకు 3.61 రెట్ల స్పందన దక్కింది. ధరల శ్రేణి రూ.241-254. అసెట్ రీకన్‌స్ట్రక్షన్ కంపెనీ ఐపీఓ రెండో రోజుకు 87% బిడ్లు దాఖలయ్యాయి. ధరల శ్రేణి రూ.132-139. స్టీమ్‌హౌస్ ఐపీఓ రెండో రోజుకు 2.21 రెట్ల స్పందన లభించింది. ధరల శ్రేణి రూ.77-81. రెంటోమోజో ఐపీఓకు 4.70 రెట్ల స్పందన దక్కింది. ధరల శ్రేణి రూ.384-404.

**గుడ్ల ధరలు**

| హైదరాబాద్ | వరంగల్ |
|---|---|
| ₹ 5.40 | ₹ 5.42 |

**బంగారం ధరలు (10 గ్రాములు)**

హైదరాబాద్

| ₹ 1,64,446 | ₹ 1,79,396 |
|---|---|
| (22 క్యారెట్లు) | (24 క్యారెట్లు) |


**వెండి ధరలు (కేజీ)**

హైదరాబాద్

₹ 2,55,000

## హూతీల దాడులతో 108 డాలర్లకు చమురు..

దేశీయ మార్కెట్లు శుక్రవారం నష్టాల్లో ప్రారంభమయ్యాయి. పశ్చిమాసియా ఉద్రిక్తతలు తీవ్రరూపం దాల్చడంతో చమురు మంటలు భగ్గుమంటున్నాయి. సౌదీ అరేబియా-హూతీ తిరుగుబాటుదారుల మధ్య ఘర్షణలు రోజురోజుకూ తీవ్రమవు తున్నాయి. ఈ నేపథ్యంలో సూచీలు నష్టాల్లో ట్రేడవుతున్నాయి. ప్రారంభంలో సెన్సెక్స్ 700 పాయింట్ల వరకు కుంగింది.ఉదయం 9.30 గంటల సమయంలో సెన్సెక్స్ 622 పాయింట్లు కోల్పోయి.. 74,268 వద్ద కదలాడుతోంది. నిఫ్టీ 221 పాయింట్లు కుంగి.. 23,256 వద్ద ట్రేడవుతోంది (ాబినీఇాని ఓజీతీనివబి). డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ 95.79గా ఉంది. నిఫ్టీ సూచీలో ఓఎన్‌జీసీ, టెక్ మహీంద్రా, టీసీఎస్, భారతీ ఎయిర్‌టెల్ షేర్లు లాభాల్లో ఉన్నాయి.



హిందాల్కో, టాటా స్టీల్, బజాజ్ ఫైనాన్స్, జేఎస్‌డబ్ల్యూ స్టీల్, శ్రీరామ్ ఫైనాన్స్ స్టాక్స్ నష్టపోతున్నాయి.

**4నెలల గరిష్ఠానికి ముడిచమురు..**

ఇటు ఇరాన్-అమెరికా ఘర్షణలు ముగియకముందే.. సౌదీ-హూతీ రెబెల్స్ మధ్య పోరు తీవ్రరూపం దాల్చడం చమురు మార్కెట్లపై ప్రభావం చూపిస్తోంది. బ్రెంట్ క్రూడ్ ధర ఒక బ్యారెల్‌కు 108.77 డాలర్లకు పెరిగింది. ఇది నాలుగునెలల గరిష్ఠస్థాయి కావడంతో భారత ఆర్థిక వ్యవస్థపై ఎలాంటి ప్రభావం ఉంటుందోననే ఆందోళన వ్యక్తమవుతోంది. వారం రోజుల వ్యవధిలో బ్రెంట్ క్రూడ్ 12 శాతానికి పైగా ఎగబాకింది. గురువారం సాయంత్రం అమెరికా మార్కెట్లు నష్టాల్లో ముగియగా.. ఆసియా మార్కెట్లు అదేబాటలో కొనసాగుతున్నాయి.

# ఇ-కామర్స్ కొనుగోళ్లకు భరోసా

**ధరలు తారుమారు చేయడం.. మోసాలు.. నకిలీ రాయితీలకు కళ్లెం**

**నిబంధనలు కఠినతరం చేసిన కేంద్రం**

**2027 జనవరి 1 నుంచి అమల్లోకి**

న్యూఢిల్లీ:ఇ-కామర్స్ ప్లాట్‌ఫామ్‌ల్లో కొనుగోళ్లకు మరింత భరోసా ఇచ్చేందుకు, వినియోగదారులను తప్పుదోవ పట్టించే మోసపూరిత పద్ధతులకు అడ్డుకట్ట వేసేందుకు కేంద్ర వినియోగదారుల వ్యవహారాల శాఖ రంగంలోకి దిగింది. కన్జూమర్ ప్రొటెక్షన్ (ఇ-కామర్స్) నిబంధనలు, 2020ను సవరిస్తూ.. కన్జూమర్ ప్రొటెక్షన్ (ఇ-కామర్స్) సవరణ నిబంధనలు-2026ను గురువారం నోటిఫై చేసింది. ఈ నిబంధనలు 2027 జనవరి 1 నుంచి అమల్లోకి వస్తాయి. వీటి ప్రకారం ఇకపై ఏదైనా వస్తువుపై రాయితీ ఇస్తున్నామని ఇ-కామర్స్ ప్లాట్‌ఫామ్‌లో ప్రకటించినప్పుడు.. తగ్గించిన ధరతో పాటు, అంతకు ముందు ఉన్న అసలు ధరను కూడా స్పష్టంగా చూపించాలి. రాయితీ ప్రకటించడానికి ముందు గత 30 రోజుల్లో ఆ వస్తువు అమ్ముడైన అత్యల్ప ధరనే 'ప్రయర్ ప్రైస్'గా పరిగణించాలి. కృత్రిమంగా గరిష్ఠ విక్రయ ధర (ఎంఆర్‌పీ) పెంచి.. ఆయా సందర్భాల్లో భారీ రాయితీ ఇస్తున్నట్లు భ్రమ కల్పించే మోసాలకు ఇది అడ్డుకట్ట వేయనుంది. వినియోగదారులు వెతికే క్వెరీలకు సంబంధం లేకుండా, సెర్చ్ ఫలితాలను తారుమారు చేసి తప్పుదోవ పట్టించడాన్ని నిషేధించారు. ప్రకటనల ద్వారా చూపించే స్పాన్సర్డ్ లిస్టింగ్స్ ఏవో వినియోగదారుడికి స్పష్టంగా కనిపించేలా ప్రత్యేక లేబుల్స్ వేయాలి.ప్రతి ఇ-కామర్స్ సంస్థ తప్పనిసరిగా 'నేషనల్ కన్జూమర్ హెల్ప్‌లైన్' (ఎన్‌సీహెచ్) వ్యవస్థతో అనుసంధానం కావాలి. 2025లో ఎన్‌సీహెచ్‌కు వచ్చిన మొత్తం 17.71 లక్షల ఫిర్యాదుల్లో, దాదాపు 29% (5.11 లక్షలు) ఇ-కామర్స్ రంగానికి సంబంధించినవే ఉన్నాయి. వినియోగదారుడు ఫిర్యాదు చేసినప్పుడు, గ్రీవెన్స్ అధికారి వద్ద నమోదైన రికార్డు కాపీని తప్పనిసరిగా ఫిర్యాదుదారునికి అందించాలి.కొనుగోలుదారులకు తెలియకుండానే బుట్టలో పడేసే డార్క్ ప్యాటర్న్స్ (హిడెన్ ఛార్జీలు, బలవంతపు సబ్‌స్క్రిప్షన్‌లు వంటివి) అంశాల్లో నియంత్రణ మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలి. ప్రతి ఇ-కామర్స్ సంస్థ ఏటా స్వీయ ఆడిట్ నిర్వహించి, తాము నిబంధనలు పాటిస్తున్నట్లు సర్టిఫికెట్‌ను వెబ్‌సైట్‌లో ప్రదర్శించాలి.

ఉత్పత్తి వివరాలను వెల్లడించాల్సిందే: ఆయా వస్తువులకు సంబంధించి ఎక్స్‌పైరీ లేదా బెస్ట్ బిఫోర్ తేదీలు, రిటర్న్‌లు, రిఫండ్‌లు, వారంటీ, డెలివరీ ఛార్జీల వివరాలను కొనుగోలుకు ముందే స్పష్టంగా వెల్లడించాలి. దిగుమతి చేసుకున్న వస్తువులపై కంట్రీ ఆఫ్ ఆరిజన్ (ఏ దేశంలో తయారైంది), దిగుమతిదారు వివరాలు ఉండాలి. వినియోగదారుడి అనుమతి లేకుండా వ్యక్తిగత డేటాను ఇతర అవసరాలకు వాడకూడదు. అదే విధంగా ప్లాట్‌ఫామ్‌తో సంబంధం లేని సేవల కోసం అదనపు బండిల్డ్ ఫీజులు వసూలు చేయకూడదు.



## ఎన్ఎస్ఈ ఐపీఓ తేదీలొచ్చాయ్..

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**మదుపర్లు ఆసక్తిగా ఎదురుచూస్తోన్న నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజీ పబ్లిక్ ఇష్యూ తేదీలు వచ్చేశాయి. సెప్టెంబరు 17న ఈ ఐపీఓ సబ్‌స్క్రిప్షన్ ప్రారంభం కానుంది. ఎన్ఎస్ఈ షేరు ధరల శ్రేణిని రూ.1700-రూ.1785గా నిర్ణయించారు. ఒక్కో షేరు ముఖ విలువను రూ.1గా పేర్కొన్నారు. ఒక లాట్ పరిమాణంలో ఎనిమిది షేర్లు ఉంటాయి. అంటే.. రిటైల్ ఇన్వెస్టర్లు ఒక లాట్ కోసం రూ.14,280 పెట్టుబడి పెట్టాల్సి ఉంటుంది.

**ఐపీఓ తేదీలు ఇలా..**

సబ్‌స్క్రిప్షన్ ప్రారంభ తేదీ : సెప్టెంబరు 17,ముగింపు తేదీ: సెప్టెంబరు 21,షేర్ల కేటాయింపు: సెప్టెంబరు 22,డీమ్యాట్ ఖాతాల్లో షేర్ల క్రెడిట్: సెప్టెంబరు 23,లిస్టింగ్ తేదీ: సెప్టెంబరు 24,సిప్.. రెండేళ్లు చూసి ఆపేయొద్దు,షేరు ధర అప్పర్ బ్యాండ్ వద్ద ఎన్ఎస్ఈ ఐపీఓ (ఔాఇ ఎఖూ) విలువ రూ.22,561.57కోట్లుగా ఉండనుంది. దీంతో దేశంలో రెండో అతిపెద్ద ఐపీఓగా రికార్డు సృష్టించనుంది. మొత్తం షేర్లలో 35శాతం రిటైల్ ఇన్వెస్టర్లకు కేటాయించారు. 50శాతం క్వాలిఫైడ్ ఇన్‌స్టిట్యూషనల్ బిడ్డర్లకు రిజర్వ్ చేశారు. మిగతా షేర్లను నాన్-ఇన్‌స్టిట్యూషనల్ ఇన్వెస్టర్లకు అందుబాటులో ఉంచనున్నారు.

## ద్వైపాక్షిక అంశాలపై మోదీ పుతిన్ భేటి

సాయం చేసేందుకు భారత్ సిద్ధంగా ఉందని పేర్కొన్నట్లు భారత విదేశాంగ శాఖ ఓ ప్రకటనలో తెలిపింది.భౌగోళిక రాజకీయ అనిశ్చితుల నేపథ్యంలోనూ రెండు దేశాలు గణనీయమైన వృద్ధిని నమోదు చేస్తూ స్థిరత్వాన్ని చూపుతున్నాయని ఇద్దరు నేతలు అభిప్రాయపడ్డారు. ఇరుదేశాల మధ్య ప్రత్యేకాధికార వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయడానికి కృషి చేసేందుకు మోదీ, పుతిన్‌లు అంగీకరించారు. భారత్-రష్యా 24వ వార్షిక సదస్సు కోసం మాస్కోకు రావాలని పుతిన్ ఆహ్వానించగా.. ఇందుకు మోదీ అంగీకరించారు. ఇందుకు సంబంధించిన తేదీలను త్వరలో ఖరారు చేయనున్నారు. ఇదిలాఉంటే, ద్వైపాక్షిక భేటీ అనంతరం భారత్ మండపం కాంప్లెక్స్‌లోనే ఏర్పాటు చేసిన బిజినెస్ ఫోరమ్ సమావేశానికి ఇరువురు నేతలు ఒకే కారులో వెళ్లారు.

**ఐటీ, ఏఐ రంగాల్లో భారత్ దూసుకెళ్తోంది - పుతిన్**

ప్రపంచంలో బ్రిక్స్ కూటమికి ప్రాధాన్యత పెరుగుతోందని, ప్రపంచ జీడీపీలో 40శాతం బ్రిక్స్ దేశాల నుంచే వస్తోందని రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ అన్నారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో సగానికిపైగా ఈ దేశాలదేనని తెలిపారు. ఈ కూటమి ప్రపంచానికి దారి చూపిస్తోందని చెప్పారు. దిల్లీలో జరిగిన బ్రిక్స్ బిజినెస్ ఫోరమ్‌లో ప్రసంగించిన పుతిన్.. ఐటీ, ఏఐ రంగాల్లో భారత్ దూసుకెళ్తోందని అన్నారు.బ్రిక్స్ దేశాల్లో పట్టణీకరణ వేగంగా సాగుతోందని, ఇది ప్రపంచ ఆర్థిక రంగానికి ఊతమిస్తోందని పుతిన్ పేర్కొన్నారు. ఐటీ, ఏఐ రంగాల్లో భారత్ దూసుకెళ్తుండగా.. టెక్నాలజీ దిగ్గజాలుగా చైనా కంపెనీలు గుర్తింపు పొందుతున్నాయని అన్నారు. మరోవైపు ఏరోస్పేస్ రంగాల్లో బ్రెజిల్ సత్తా చాటుతోందని తెలిపారు. ఇలా బ్రిక్స్ కూటమి దేశాల నుంచి విజయగాథలు వెలుగులోకి వస్తున్నాయని, పశ్చిమ దేశాలతో ఇవి పోటీ పడుతున్నాయని అన్నారు. ఇదే సమయంలో ఇరాన్‌పై బహుముఖంగా దాడి జరుగుతోందన్న ఆయన.. అంతర్జాతీయ రవాణాకు ఆటంకం కలిగించడమే కాకుండా ఆ దేశంపై అక్రమంగా ఆంక్షలు కూడా విధిస్తున్నారంటూ మండిపడ్డారు.

**అస్థిర పరిస్థితుల్లోనూ సుస్థిరంగా భారత్.. : మోదీ**

2006లో నాలుగు దేశాలతో బ్రిక్స్ ప్రస్థానం మొదలైందని.. ఇప్పుడు 21దేశాలకు విస్తరించిందని ప్రధాని మోదీ పేర్కొన్నారు. ప్రపంచ జనాభాలో సగం ఈ దేశాల్లోనే ఉందని, ప్రపంచ వాణిజ్యంలో వీటి వాటా 25శాతం అని అన్నారు. బిజినెస్ ఫోరమ్‌లో ప్రసంగించిన ఆయన.. నూతన ఆవిష్కరణలు, సహకారం, సుస్థిరాభివృద్ధికి ఈ దేశాలు ఆలంబనగా నిలుస్తున్నాయన్నారు. ఈ క్రమంలో అభివృద్ధి, సుస్థిరతకు భారత్ చిరునామాగా మారిందని ప్రధాని మోదీ పేర్కొన్నారు. రోడ్లు, రైళ్లు, విమానాశ్రయాల వంటి మౌలిక సదుపాయాల కల్పనలో భారత్ వేగంగా ముందడుగు వేస్తోందని, సెమీకండక్టర్లు, క్వాంటమ్, నౌకా నిర్మాణం, బయోటెక్నాలజీ రంగాల్లో కొత్త పుంతలు తొక్కుతోందన్నారు. అస్థిర పరిస్థితుల్లోనూ సుస్థిర అభివృద్ధిని సాధిస్తూ భారత్ ముందుకెళ్తోందని చెప్పారు. ప్రపంచం ఎదుర్కొంటున్న సమస్యలకు భారత్ పరిష్కారం చూపిస్తోందన్న మోదీ.. తమ స్టార్టప్‌లు ప్రపంచానికి ఆదర్శనీయమని ఉద్ఘాటించారు.

**పుతిన్‌కు కానుకగా 'తిరుక్కురళ్'..**

బ్రిక్స్ కూటమి శిఖరాగ్ర సదస్సు కోసం భారత్‌కు విచ్చేసిన రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో ప్రధాని మోదీ భేటీ అయ్యారు. భారత్ మండపానికి చేరుకున్న పుతిన్‌కు స్వాగతం పలికిన మోదీ.. ఓ పుస్తకాన్ని కానుకగా అందించారు. అదే ప్రముఖ కవి తిరువళ్లూర్ రచనా గ్రంథం తిరుక్కురళ్ రష్యన్ భాషలోకి అనువదించిన ప్రతిని పుతిన్‌కు మోదీ అందజేశారు.ప్రాచీన తమిళ సాహిత్యంలో అత్యంత ప్రసిద్ధి చెందిన రచనలలో తిరుక్కురళ్ ఒకటి. ఇందులో నైతికత, ప్రేమ, మంచితనం, సుపరిపాలన, సంపద, మనిషి ప్రవర్తన వంటి అనేక రకాల అంశాలతో కూడిన 1330 ద్విపదలు ఉన్నాయి. దీనిని మొత్తం 133 అధ్యాయాలుగా విభజించగా.. ఒక్కోదాంట్లో పది ద్విపదలు ఉన్నాయి. ఓ వ్యక్తి ప్రవర్తన ఎలా ఉండాలి? ఇతరులతో ఎలా వ్యవహరించాలి? అనే విషయాలు మొదలుకొని.. జీవితం, మరణం, వాటిమధ్య ఇమిడి ఉన్న అనేక విషయాలను ఇందులో ప్రస్తావించారు.మొత్తంగా మానవ అస్తిత్వానికి సంబంధించిన ప్రశ్నలను లేవనెత్తుతూ నీతి వాక్యాలు రాశారు. కేవలం ఇవే కాకుండా పాలకులు, న్యాయం, వ్యవసాయం, పన్నులు, ప్రభుత్వాల గురించి పేర్కొన్నారు

## ఆగస్టులో ఈక్విటీ ఎంఎఫ్‌ల్లోకి రూ.29,329 కోట్లు

**ఇది 4 నెలల గరిష్ఠ స్థాయి**

**దిల్లీ:** ఈక్విటీ మ్యూచువల్ ఫండ్ పథకాల్లోకి గత నెలలో రూ.29,329 కోట్ల పెట్టుబడులు వచ్చాయి. 4 నెలల గరిష్ఠ స్థాయి ఇది. జులైలో ఈక్విటీ ఎంఎఫ్‌ల్లోకి వచ్చిన రూ.24,697 కోట్ల కంటే ఇవి సుమారు 19% ఎక్కువ. మార్కెట్‌లో ఒడుదొడుకులున్నా, మిడ్-క్యాప్, స్మాల్-క్యాప్ ఎంఎఫ్‌ల్లో పెట్టుబడులు పెట్టేందుకు మదుపర్లు ఆసక్తి ప్రదర్శించడమే ఇందుకు కారణమని మ్యూచువల్ ఫండ్ల సంఘం యాంఫీ గురువారం వెల్లడించింది. స్మాల్‌క్యాప్ ఫండ్‌ల్లోకి రూ.7,973 కోట్లు, మిడ్‌క్యాప్ ఫండ్‌ల్లోకి రూ.6,989 కోట్లు, ఫ్లెక్సీక్యాప్ ఫండ్‌ల్లోకి రూ.5,059 కోట్లు వస్తే, లార్జ్‌క్యాప్ ఫండ్‌ల నుంచి రూ.1,147 కోట్లు నికరంగా తరలిపోయాయి.రికార్డు స్థాయికి 'సిప్'ల వాటా: క్రమానుగత పెట్టుబడి పథకాల్లోకి (సిప్‌లు) నెలవారీ పెట్టుబడులు ఆగస్టులో రికార్డు స్థాయిలో రూ.32,297 కోట్లకు చేరాయి. జులైలో ఇవి రూ.31,961 కోట్లుగా ఉన్నాయి. 2025 ఆగస్టులో వచ్చిన రూ.28,265 కోట్ల కంటే గత నెలలో వచ్చిన నిధులు 14% ఎక్కువ. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి 5 నెలల్లో సిప్ పథకాల్లోకి వచ్చిన పెట్టుబడులు రూ.1.6 లక్షల కోట్లకు చేరాయి. నికర పెట్టుబడులు బాగా తగ్గాయ్: మ్యూచువల్ ఫండ్ పరిశ్రమలోకి గత నెలలో నికరంగా వచ్చిన మొత్తం పెట్టుబడులు రూ.41,353 కోట్లే. జులైలో వచ్చిన రూ.2.36 లక్షల కోట్ల కంటే ఇవి చాలా తక్కువ. డెట్ పథకాల్లోకి నిధులు తగ్గడమే ఇందుకు కారణం. డెట్ పథకాల్లోంచి రూ.8,127 కోట్లు ఉపసంహరించడమే ఇందుకు కారణం. జులైలో వీటిల్లోకి ఏకంగా రూ.1.88 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయి.

## ఆర్మీ ఆయుధాలు ఎత్తుకెళ్లింది ఇంటి దొంగే..

ఫోన్ కాల్ లిస్ట్, వాట్సప్ చాటింగ్‌లు డిలీట్ అయ్యాయి. ఆ తర్వాత మల్లేశ్‌ను ప్రశ్నిస్తున్నప్పుడు ఆయన ముఖంలో చెమటలు పట్టి భయం కనిపించింది. కేసు తీవ్రతను ఆయన భార్యకు వివరించాం. ఆమె గట్టిగా ప్రశ్నించడంతో మల్లేశ్ నిజం అంగీకరించాడు. చోరీ చేసిన ఆయుధాలను నాగర్ కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలంలోని స్వగ్రామానికి తీసుకెళ్లి గుంతతీసి పాతిపెట్టాడు. వాటిని స్వాధీనం చేసుకున్నాం” అని డీజీపీ వివరించారు.

## బహ్రెయిన్‌పై విరుచుకుపడ్డ ఇరాన్

మధ్య యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి బహ్రెయిన్‌లోని ఈ కీలక స్థావరాన్ని ఐఆర్‌జీసీ పలుమార్లు లక్ష్యం చేసుకుంది. తాజా దాడుల్లో అందులోని మౌలిక సదుపాయాలు పూర్తిగా దెబ్బతిన్నాయి. దీంతో ఈ స్థావరాన్ని మరమ్మతు చేయాలా వద్దా.. అనే విషయాన్ని పరిశీలిస్తున్నట్లు హాంగ్‌కావో పేర్కొన్నారు. ప్రత్యామ్నాయాలపైనా చర్చలు జరుగుతున్నట్లు తెలిపారు. ఎన్ఏఎస్‌బీతో పాటు బహ్రెయిన్‌లోని ఇతర అమెరికా సైనిక స్థావరాలపైనా దాడులు చోటుచేసుకున్నాయి.జోర్డాన్‌లోని అమెరికా స్థావరంపై ఇరాన్ దాడులు చేయడంతో పలు సైనిక విమానాలు ధ్వంసమయ్యాయి. ఏ-10 థండర్‌బోల్ట్ విమానంతో పాటు ఎనిమిది ఎఫ్-15 యుద్ధ విమానాలు స్వల్పంగా దెబ్బతిన్నాయి. ఇరాన్ దాడులను అడ్డుకునేందుకు అమెరికా బలగాలు 30 పాట్రియాట్ క్షిపణులను మోహరించాయి. ఇరాన్‌కు చెందిన 5 యుద్ధ నౌకలను మంగళవారం అమెరికా ధ్వంసం చేయడంతో ఇరాన్ ప్రతిదాడులు చేసింది.

## అంతర్జాతీయ ఆర్థిక సేవల రూపురేఖలు మారుద్దాం

**ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా**

ముంబయి: అంతర్జాతీయ ఆర్థిక సేవల రూపురేఖల్ని భవిష్యత్తులో మార్చగలిగే విశ్వసనీయ భాగస్వామిగా భారత్ నిలవగలదని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఆర్‌బీఐ) గవర్నర్ సంజయ్ మల్హోత్రా పేర్కొన్నారు. 'గ్లోబల్ ఫిన్‌టెక్ ఫెస్ట్ 2026'లో ఆయన గురువారం కీలకోపన్యాసం చేశారు. తదుపరితరం ఆర్థిక సేవల కోసం డిజిటల్ పబ్లిక్ మౌలిక వసతులు ఏర్పాటు చేసేందుకు ఆర్‌బీఐ పనిచేస్తోందని వివరిస్తూ, యూనిఫైడ్ లెండింగ్ ఇంటర్‌ఫేస్ (యూఎల్ఐ)ను ఉదహరించారు. భారత ఫిన్‌టెక్ వ్యవస్థ అంతర్జాతీయంగా మూడో స్థానంలో ఉందని, ఈ రంగంలో దేశంలో 30 యూనికార్న్ (కనీసం 100 కోట్ల డాలర్లు/రూ.9500 కోట్ల విలువైన) సంస్థలు ఉన్నాయని అన్నారు. 'ఆర్థిక వ్యవస్థలో విజయానికి నమ్మకమే కీలకం. డేటాను వ్యాపార ఆస్తులుగా భావించకుండా, బాధ్యతగా భావించాల'న్నారు. యూనిటెక్ ఫిన్‌టెక్ ఫోరమ్‌ను ఆర్థిక రంగంలో రెండో స్వయం నియంత్రిత సంస్థ (ఎస్ఆర్ఓ)గా మల్హోత్రా ప్రకటించారు. అంతక్రితం ఫిన్‌టెక్ అసోసియేషన్ ఫర్ కన్జూమర్ ఎంపవర్‌మెంట్(ఫేస్) తొలి ఎస్ఆర్ఓగా గుర్తింపు పొందింది. 'ఒక మహిళా డైరెక్టర్'కు మించి ఎక్కడ?: చాలా వరకు కంపెనీలు తమ బోర్డుల్లో ఒక మహిళా డైరెక్టర్‌కు మించి నియామకాలు జరపడంలో విఫలమయ్యాయని సేల్స్‌ఫోర్స్ దక్షిణాసియా ప్రెసిడెంట్, సీఈఓ అరుంధతీ భట్టాచార్య పేర్కొన్నారు. 'తొలుత బోర్డుల్లోకి యాజమాన్యాల కుటుంబ సభ్యులైన మహిళలను తీసుకొచ్చేవారు.



ఇపుడు స్వతంత్ర డైరెక్టర్ల రూపంలో నియమిస్తున్నారు. ఈ విషయంలో సరైన దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. కృత్రిమ మేధ(ఏఐ)ను వేగంగా అందిపుచ్చుకోవడం వల్ల ప్రస్తుత లింగ వివక్ష మరింత పెరిగే అవకాశం ఉందన్నారు. అలాగే 'మహిళా నాయకత్వం' అని పిలవడం లేదా ప్రత్యేక కార్పొరేట్ అవార్డులు ఇవ్వడం అసౌకర్యంగా ఉంటుందని ఎస్‌బీఐ మాజీ ఛైర్‌పర్సన్ అయిన అరుంధతీ వివరించారు.

ఆధార్‌ను అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్తాం: యూఐడీఏఐ సీఈఓ

ఆధార్ వ్యవస్థను అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లే దిశగా భారత విశిష్ట గుర్తింపు ప్రాధికార సంస్థ (యూఐడీఏఐ) పనిచేస్తోందని ఆ సంస్థ సీఈఓ సౌరభ్ విజయ్ పేర్కొన్నారు. ముఖ్యంగా ప్రవాస భారతీయులు, విదేశాల్లోని భారత పౌరులకు దీనిని అందుబాటులోకి తీసుకురావాలని చూస్తున్నట్లు తెలిపారు. డిజిటల్ కేవైసీని మరింత విస్తృతం చేసేందుకు ఆధార్ లైట్ వంటి కొత్త ఉత్పత్తులు తీసుకురావడంపై పనిచేస్తున్నట్లు వివరించారు.

**ఎఫ్‌సీఎన్‌ఆర్(బీ) వల్ల అసాధారణ రుణాలు మంజూరు కావు: ఎస్‌బీఐ ఛైర్మన్**

రూపాయి విలువ కాపాడేందుకు, విదేశీ కరెన్సీకి ఆకర్షించేందుకు అమలు చేసిన ఎఫ్‌సీఎన్‌ఆర్(బీ) కింద 127 బిలియన్ డాలర్ల (రూ.12 లక్షల కోట్ల)కు పైగా వచ్చాయి. ఇందువల్ల ద్రవ్యలభ్యత అధికమై, అసాధారణ రుణాలు మంజూరు చేసే అవకాశం ఉందన్న ఆందోళనలను ఎస్‌బీఐ ఛైర్మన్ శ్రీనివాసులు శెట్టి కొట్టివేశారు. అటువంటిదేమీ జరగదన్నారు. ఫిన్‌టెక్ కార్యక్రమంలో యాక్సిస్ బ్యాంక్‌ఎండీ, సీఈఓ అమితాబ్ చౌధ్రీ చేసిన వ్యాఖ్యలపై ఎస్‌బీఐ ఛైర్మన్

# అర్హుల ఓటు ఒక్కటీ మిస్ కావొద్దు

- నో మ్యాపింగ్ ఓటర్ల పరిశీలనలో అప్రమత్తంగా ఉండాలి
- నోటీసులు అందుకున్న వారి పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించాలి
- డిలీషన్లలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలి
- ఫారం-6, 7, 8 దరఖాస్తులపై నిబంధనల మేరకు చర్యలు



కరీంనగర్ బ్యూరో, సెప్టెంబర్ 11 (జనంసాక్షి): ఎస్ఐఆర్ ప్రక్రియలో ఓటర్ల జాబితా పరిశీలనను అత్యంత జాగ్రత్తగా చేపట్టాలని కలెక్టర్ చిత్రా మిశ్రా అధికారులను ఆదేశించారు. శుక్రవారం తిమ్మాపూర్ తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించిన ఆమె నో మ్యాపింగ్ ఓటర్ల పరిశీలనపై తహసీల్దార్ కర్ర శ్రీనివాస్‌రెడ్డిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. నోటీసులు అందుకున్న వారి నుంచి అవసరమైన ధ్రువీకరణ పత్రాలు సేకరించి, బీఎల్‌వోల యాప్‌లో నమోదు చేసి క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. ఆధారాలు లేకుండా ఎలాంటి నిర్ణయం తీసుకోవద్దని, అర్హులైన ఒక్క ఓటరు పేరు కూడా జాబితా నుంచి తొలగిపోకుండా చూడాలని స్పష్టం చేశారు. డిలీషన్ల విషయంలో మరింత అప్రమత్తంగా ఉండాలని, ప్రతి కేసుకు సంబంధించిన కారణాలు, పత్రాల వివరాలను రికార్డుల్లో నమోదు చేయాలని ఆదేశించారు. కొత్త ఓటర్ల నమోదుకు ఫారం-6, తొలగింపులకు ఫారం-7, మార్పులు, చేర్పులకు ఫారం-8 దరఖాస్తులను నిబంధనల ప్రకారం పరిశీలించిన తర్వాతే చర్యలు చేపట్టాలన్నారు. గ్రామాల వారీగా బీఎల్‌వోలు చేపడుతున్న ప్రక్రియను రెవెన్యూ అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ వేముల శ్రీనివాస్‌తో పాటు రెవెన్యూ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## కుమ్మరి కుంట హెచ్ఎం మహేష్‌పై కేసు నమోదు

సుల్తానాబాద్,సెప్టెంబర్ 11(జనంసాక్షి) : పెద్దపల్లి జిల్లా కుమ్మరి కుంట హెడ్మాస్టర్ మహేష్ పై సుల్తానాబాద్ పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు అయింది.సుల్తానాబాద్ సబ్ ట్రెజరీ కార్యాలయంలో పనిచేస్తున్న సీనియర్ అకౌంటెంట్ భాగ్యమ్మ పై అనుచిత వాక్యాలు చేయడమే కాకుండా షర్టు కాలర్ ఎగరవేసి విధి నిర్వహణలో ఉన్నటువంటి భాగ్యమ్మను బ్యాంకు ఎకౌంటు ఎందుకు రిజెక్ట్ చేశావంటూ నోటి దూరుసు ప్రదర్శించాడని ఫిర్యాదులో పేర్కొంది. బ్యాంకు స్టేట్మెంట్ బదులు అకౌంటు పెట్టారని చెప్పిన వినకుండా సరిగ్గా చేయాలంటూ పిడికిలి బిగించి ఆగ్రహం వ్యక్తం చేశారని ఫిర్యాదులో పేర్కొంది. దీంతో సీనియర్ అకౌంటెంట్ భాగ్యమ్మ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా హెచ్ఎం మహేష్ పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై చంద్రకుమార్ తెలిపారు.

## స్థానిక సంస్థల్లో ట్రాన్స్‌జెండర్లకు అవకాశం



తాండూరు, సెప్టెంబర్ 11 (జనంసాక్షి): సమాజంలోని అన్ని వర్గాలకు సమాన ప్రాతినిధ్యం కల్పించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి అన్నారు. మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో ట్రాన్స్‌జెండర్లకు కో-ఆప్షన్ సభ్యులుగా అవకాశం కల్పించేలా చట్ట సవరణకు ప్రభుత్వం చర్యలు చేపట్టడం సామాజిక న్యాయం దిశగా చారిత్రక ముందడుగన్నారు. స్థానిక పాలనలో వారి భాగస్వామ్యంతో హక్కులు, గౌరవం, సాధికారతకు మరింత బలం చేకూరుతుందని పేర్కొన్నారు. ఈ నిర్ణయం తీసుకున్న సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి అన్నారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా తాండూరులోని తులసీ గార్డెన్స్‌లో ఉత్తమ ఉపాధ్యాయుల సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యాభివృద్ధికి కృషి చేస్తున్న ఉపాధ్యాయులను గుర్తించి సన్మానించడం అభినందనీయమన్నారు. ఉత్తమ ఉపాధ్యాయులకు జ్ఞాపికలు, నగదు పురస్కారాలు అందజేశారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ప్రశాంత వాతావరణంలో గణేష్ నిమజ్జనం

### నిమజ్జన పాయింట్ల వద్ద పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

పెద్దపల్లి, సెప్టెంబర్ 11 (జనంసాక్షి): గణేష్ నవరాత్రి ఉత్సవాలు, నిమజ్జన కార్యక్రమాలను ప్రశాంతంగా, సురక్షితంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు, ఉత్సవ కమిటీలు సమన్వయంతో ముందస్తు ఏర్పాట్లు చేయాలని అదనపు కలెక్టర్ బి.శ్రీరాములు ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమీక్షలో నిమజ్జన పాయింట్లు, ట్రాఫిక్, పారిశుధ్యం, వైద్య సేవలు, భద్రత, మార్గాలపై సమీక్షించారు. జిల్లాలోని నాలుగు పట్టణాల్లో సమన్వయ సమావేశాలు నిర్వహించి, గ్రామీణ ప్రాంతాల నిమజ్జన పాయింట్లను ముందుగానే గుర్తించాలని సూచించారు. నిమజ్జన పాయింట్ల వద్ద బ్యారికేడ్లు, క్రేన్లు, విద్యుత్, తాగునీరు, లైటింగ్ సదుపాయాలు కల్పించాలని, క్రేన్లకు అదనపు డ్రైవర్లు, మెకానిక్‌లను అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. విగ్రహాల తరలింపు మార్గాల్లో విద్యుత్ తీగలు, కేబుళ్లు, చెట్ల కొమ్మలను సరిచేయడంతోపాటు ఎత్తైన విగ్రహాల తరలింపును ప్రత్యేకంగా పర్యవేక్షించాలన్నారు. గజ ఈతగాళ్లను షిఫ్టుల వారీగా నియమించి, నిమజ్జన పాయింట్ల వద్ద వైద్య శిబిరాలు, అంబులెన్సులు సిద్ధంగా ఉంచాలని సూచించారు.

మూడు షిఫ్టుల్లో పారిశుధ్య సిబ్బందిని నియమించి పరిశుభ్రతను పర్యవేక్షించాలని, మద్యం విక్రయాలపై కట్టుదిట్టమైన నిఘా ఉంచాలని ఆదేశించారు. నిమజ్జన మార్గాల్లో పశువుల సంచారాన్ని అరికట్టి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజలు, ఉత్సవ కమిటీలు స్వీయ నియంత్రణ పాటిస్తూ పోలీసు, అధికారులకు సహకరించాలని కోరారు. సమావేశంలో ఆర్డీవోలు బి.గంగయ్య, సురేష్, ఏసీపీ జి.కృష్ణ, అధికారులు, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## దళితులపై దాడులను అరికట్టాలి

పెద్దపల్లి, (జనంసాక్షి): దళితులపై దాడులను అరికట్టి, బాధితులు ఫిర్యాదు చేసిన వెంటనే ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసులు నమోదు చేసి నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని దళిత సంఘాల ఐక్యవేదిక నాయకులు డిమాండ్ చేశారు. పెద్దకల్వలో ప్లాట్ కొనుగోలు చేసేందుకు వెళ్లిన తనను కులం పేరుతో దూషించి, హత్య చేస్తామని చెలుకల శ్రీనివాస్, ఐలయ్య, మనోజ్ బెదిరించారని కుక్క కనకరాజు ఆరోపించారు. ఘటనపై ఫిర్యాదు చేసి నెల రోజులు గడిచినా చర్యలు తీసుకోలేదని ఆయన పేర్కొన్నారు. దీంతో ఐక్యవేదిక నాయకులు శుక్రవారం కలెక్టర్ ఎదుట ధర్నా నిర్వహించారు. బాధితుడి ఫిర్యాదుపై వెంటనే అట్రాసిటీ కేసు నమోదు చేసి, నిందితులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కుక్క శ్రావణ్‌కుమార్, కుక్క అశోక్, బొంకూరి నరేందర్, మామిడిపల్లి బాపయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఆహార భద్రత చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలి

- తెలంగాణ రాష్ట్ర ఫుడ్ సేఫ్టీ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్
- పౌష్టికాహారంలో నిర్లక్ష్యంపై కఠిన చర్యలు
- నెలకోసారి అధికారులు.. రేషన్ షాపులు, పాఠశాలలు, అంగన్‌వాడీల్లో ఆకస్మిక తనిఖీలు చేయాలి
- పిల్లలకు నాణ్యమైన ఆహారం అందేలా పర్యవేక్షణ




మేడ్చల్ జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 11 (జనంసాక్షి): జాతీయ ఆహార భద్రత చట్టం-2013ను పకడ్బందీగా అమలు చేసి ప్రతి ఒక్కరికీ నాణ్యమైన పౌష్టికాహారం అందేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని తెలంగాణ రాష్ట్ర ఫుడ్ సేఫ్టీ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ ఆదేశించారు. శుక్రవారం మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడుతూ పౌష్టికాహారం పొందడం ప్రజల హక్కని, నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. రేషన్ షాపులు, రెసిడెన్షియల్, జెడ్పీ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో తనిఖీల సందర్భంగా గుర్తించిన లోపాలపై సమగ్ర నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. గర్భిణీలు, 14 ఏళ్లలోపు పిల్లలకు బాలామృతంతోపాటు నాణ్యమైన పౌష్టికాహారం అందించాలని సూచించారు. దమ్మాయిగూడలోని ఓ పాఠశాలలో పరిశుభ్రత, రికార్డులు, హాజరు పట్టికల నిర్వహణలో నిర్లక్ష్యంపై హెడ్‌మాస్టర్, ఉపాధ్యాయులకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. గుడ్ల నాణ్యతపై కాంట్రాక్టర్లు అప్రమత్తంగా ఉండాలని, కిశోర బాలికల్లో రక్తహీనత నివారణకు పాలు, పండ్లు అందించాలని సూచించారు. విద్య, వైద్య, సంక్షేమ శాఖల అధికారులు నెలకోసారి తనిఖీలు నిర్వహించాలని, ఫుడ్ సేఫ్టీ అధికారులు ఆకస్మిక తనిఖీలు చేసి నివేదికలు సమర్పించాలని ఆదేశించారు. కార్యక్రమంలో నోడల్ అధికారి సాంబశివరావు, జిల్లా బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ సంక్షేమ అధికారులు ఝాన్సీరాణి, వినోద్‌కుమార్, పద్మజ, కాంతమ్మ, డీఎంహెచ్‌వో ఆనంద్, సివిల్ సప్లై అధికారులు సుగుణబాయి, శ్రీనివాస్, జిల్లా సంక్షేమ అధికారి శారద, ప్రిన్సిపాళ్లు, హెడ్‌మాస్టర్లు, కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.



## గుర్తు తెలియని వ్యక్తి అనుమానాస్పద మృతి

హయత్ నగర్, (జనంసాక్షి) : వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో గుర్తు తెలియని వ్యక్తి అనుమానాస్పదంగా మృతి చెందిన ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గత నెల ఆగస్టు 14వ తేదీ అర్ధరాత్రి జీసీ టైల్స్ షాపు ముందు ఉన్న మెట్లపై నుంచి సుమారు 30 నుంచి 35 ఏళ్ల వయస్సు గల గుర్తు తెలియని వ్యక్తి కిందపడిపోయాడు. సమాచారం అందుకున్న 108 సిబ్బంది, పోలీసుల సహాయంతో అతడిని చికిత్స నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించి చేర్పించారు. చికిత్స పొందుతున్న సదరు వ్యక్తి మృతి చెందినట్లు శుక్రవారం ఉదయం ఉస్మానియా ఆసుపత్రి నుంచి వనస్థలిపురం పోలీసులకు సమాచారం అందింది. మృతుడు బ్రౌన్ రంగు షర్టు, నల్ల రంగు ప్యాంటు ధరించి ఉన్నాడని, నల్లటి జుట్టు కలిగి ఉన్నాడని, తలకు గాయం ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై వనస్థలిపురం పోలీసులు అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడిని గుర్తించిన వారు లేదా అతని కుటుంబ సభ్యుల వివరాలు తెలిసిన వారు వనస్థలిపురం పోలీసులను సంప్రదించాలని ఎస్హెచ్ఓ రవిబాబు తెలిపారు.

## శేరిలింగంపల్లి ఓటర్ల నమోదు పారదర్శకంగా సాగాలి

### ఎస్ఐఆర్-2026 ప్రక్రియను వేగవంతం చేయాలి : సీఈఓ సి.సుదర్శన్‌రెడ్డి

శేరిలింగంపల్లి, సెప్టెంబర్ 11 (జనంసాక్షి): శేరిలింగంపల్లి నియోజకవర్గంలో ఎస్ఐఆర్-2026 ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను పారదర్శకంగా, ఖచ్చితత్వంతో కొనసాగించాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి (సీఈఓ) సి.సుదర్శన్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. శుక్రవారం నియోజకవర్గంలో పర్యటించిన ఆయన ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ పురోగతిని ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈఆర్ఓ, శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ డాక్టర్ నారాయణ్ అమిత్ ప్రక్రియ వివరాలను ఆయనకు వివరించారు. అనంతరం సీఈఓ మాట్లాడుతూ ఓటర్ల జాబితా సవరణ పనులను వేగవంతం చేయాలని, నిర్దేశిత మార్గదర్శకాలకు అనుగుణంగా ఎలాంటి తప్పులకు తావులేకుండా క్రమబద్ధంగా పూర్తి చేయాలని సూచించారు. తాజా, విశ్వసనీయమైన ఓటర్ల జాబితా సిద్ధం చేయడమే లక్ష్యంగా అధికారులు పనిచేయాలని స్పష్టం చేశారు.

## ఖైరతాబాద్ మహాగణపతి తొలి పూజకు గవర్నర్‌కు ఆహ్వానం

- ఉత్సవ కమిటీ ప్రతినిధులతో గవర్నర్ శివప్రతాప్ శుక్లా భేటీ
- సెప్టెంబర్ 14 నుంచి 25 వరకు గణేష్ ఉత్సవాలు



ఖైరతాబాద్, సెప్టెంబర్ 11, (జనం సాక్షి) : ఖైరతాబాద్ మహాగణపతి తొలి పూజా కార్యక్రమా నికి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించాల్సిందిగా రాష్ట్ర గవర్నర్ శివప్రతాప్ శుక్లాను ఖైరతాబాద్ గణేష్ ఉత్సవ కమిటీ ఆహ్వానించింది.ఖైరతాబాద్ ఎమ్మెల్యే, గణేష్ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు దానం నాగేందర్ నేతృత్వంలోని కమిటీ ప్రతినిధులు శుక్ర వారం లోక్‌భవన్‌లో గవర్నర్‌ను మర్యాదపూర్వకం గా కలిశారు.ఈ సందర్భంగా ఖైరతాబాద్ మహాగ ణపతి ఉత్సవాల ఏర్పాట్లు, కార్యక్రమాల వివరా లను కమిటీ ప్రతినిధులు గవర్నర్‌కు వివరించారు. ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించనున్న ఖైరతాబాద్ గణేష్ ఉత్సవాలు ఈ నెల 14 నుంచి 25వ తేదీ వరకు కొనసాగనున్నట్లు తెలిపారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చేపడుతున్న ఏర్పాట్లను కూడా వివరించారు. తొలి పూజా కార్యక్రమానికి గవర్నర్ హాజరు కావాలని కోరుతూ అధికారిక ఆహ్వానాన్ని అందజేశారు.ఖైరతాబాద్ మహాగణపతి ఉత్సవాలు ప్రతి ఏడాది భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహిస్తున్న నేపథ్యంలో, ఈసారి కూడా పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం ఉందని కమిటీ ప్రతినిధులు తెలిపారు. ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించేందుకు ప్రభుత్వ శాఖలు, పోలీసు విభాగం, జీహెచ్ఎంసీ తదితర సంస్థలతో సమన్వయం చేసుకుంటూ విస్తృత ఏర్పాట్లు చేస్తున్నామని పేర్కొన్నారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని దర్శన క్యూలైన్లు, తాగునీరు, వైద్య శిబిరాలు, పారిశుద్ధ్య చర్యలు, ట్రాఫిక్ నియంత్రణ, భద్రతా ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. గవర్నర్ శివప్రతాప్ శుక్లా ఆహ్వానాన్ని స్వీకరించి తొలి పూజకు హాజరవుతారని కమిటీ ప్రతినిధులు ఆశాభావం వ్యక్తం చేశారు.

## అసెంబ్లీ సమావేశాల వేళ.. ప్రత్యేక ఆరోగ్య శిబిరాలు

- వైద్య సౌకర్యాలు, పరికరాలు పరిశీలించిన డీఎంహెచ్‌వో డా.పుట్ల శ్రీనివాస్
- ప్రజాప్రతినిధులు, అధికారులు, సిబ్బందికి అందుబాటులో వైద్య సేవలు

హైదరాబాద్, సెప్టెంబర్ 11 (జనంసాక్షి) : తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ సమావేశాల సందర్భంగా ప్రజాప్రతినిధులు, అధికారులు, సిబ్బందికి అత్యవసర వైద్య సేవలు అందించేందుకు ప్రత్యేక ఆరోగ్య శిబిరాలను ఏర్పాటు చేసినట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా.పుట్లశ్రీనివాస్ తెలిపారు. శిబిరాల్లో అవసరమైన అన్ని వైద్య సౌకర్యాలను అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు. తెలంగాణ అసెంబ్లీ సమావేశాల సందర్భంగా డైరెక్టర్ ఆఫ్ హెల్త్ (డీహెచ్), డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డీఎంఈ), వైద్య విధాన పరిషత్ ఆధ్వర్యంలో ప్రత్యేక ఆరోగ్య శిబిరాలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా.పుట్ల శ్రీనివాస్ శిబిరాలను సందర్శించి, అక్కడ అందుబాటులో ఉన్న వైద్య సౌకర్యాలు, పరికరాలు, మందులు, ఇతర సేవలను పరిశీలించారు. అసెంబ్లీ సమావేశాలకు హాజరయ్యే ప్రజాప్రతినిధులు, అధికారులు, సిబ్బందికి అవసరమైన వైద్య సేవలను సకాలంలో అందించాలని వైద్యులు, ఆరోగ్య సిబ్బందిని ఆదేశించారు. ఎలాంటి అత్యవసర పరిస్థితి ఎదురైనా తక్షణమే స్పందించేలా సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. శిబిరాల్లో జనరల్ ఫిజీషియన్, కార్డియాలజిస్ట్ తదితర స్పెషలిస్టు వైద్యులను అందుబాటులో ఉంచారు. ఈసీజీతో పాటు అవసరమైన వైద్య పరీక్షలు, మందులు, అత్యవసర వైద్య సేవలు అందించేలా ఏర్పాట్లు చేశారు. అత్యవసర పరిస్థితుల్లో వెంటనే వైద్యం అందించేందుకు వైద్యులు, ఆరోగ్య సిబ్బందిని సిద్ధంగా ఉంచినట్లు డా.పుట్ల శ్రీనివాస్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ అడిషనల్ డీఎంహెచ్‌వో (ఏఎల్), ఎస్‌పీహెచ్‌వో డా.ఎన్.మురళీధర్, వైద్యాధికారులు, ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# చదువుతో పాటు క్రీడలకూ సమాన ప్రాధాన్యత

- రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించాలి
- 70వ ఎస్‌జీఎఫ్ వాలీబాల్ ఛాంపియన్‌షిప్ ప్రారంభం
- క్రీడలతో క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం పెంపు
- గ్రామీణ క్రీడాకారులకు మెరుగైన అవకాశాలు కల్పించాలి



కరీంనగర్ కల్చరల్, సెప్టెంబర్ 11 (జనంసాక్షి): విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించి తమ ప్రతిభను రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో చాటుకోవాలని కరీంనగర్ నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ పిలుపునిచ్చారు. 70వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్జీఫ్) కరీంనగర్ అర్బన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వాలీబాల్ ఛాంపియన్‌షిప్ పోటీలను నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికితీసేందుకు ఇలాంటి పోటీలు ఎంతగానో దోహదపడతాయని అన్నారు.

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆధ్వర్యంలోని కేంద్ర ప్రభుత్వం చేపట్టిన 'ఫిట్ ఇండియా', ఖేలో ఇండియా' కార్యక్రమాలు గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారుల ప్రతిభను గుర్తించి, వారికి మెరుగైన అవకాశాలు కల్పించడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయని మేయర్ పేర్కొన్నారు. గ్రామస్థాయి నుంచి జాతీయ, అంతర్జాతీయ స్థాయి వరకు క్రీడాకారులను ప్రోత్సహించాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాలు కొనసాగుతున్నాయని తెలిపారు. క్రీడలు కేవలం శారీరక వ్యాయామానికే పరిమితం కావని, వాటి ద్వారా విద్యార్థుల్లో క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు, ఆత్మవిశ్వాసం, పట్టుదల, జట్టుగా పనిచేసే మనస్తత్వం పెంపొందుతాయని అన్నారు. గెలుపోటములు ఆటలో సహజమని, ఓటమిని స్ఫూర్తిగా తీసుకుని మరింత కష్టపడి ముందుకు సాగాలని విద్యార్థులకు సూచించారు. చదువుకు ఎంత ప్రాధాన్యత ఇస్తామో, క్రీడలకు కూడా అంతే ప్రాధాన్యత ఇవ్వాలి.వాలీబాల్ ఛాంపియన్‌షిప్ పోటీలకు ఆతిథ్యం అందిస్తున్న కోటా గ్రూప్ ఆఫ్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ చైర్మన్ అంజిరెడ్డికి మేయర్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఈవో చైతన్య జైని, కోటా గ్రూప్ ఆఫ్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ చైర్మన్ అంజిరెడ్డి, కార్పొరేటర్ గాజా శివరాం, జిల్లా ఎస్జీఎఫ్ కార్యదర్శి బస్సీలాల్, అర్బన్ సెక్రటరీ శంకరయ్య, నేషనల్ వాలీబాల్ ప్లేయర్ శ్రీనివాస్, ఉపాధ్యాయులు, పీఈటీలు, క్రీడాకారులు, విద్యార్థినీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ఆశాలపై పోలీసుల దౌర్జన్యాన్ని ఖండించిన బిఆర్టియు






**రూ.18 వేల వేతనం పెంచాలని డిమాండ్ చేస్తూ చలో అసెంబ్లీ**

ముషీరాబాద్, సెప్టెంబర్ 11 ( జనం సాక్షి): తమ వేతనాన్ని రూ.18 వేలకు పెంచడంతో పాటు ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ రాష్ట్రవ్యాప్తంగా వేలాది మంది ఆశా కార్యకర్తలు శుక్రవారం చలో అసెంబ్లీ కార్యక్రమాన్ని చేపట్టారు. ప్రజాస్వామ్య పద్ధతిలో సుందరయ్య విజ్ఞాన కేంద్రం నుంచి ఇందిరాపార్క్ వరకు ర్యాలీ నిర్వహించేందుకు ముందుగానే పోలీసు అధికారులకు అనుమతి కోరుతూ వినతిపత్రం సమర్పించినప్పటికీ పట్టించుకోలేదని బిఆర్టియు నాయకులు ఆరోపించారు. అదే సమయంలో సిఐటియు, కొన్ని బీసీ సంఘాలకు ధర్నాలు నిర్వహించేందుకు అనుమతి ఇచ్చి, బిఆర్ఎస్ (BRTU) అనుబంధ సంఘాల పట్ల ప్రభుత్వం, పోలీసులు వివక్ష చూపుతున్నా రని వారు విమర్శించారు. ఈ వైఖరిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో తరలివచ్చిన ఆశా కార్యకర్తలు "ఇచ్చిన హామీలను అమలు చేయాలి.. లేదంటే రేవంత్‌రెడ్డి గద్దె దిగాలి" అంటూ నినాదాలు చేస్తూ చలో అసెంబ్లీ కార్యక్రమాన్ని నిర్వహించా రు. ఈ సందర్భంగా ఆశా కార్యకర్తలను పోలీసులు అరెస్టు చేసిన తీరుపై బిఆర్టియు రాష్ట్ర అధ్యక్షుడు రాంబాబు యాదవ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశా రు. మహిళా ఆశా కార్యకర్తల పట్ల కొందరు పోలీసులు దురుసుగా ప్రవర్తి స్తూ, ఇష్టానుసారంగా దుర్భాషలాడుతూ, ఎక్కడికక్కడ అరెస్టులు చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. పోలీసుల దౌర్జన్యం కారణంగా ఆశా రాష్ట్ర అధ్యక్షురాలు సంతోష, సిద్దిపేట జిల్లా అధ్యక్షురాలు లక్ష్మి అస్వస్థతకు గురై సొమ్మసిల్లి పడిపోయారని తెలిపారు. పలువురు మహిళా కార్యకర్తల దుస్తులు చిరిగిపోయాయని, కొందరికి గాయాలయ్యాయని ఆరోపించారు. మహిళలు అనే కనీస విచక్షణ లేకుండా మగ పోలీసులు వ్యవహరించారని మండిపడ్డారు. ఎన్నో ఉద్యమాలు, పోరాటాలు చేసినప్పటికీ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో సైతం ఇలాంటి ఘటనలు చూడలేదని రాంబాబు యాదవ్ అన్నారు. మహిళల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం ఇంత చిన్నచూపు చూడటం తగదని విమర్శించారు. చలో అసెంబ్లీ కార్యక్రమంలో అరెస్టు చేసిన వేలాది మంది ఆశా కార్యకర్తలను వెంటనే విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ వినోద్‌కుమార్, నాయకులు నారాయణ, మారయ్య, వాణి, యాదమ్మ, మంజుల, శైలజ, సమత, స్వరూప, రేణుక, మహేష్ దేశ్‌పాక్, నర్సింగం, రమేష్, సాయి, నగేష్, రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మార్చి 2027 నాటికి ఆసుపత్రి భవనం పూర్తి చేయాలి

- నిర్మాణ పనులు నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలి
- వైద్య పరికరాలు, విద్యుత్, నీటి సౌకర్యాలు సిద్ధం చేయాలి
- జూనియర్ కళాశాల పనులు సెప్టెంబర్ నెలాఖరులోగా పూర్తి
- విద్యతో పాటు విద్యార్థులకు నైపుణ్యాలు అందించాలి



పెద్దపల్లి, సెప్టెంబర్ 11 (జనంసాక్షి): పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో నిర్మిస్తున్న నూతన భవనాన్ని ఒప్పందంలో పేర్కొన్న గడువు మేరకు మార్చి 2027 నాటికి పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆసుపత్రి, ప్రభుత్వ జూనియర్ కళాశాల, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న నిర్మాణ, పునరుద్ధరణ పనులను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఆసుపత్రి ప్రారంభం నాటికే అన్ని విభాగాలు, వైద్య పరికరాలు, విద్యుత్, నీరు, ఇతర సౌకర్యాలు సిద్ధంగా ఉండేలా ముందస్తు ప్రణాళికతో పనులు చేపట్టాలని సూచించారు. నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలన్నారు. జూనియర్ కళాశాలలో అదనపు తరగతి గదులు, పునరుద్ధరణ పనులను సెప్టెంబర్ నెలాఖరులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. విద్యార్థులకు మౌలిక వసతులతో పాటు నైపుణ్యాలు అందేలా బోధన కొనసాగించాలని సూచించారు. పర్యటనలో టీజీఎంఐడీసీ విశ్వప్రసాద్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

**ఎన్‌టీపీసీ నిధులతో ప్రజలకు గరిష్ఠ ప్రయోజనం**

ఎన్‌టీపీసీ సీఎస్ఆర్-సీడీ నిధులను ప్రజలకు ప్రత్యక్ష ప్రయోజనం చేకూరేలా వినియోగించేందుకు అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు. సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జె.అరుణశ్రీతో కలిసి ఆయన నిధుల వినియోగంపై సమీక్ష నిర్వహించారు.

విద్య, వైద్యం, మౌలిక వసతులకు సంబంధించిన అవసరాలను గుర్తించి ప్రతిపాదనలు రూపొందిం చాలని సూచించారు. ఎన్‌టీపీసీ ప్రభావిత గ్రామాల్లో క్షేత్రస్థాయిలో అవసరాలను పరిశీలించి, ప్రజలకు నేరుగా ఉపయోగపడే పనులకు ప్రాధా న్యం ఇవ్వాలన్నారు. నిధులు నిబంధనలకు అనుగుణంగా సమర్థవంతంగా వినియోగించేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. సమావేశంలో ఆర్డీవో బి.గంగయ్య, సీపీఓ రవీందర్, అధికారులు పాల్గొన్నారు.

# క్రీడలు, విద్యకు ప్రభుత్వం పెద్దపీట

### జోనల్ స్థాయి క్రీడా పోటీలను ప్రారంభించిన మున్సిపల్ చైర్మన్ రాధాకృష్ణ

- నాలుగు మండలాల నుంచి అండర్-14, 17 క్రీడాకారుల హాజరు
- చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలి
- ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం



సుల్తానాబాద్, సెప్టెంబర్ 11 (జనంసాక్షి): క్రీడల అభివృద్ధి, క్రీడాకారుల సంక్షేమానికి సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని మున్సిపల్ చైర్మన్ బిరుదు రాధాకృష్ణ అన్నారు. శుక్రవారం ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఎస్‌జీఎఫ్ జోనల్ స్థాయి క్రీడా పోటీలను ఆయన ప్రారంభించారు. విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ ప్రతిభ చాటాలని, క్రీడలతో శారీరక దృఢత్వం, క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయని పేర్కొన్నారు. సుల్తానాబాద్, జూలపల్లి, ఎలిగేడు, ఓదెల మండలాలకు చెందిన క్రీడాకారులు వాలీబాల్, ఖోఖో, కబడ్డీ, అథ్లెటిక్స్‌లో అండర్-14, 17 విభాగాల్లో పాల్గొన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. కాగా, పూసల జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ప్రభుత్వం అందజేసిన ఉచిత యూనిఫాంలను రాధాకృష్ణ, కౌన్సిలర్ వేగోళం పద్మ అబ్బయ్యగౌడ్‌తో కలిసి పంపిణీ చేశారు. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు కృషి చేస్తున్నారని రాధాకృష్ణ తెలిపారు. విద్యార్థులు చదువుతోపాటు క్రీడలు, ఇతర రంగాల్లోనూ రాణించాలని సూచించారు. కార్యక్రమాల్లో కౌన్సిలర్లు, ఉపాధ్యాయులు, క్రీడాకారులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# కరెంటు కోతలపై రైతుల కన్నెర్ర

## కరెంటు కోతలపై రైతుల కన్నెర్ర

- గన్నేరువరం సబ్‌స్టేషన్ ముట్టడి.. ధర్నా
- ఆరు గంటలూ నాణ్యమైన విద్యుత్ రావడం లేదని ఆవేదన
- మూడు రోజుల్లో సమస్య పరిష్కరిస్తామని ఏఈ హామీ
- లేదంటే రాజీవ్ రహదారిపై ధర్నా చేస్తామని హెచ్చరిక



**గన్నేరువరం, సెప్టెంబర్ 11 (జనంసాక్షి):** వ్యవసాయానికి సక్రమంగా విద్యుత్ సరఫరా చేయడం లేదంటూ గన్నేరువరం, మైలారం, చాకలివానిపల్లె, సాంబయ్యపల్లె గ్రామాల రైతులు శుక్రవారం మండల కేంద్రంలోని 33/11 కేవీఏ విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ముట్టడించి ధర్నా చేపట్టారు. విద్యుత్ కోతలతో బోర్లు, మోటర్లు పనిచేయక పంటలకు సాగునీరు అందడం లేదని, పంటలు ఎండిపోయే పరిస్థితి ఏర్పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వ్యవసాయానికి 12 గంటల విద్యుత్ ఇస్తున్నామని చెబుతున్నా.. కనీసం ఆరు గంటలైనా నాణ్యమైన సరఫరా అందడం లేదని ఆరోపించారు. విద్యుత్ శాఖ ఏఈ ఆంజనేయులు అక్కడికి చేరుకుని రైతులతో మాట్లాడి వినతిపత్రం స్వీకరించారు. విద్యుత్ డిమాండ్ పెరగడంతో సరఫరాలో ఇబ్బందులు తలెత్తుతున్నాయని, మూడు రోజుల్లో సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. దీంతో రైతులు ఆందోళనను తాత్కాలికంగా విరమించారు. సమస్య పరిష్కారం కాకపోతే గుండ్లపల్లి రాజీవ్ రహదారిపై పెద్దఎత్తున ధర్నా చేపడతామని రైతులు హెచ్చరించారు. గతంలో 24 గంటల ఉచిత విద్యుత్ అందేదని, కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని రైతు బోయిని బాలయ్య డిమాండ్ చేశారు. రైతుల సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని సీపీఐ జిల్లా నాయకుడు కాంతాల అంజిరెడ్డి విమర్శించారు. వ్యవసాయానికి కనీసం 12 గంటల నాణ్యమైన విద్యుత్ అందించడంతోపాటు సరఫరా నిలిపివేత, పునరుద్ధరణపై ముందస్తు సమాచారం ఇవ్వాలని విలాసాగరం రామచంద్రం కోరారు. కార్యక్రమంలో వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు.



## ఆయిల్ పామ్ తోటలో అంతర పంటగా కోకో సాగు

మేడిపల్లి, సెప్టెంబర్ 11 (జనంసాక్షి): ఉద్యాన శాఖ జగిత్యాల జిల్లా ఆధ్వర్యంలో మేడిపల్లి మండలంలో ఆయిల్ పామ్ తోటల్లో అంతర పంటగా కోకో సాగుపై అవగాహన సదస్సు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి జగిత్యాల జిల్లా ఉద్యాన మరియు పట్టు పరిశ్రమ శాఖ అధికారి శ్రీమతి కట్టా లత అధ్యక్షత వహించారు. నాలుగు సంవత్సరాలు పైబడిన ఆయిల్ పామ్ తోటలో, రైతులు అంతర పంటగా కోకో సాగు చేసుకోవాలని సూచించారు కోకో సాగు కోసం ప్రభుత్వం ప్రోత్సహకం అందిస్తుందని తెలియజేశారు. ఒక ఎకరానికి మొదటి సంవత్సరం 4800/- మరియు రెండవ సంవత్సరం 2400/- రాయితీగా ఇవ్వడం జరుగుతుందని వివరించారు అలాగే ఇట్టి కార్యక్రమానికి కోకో సాగు గురించి శాస్త్రీయంగా వివరించడానికి ప్రముఖ చాక్లెట్ తయారీ కంపెనీ మోండలీస్ ఇంటర్నేషనల్ (క్యాడ్బరీ) సీనియర్ సాంకేతికతాదికారి మనోజ్ విచ్చేసి రైతులకు కోకో సాగు పై అవగాహన కల్పించారు. నాలుగేండ్లకు పై బడి, నీటి వసతి కలిగిన, ఆరోగ్య కరమైన ఆయిల్ పామ్ తోటల్లో కోకో సాగు చేపట్టి అదనపు ఆదాయం పొందవచ్చని వివరించారు. జగిత్యాల డివిజన్ టెక్నికల్ ఉద్యాన అధికారిణి బి. మంజువాణి మాట్లాడుతూ ఆయిల్ పామ్ తోటలో కోకో సాగు చేపట్టదలచిన రైతులు పట్టా పాస్ బుక్, ఆధార్ కార్డ్, బ్యాంకు ఖాతా ప్రతులతో ఉద్యాన అధికారులను సంప్రదించాలని కోరారు. ఇట్టి కార్యక్రమానికి మేడిపల్లి గ్రామ సర్పంచ్, జగిత్యాల జిల్లా లోని ఉద్యాన అధికారులు వి ఐలయ్య, అర్చన, ఏవో షాహిద్ అలీ ఏఈవోలు, జగిత్యాల జిల్లా హెచ్.ఈ.ఓ లు, ఆయిల్ పామ్ కంపెనీ, డ్రిప్ కంపెనీ యాంత్రీకరణ ప్రతినిధులు జిల్లాలోని వివిధ మండలాల నుంచి విచ్చేసిన రైతులు పాల్గొనడం జరిగింది.

## బ్యాంకింగ్ సమస్యల పరిష్కారానికి దేశవ్యాప్త సమ్మె

**కరీంనగర్ కల్చరల్, సెప్టెంబర్ 11 (జనం సాక్షి):** బ్యాంకింగ్ రంగ సమస్యలను పరిష్కరించి ఉద్యోగులు, అధికారుల న్యాయమైన డిమాండ్లను అమలు చేయాలని కోరుతూ యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ ఆధ్వర్యంలో చేపట్టిన దేశవ్యాప్త సమ్మెలో కరీంనగర్ జిల్లాకు చెందిన సుమారు వెయ్యి మంది బ్యాంకు ఉద్యోగులు, అధికారులు పాల్గొన్నారు. స్కేల్-4, ఆపై స్థాయి అధికారులకు పనితీరు ఆధారిత ప్రోత్సాహక చెల్లింపుల్లో ఉన్న వివక్షను తొలగించి అన్ని స్థాయిల ఉద్యోగులకు న్యాయం జరిగేలా విధానం అమలు చేయాలని డిమాండ్ చేశారు. బ్యాంకు ఉద్యోగులకు వారానికి ఐదు రోజుల పని విధానాన్ని అమలు చేయాలని కోరారు. సమ్మెలో భాగంగా కరీంనగర్‌లోని కేడీసీసీ బ్యాంకు నుంచి గీతాభవన్ చౌరస్తా మీదుగా యూనియన్ బ్యాంకు బస్టాండ్ శాఖ వరకు శాంతియుత ర్యాలీ నిర్వహించారు. అనంతరం శాఖ ఎదుట నిరసన చేపట్టి డిమాండ్లను నినదించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. దేశ ఆర్థిక వ్యవస్థకు బ్యాంకింగ్ రంగం కీలకమని, ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం, బ్యాంకు యాజమాన్యాలు సానుకూలంగా పరిష్కరించాలని కోరారు. ఐదు రోజుల పని విధానంతో ఉద్యోగులకు మెరుగైన పని-జీవన సమతుల్యతతోపాటు బ్యాంకింగ్ సేవలను మరింత సమర్థంగా అందించే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో వివిధ బ్యాంకుల ఉద్యోగ సంఘాల నాయకులు, ఉద్యోగులు, అధికారులు పాల్గొన్నారు.

## ఇద్దరు యువతులను మోసం చేసిన కానిస్టేబుల్

- పదేళ్ల ప్రేమ.. ప్రియురాలికి తెలియకుండా మరో యువతితో వివాహం
- ప్రియురాలి ఫిర్యాదుతో ఉప్పల్‌లో కేసు.. అరెస్టు
- భార్య ఫిర్యాదుతో ఖమ్మంలో మరో కేసు నమోదు

**హైదరాబాద్, సెప్టెంబరు 11 (జనం సాక్షి):** పదేళ్లుగా ప్రేమించిన యువతిని పెళ్లి చేసుకుంటానని నమ్మిస్తూ.. ఆమెకు తెలియకుండా మరో యువతిని వివాహం చేసుకున్న సీఐడీ కానిస్టేబుల్ అరుణ్‌కుమార్ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. ఖమ్మం జిల్లాకు చెందిన అరుణ్ కుమార్‌కు తన క్లాస్‌మేట్‌తో పదేళ్లుగా ప్రేమ సంబంధం ఉన్నట్లు సమాచారం. ఆమెను పెళ్లి చేసుకుంటానని నమ్మిస్తూ సంబంధాన్ని కొనసాగించిన అతడు.. జూలైలో మరో యువతిని వివాహం చేసుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ విషయం తెలుసుకున్న ప్రియురాలు ఉప్పల్ పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి అరుణ్‌కుమార్‌ను అరెస్టు చేశారు. ఈ విషయం తెలుసుకున్న అతని భార్య కూడా ఖమ్మం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో అక్కడ మరో కేసు నమోదైంది. దీంతో ఒకే వ్యక్తిపై రెండు వేర్వేరు ప్రాంతాల్లో కేసులు నమోదయ్యాయి. ప్రియురాలిని పెళ్లి చేసుకుంటానని నమ్మించి మరో వివాహం చేసుకున్నారన్న ఆరోపణలపై పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

# కాంగ్రెస్,బీఆర్ఎస్ డ్రామాలు ఆపి రైతుల సమస్యలపై చర్చించాలి

- కరెంటు సమస్యలతో రైతులు అల్లాడుతుంటే రాజకీయాలు చేయడం సిగ్గుచేటు
- ఉపాధి లేక,సాగునీరు రాక అన్నదాతల అవస్థలు
- ఎన్నికల హామీలను తుంగలో తొక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం
- చిగురుమామిడి మీడియా సమావేశంలో మల్కాజిగిరి ఎంపీ ఈటెల రాజేందర్ తీవ్ర ఆగ్రహం



**చిగురుమామిడి సెప్టెంబర్ 11(జనంసాక్షి):** రాష్ట్రంలో కాంగ్రెస్,బీఆర్ఎస్ పార్టీలు ఆడుతున్న రాజకీయ డ్రామాలను పక్కనబెట్టి, తక్షణమే రైతులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారంపై చర్చించాలని మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు ఈటెల రాజేందర్ డిమాండ్ చేశారు. శుక్రవారం చిగురుమామిడి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో రైతాంగం తీవ్రమైన కరెంటు సమస్యలతో అల్లాడుతుంటే, అధికార, ప్రతిపక్ష పార్టీలు బాధ్యతారహితంగా రాజకీయాలు చేయడం సిగ్గుచేటని మండిపడ్డారు. కేవలం పత్రికల్లో పతాక శీర్షికలు సంపాదించుకోవడం కోసమే కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలు తాపత్రయపడుతున్నారని, క్షేత్రస్థాయిలో రైతుల బాధలను పట్టించుకునే నాథుడే కరువయ్యారని విమర్శించారు. ఒకవైపు ఉపాధి లేక,మరోవైపు సాగునీరు అందక అన్నదాతలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఇచ్చిన ఏ ఒక్క హామీని కూడా కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చకుండా తుంగలో తొక్కిందని ఈటెల రాజేందర్ ధ్వజమెత్తారు. రైతులకు భరోసా ఇవ్వాల్సిన ప్రభుత్వం, ఉన్న రైతుబంధును కాస్తా బంద్ చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. వృద్ధులకు, వితంతువులకు 4వేల పింఛన్ ఇస్తామని,రైతులకు 15వేల రైతుబంధు అందిస్తామని,నిరుద్యోగులకు భృతి ఇస్తామని,అలాగే ప్రతి మహిళకు నెలకు 2500ఇస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఇప్పుడు ఆ బూటకపు హామీలన్నింటినీ విస్మరించి ప్రజలను, రైతులను ఘోరంగా వంచించిందని ఆయన విమర్శించారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి రైతాంగాన్ని,ఇచ్చిన హామీలను కాపాడాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో చొప్పదండి మాజీ ఎమ్మెల్యే బొడిగె శోభ,బిజెపి పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జన్నపురెడ్డి సురేందర్ రెడ్డి, బిజెపి పార్టీ మండల అధ్యక్షుడు పోలోజు సంతోష్ కుమార్,గునుకులపల్లె సర్పంచ్ గునుకుల మధుసూదన్ రెడ్డి,అచ్చ రవీందర్,భీమర లక్ష్మణ్,పిల్లి తిరుపతి,సిద్దెంకి అనిల్, పెసరి హరీష్, తదితరులు పాల్గొన్నారు.

## అర్హులైన బీసీ మహిళలకు ఉచితంగా కుట్టు మిషన్లు

**ఈనెల 15లోగా దరఖాస్తు చేసుకోవాలి**

**మంథని, సెప్టెంబర్ 11,(జనంసాక్షి) :** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న "ఇందిరమ్మ కుట్టు మిషన్ పథకం" ద్వారా అర్హులైన వెనుకబడిన తరగతులకు (బీసీ) చెందిన మహిళలకు ఆటోమేటిక్ కుట్టు మిషన్లను 100 శాతం సబ్సిడీతో అందించేందుకు చర్యలు చేపట్టిందని మంథని ఎంపీడీవో శ్రీజా రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష, ఐఏఎస్ సెప్టెంబర్ 2, 2026న ఉత్తర్వులు జారీ చేశారని తెలిపారు. ఈ పథకం ద్వారా పేద, నిరుద్యోగ, అర్హత కలిగిన బీసీ మహిళలకు స్వయం ఉపాధి కల్పించడంతో పాటు వారి ఆర్థిక స్వావలంబనను పెంపొందించడం, ఆదాయ అవకాశాలను విస్తరించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యంగా పేర్కొన్నారు. మంథని మండలంలోని అన్ని గ్రామాలకు చెందిన అర్హత కలిగిన మహిళలు తేది : 15.09.2026 రోజుల లోపు వెబ్ దరఖాస్తు చేసుకొని మంథని ఎంపీడీవో కార్యాలయం నందు దరఖాస్తులు అందజేయాలని కోరారు. దరఖాస్తుదారులు బీసీ వర్గానికి చెందినవారై, 18 నుంచి 55 సంవత్సరాల మధ్య వయస్సు కలిగి ఉండాలి. గ్రామీణ ప్రాంతాల్లో వార్షిక కుటుంబ ఆదాయం రూ.1.50 లక్షలు, పట్టణ ప్రాంతాల్లో రూ.2 లక్షలకు మించకూడదు. కుటుంబానికి ఒక్క కుట్టు మిషన్ యూనిట్ మాత్రమే మంజూరు చేస్తారు, తెల్ల రేషన్ కార్డు/ఆహార భద్రత కార్డు, ఆదాయ ధ్రువీకరణ పత్రం, ఆధార్, వయస్సు ధ్రువీకరణ పత్రం, టైలరింగ్ నైపుణ్య ధ్రువీకరణ వంటి పత్రాలను పరిశీలించనున్నారు.

# ముంపు గ్రామాల్లో పరిశ్రమలు, ఐటీ కేంద్రాలు ఏర్పాటు చేయాలి

- గల్ఫ్ వలసల నివారణకు పరిశ్రమల స్థాపనే మార్గం
- అసెంబ్లీలో ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్



**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి,(జనంసాక్షి):** మిడ్‌మానేరు డ్యామ్ ముంపు గ్రామాల్లో నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేందుకు ఐటీ కేంద్రాలతో పాటు ఇతర పరిశ్రమలను తక్షణమే ఏర్పాటు చేయాలని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ కోరారు. శుక్రవారం అసెంబ్లీలో పరిశ్రమలు, ఐటీ రంగాల స్థాపనపై జరిగిన చర్చలో ఆయన మాట్లాడారు. మిడ్‌మానేరు ప్రాజెక్టు కారణంగా వేములవాడ పరిసరాల్లో సుమారు 12 గ్రామాలు ముంపునకు గురై ప్రజలు ఉపాధి అవకాశాలు లేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు గతంలో ముంపు గ్రామాలను సందర్శించి సమస్యలను పరిశీలించిన విషయాన్ని గుర్తుచేశారు. పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన భూమితోపాటు మిడ్‌మానేరు జలాశయం ద్వారా నీటి లభ్యత కూడా ఉందని వివరించారు. స్థానికంగా ఉపాధి అవకాశాలు లేక యువత పెద్ద సంఖ్యలో గల్ఫ్ దేశాలకు వలస వెళ్తున్నారని, పరిశ్రమలు ఏర్పాటు చేస్తే ఈ వలసలను అరికట్టవచ్చన్నారు. సిరిసిల్ల అపారెల్ పార్కు తరహాలో ఆధునిక షెడ్లు ఏర్పాటు చేసి యువతులు, మహిళలకు కుట్టు శిక్షణ కేంద్రాలు ప్రారంభించాలని కోరారు. షర్టులు, ప్యాంట్లు, కుర్తాల తయారీ ద్వారా మహిళలకు స్వయం ఉపాధి కల్పించవచ్చన్నారు. ముంపు ప్రాంతాల పరిస్థితులపై అవగాహన ఉన్న పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు చొరవ తీసుకుని ఆయా ప్రాంతాలకు పరిశ్రమలు కేటాయించాలని స్పీకర్ ద్వారా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

# రాజన్న ఆలయ నిర్మాణ పనులు శరవేగంగా పూర్తి చేయాలి

**జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్**



**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 11 (జనంసాక్షి) :** వేములవాడ టెంపుల్ ఏరియా డెవలప్ మెంట్ అథారిటీ (వీటీఏడీఏ) ఆధ్వర్యంలో శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయ విస్తరణ, అభివృద్ధి పనులను శరవేగంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. శుక్రవారం వేములవాడలో వీటీఏడీఏ ఆధ్వర్యంలో చేపడుతున్న శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం విస్తరణ, అభివృద్ధి పనులు, నిత్యాన్నదాన సత్రం నిర్మాణం, బద్దిపోచమ్మ ఆలయ నిర్మాణ పనులను జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఆర్ అండ్ బీ, ఇతర శాఖల అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించి ఇప్పటి వరకు పూర్తి చేసిన పనులపై ఆమె ఆరా తీశారు. తిప్పాపూర్ బ్రిడ్జి నుంచి శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయం వరకు 80 ఫీట్ల రోడ్డు విస్తరణ పనులను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. మురికి నీటి కాలువ,విద్యుత్ టవర్ల నిర్మాణం,రోడ్డు నిర్మాణ పనులపై ఆరా తీశారు. ఒక్కో పనిని ఎప్పటిలోగా పూర్తి చేస్తారో అడిగి తెలుసుకున్నారు.
ఆయా శాఖల అధికారులతో జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. అధునాతన గోశాల పురోగతిపై వివరాలు సేకరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఆలయ విస్తరణ,అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఆయా శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని, నిర్మాణ ప్రక్రియలో జాప్యం కాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. నిత్యాన్నదాన సత్రం నిర్మాణ పనులను వేగవంతంగా చేపట్టాలని తెలిపారు. ఆలయ విస్తరణ, అభివృద్ధి పనులు వేగంగా పూర్తి చేసేందుకు మరింత మంది కూలీల సంఖ్యను పెంచాలని అధికారులను ఆదేశించారు. బద్దిపోచమ్మ ఆలయ విస్తరణ పనులను పరిశీలించిన కలెక్టర్ గడువులోగా ప్రణాళిక ప్రకారం వేగవంతంగా పనులు పూర్తి చేసేలా చూడాలన్నారు. వీటీఏడీఏ ఆధ్వర్యంలో చేపట్టిన పనులను ఆయా శాఖల అధికారులు నిత్యం క్షేత్రస్థాయిలో పరిశీలించాలని పనులు వేగంగా పూర్తి అయ్యేలా పర్యవేక్షణ చేయాలని అధికారులను
ఆదేశించారు. కార్యక్రమాల్లో ఆలయ ఈఓ రమాదేవి, వేములవాడ ఆర్డీఓ కే ఎస్ బీ కుమారి, ఆర్ అండ్ బీ ఎస్ఈ భీమ్లా నాయక్, డీఈ శాంతయ్య, మున్సిపల్ కమిషనర్ లోకేష్, నీటి పారుదల శాఖ అధికారి దయాకర్,తహసీల్దార్ జయంత్, రాజన్న ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

# యాలాల యువతకు ఆర్బీఓఎల్.. ఉపాధి వరం

- స్థానికులకు ప్రాధాన్యంతో ఉద్యోగ అవకాశాలు
- 160 మందికి పైగా శాశ్వత సిబ్బంది..
- మరో 150 మందికి ఉపాధి
- మహిళలకూ గౌరవప్రదమైన ఉద్యోగాలు
- పరిశ్రమతో గ్రామీణ ప్రాంతాల్లో ఆర్థిక చైతన్యం



**యాలాల, సెప్టెంబర్ 11 (జనంసాక్షి):** ప్రభుత్వ ఉద్యోగాల నోటిఫికేషన్ల కోసం ఏళ్ల తరబడి ఎదురుచూస్తున్న గ్రామీణ యువతకు యాలాల మండలం జక్కేపల్లి పరిధిలోని రాడికల్ బయో ఆర్గానిక్స్ లిమిటెడ్ (ఆర్బీఓఎల్) పరిశ్రమ ఉపాధి కల్పిస్తోంది. స్థానికులకు ప్రాధాన్యమిస్తూ యువతీ యువకులకు వారి విద్యార్హతలు, నైపుణ్యాలకు అనుగుణంగా ఉద్యోగాలు కల్పిస్తున్నట్లు యాజమాన్యం తెలిపింది. పరిశ్రమలో 160 మందికి పైగా శాశ్వత ఉద్యోగులు, మరో 150 మందికి పైగా కాంట్రాక్టు, రోజువారీ వేతన ప్రాతిపదికన పనిచేస్తున్నారు. ప్లాంట్ ఆపరేషన్స్, కెమికల్ ల్యాబ్స్, ఎలక్ట్రికల్, ఇన్‌స్ట్రుమెంటేషన్, పరిపాలన, హెచ్‌ఆర్, అకౌంట్స్ విభాగాల్లో ఇంజినీర్లు, డిప్లొమా, ఐటీఐ, గ్రాడ్యుయేట్ యువతకు అవకాశాలు కల్పిస్తున్నారు. ప్యాకింగ్, లోడింగ్, సెక్యూరిటీ, హౌస్‌కీపింగ్, నిర్వహణ విభాగాల్లోనూ స్థానికులకు ఉపాధి లభిస్తోంది. మహిళా సాధికారతకు ప్రాధాన్యమిస్తూ అడ్మినిస్ట్రేషన్, క్వాలిటీ కంట్రోల్, డేటా ఎంట్రీ, ఫ్రంట్ ఆఫీస్, అకౌంట్స్‌తోపాటు ప్యాకింగ్, హౌస్‌కీపింగ్, గ్రీన్‌బెల్ట్ విభాగాల్లో స్థానిక మహిళలకు ఉద్యోగాలు అందిస్తున్నారు. సొంత ప్రాంతంలోనే ఉపాధి లభించడంతో నగరాలకు వలస వెళ్లాల్సిన అవసరం లేకుండా పోయిందని పలువురు ఉద్యోగులు పేర్కొంటున్నారు. ఉద్యోగుల భద్రతకు ప్రాధాన్యమిస్తూ సకాలంలో వేతనాలతోపాటు ఈపీఎఫ్, ఈఎస్ఐ వంటి సామాజిక భద్రతా సౌకర్యాలు కల్పిస్తున్నట్లు యాజమాన్యం తెలిపింది. పరిశ్రమకు ముడిసరుకు, ధాన్యం, ఇథనాల్, ఎక్స్‌ట్రా న్యూట్రల్ ఆల్కహాల్ రవాణాతో స్థానిక డ్రైవర్లు, క్లీనర్లు, రవాణా వ్యాపారులకు కూడా ఉపాధి లభిస్తోంది. ధాన్య ఆధారిత పరిశ్రమ కావడంతో నాణ్యత తక్కువగా ఉన్న, విరిగిన ధాన్యాలకు స్థానికంగా మార్కెట్ లభిస్తోందని రైతులు చెబుతున్నారు. యాలాల వంటి వలసల ప్రాంతంలో మరిన్ని పరిశ్రమలు ఏర్పాటు చేసి స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

# భారతీయ సంస్కృతికి ప్రతీక యోగా

- అట్టహాసంగా రాష్ట్రస్థాయి యోగా పోటీలు ప్రారంభం
- 24 జిల్లాల నుంచి వేయి మంది క్రీడాకారుల హాజరు
- ప్రతిభ కనబరిచిన వారికి జాతీయ జట్టులో చోటు
- 2036 ఒలింపిక్స్‌లో తెలంగాణ నుంచి అధిక ప్రాతినిధ్యమే లక్ష్యం



**కరీంనగర్ బ్యూరో, సెప్టెంబర్ 11 (జనంసాక్షి):** భారతీయ సంస్కృతికి యోగా ప్రతీక అని ఆల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత, జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ పోషకులు వుటుకూరి నరేందర్‌రెడ్డి అన్నారు. కరీంనగర్ జిల్లా యోగా అసోసియేషన్ ఆధ్వర్యంలో కొత్తపల్లిలోని ఆల్ఫోర్స్ ఈ-టెక్నో స్కూల్‌లో శుక్రవారం 13వ రాష్ట్రస్థాయి సబ్ జూనియర్, జూనియర్ బాలబాలికల యోగా చాంపియన్‌షిప్ పోటీలు ప్రారంభమయ్యాయి. ముఖ్యఅతిథిగా హాజరైన నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. 2036లో భారత్‌లో జరిగే ఒలింపిక్స్‌లో తెలంగాణ నుంచి ఎక్కువ మంది యోగా క్రీడాకారులు పాల్గొనేలా ప్రోత్సహించాలన్నారు. యోగా మానసిక ఉల్లాసంతోపాటు శారీరక దారుఢ్యాన్ని పెంపొందిస్తుందని, చిన్నారుల నుంచి పెద్దల వరకు ప్రతి ఒక్కరూ సాధన చేయాలని సూచించారు. తెలంగాణ యోగా అసోసియేషన్ చైర్మన్, మాజీ మేయర్ సర్దార్ రవీందర్‌సింగ్ మాట్లాడుతూ.. 2004 నుంచి కరీంనగర్ జిల్లా 16 సార్లు రాష్ట్ర ఓవరాల్ ఛాంపియన్‌గా నిలవడం ఇక్కడి క్రీడాకారుల ప్రతిభకు నిదర్శనమన్నారు. అంతర్జాతీయ పోటీల్లో పలువురు కరీంనగర్ క్రీడాకారులు భారత్‌కు ప్రాతినిధ్యం వహించి పతకాలు సాధించారని తెలిపారు. తెలంగాణ యోగా అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్.ఎన్.రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచిన వారిని జైపూర్‌లో వచ్చే నెల 3 నుంచి జరిగే జాతీయస్థాయి పోటీలకు తెలంగాణ జట్టుకు ఎంపిక చేస్తామన్నారు. ప్రధాన కార్యదర్శి ఎన్.సిద్ధారెడ్డి మాట్లాడుతూ.. రెండు రోజుల పాటు జరిగే పోటీల్లో 24 జిల్లాల నుంచి సుమారు వేయి మంది క్రీడాకారులు పాల్గొంటున్నారని తెలిపారు. సబ్ జూనియర్‌లో 8-10, 10-12, 12-14, జూనియర్‌లో 14-16, 16-18 ఏళ్ల విభాగాల్లో పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. తొలిసారిగా పాయింట్ల కేటాయింపును పారదర్శకంగా పర్యవేక్షించేందుకు ఆన్‌స్క్రీన్ విధానాన్ని ఏర్పాటు చేశారు. ప్రారంభోత్సవంలో క్రీడాకారుల యోగాసన ప్రదర్శనలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. పలువురు రాష్ట్ర, జిల్లా యోగా, ఒలింపిక్ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## పొలంలో విద్యుత్ మరమ్మతులు చేస్తూ రైతు మృతి



**రుద్రంగి (జనం సాక్షి) :** రుద్రంగి మండలంలోని రూప్లా నాయక్ తండా గ్రామానికి చెందిన రైతు విద్యుదాఘా తంతో మృతి చెందిన సంఘటన తీవ్ర విషా దాన్ని నింపింది. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన భూక్య చందర్ (50) అనే రైతు తన పంట చేనులో శుక్రవారం విద్యుత్ మోటారుకు సంబంధించిన మరమ్మతులు చేస్తుండగా ప్రమాదవశాత్తు కరెంట్ షాక్ తగిలింది. ఈ ప్రమాదంలో అక్కడికక్కడే కుప్పకూలి మృతి చెందాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు, గ్రామస్తులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని పంచనామా నిమిత్తం వేములవాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతుడు భూక్య చందర్ కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నట్లు స్థానికులు తెలిపారు. చందర్ మృతితో కుటుంబంలో విషాదఛాయలు అలుముకున్నాయి. గ్రామంలో విషాద వాతావరణం నెలకొంది. రైతులు పొలాల వద్ద విద్యుత్ పరికరాలు,మోటార్లు మరమ్మతు చేసే సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని,మెయిన్ స్విచ్ ఆఫ్ చేసిన తర్వాతే మరమ్మతులు చేయాలని అధికారులు సూచిస్తున్నారు.

# మంత్రి పొన్నం నియోజకవర్గంలో కరెంట్ సెగ

- ఎండిన పంటలతో వచ్చి సుందరగిరిలో రోడ్డెక్కిన రైతులు..!
- సబ్ స్టేషన్ ను ముట్టడించిన ఫలితం లేదని రైతుల ఆవేదన
- గంటన్నరపాటు వాహనాల నిలిపివేత..ప్రయాణికుల తీవ్ర ఇబ్బందులు





**చిగురుమామిడి సెప్టెంబర్ 11(జనంసాక్షి):** రాష్ట్ర రవాణా,బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రాతినిధ్యం వహిస్తున్న హుస్నాబాద్ నియోజకవర్గ పరిధిలోని చిగురుమామిడి మండలంలో కరెంట్ కోతలు తీవ్ర కలకలం రేపుతున్నాయి. మండలంలోని బొమ్మనపల్లి, ఉల్లంపల్లి,సుందరగిరి తదితర గ్రామాల్లో గత కొన్ని రోజులుగా అప్రకటిత కరెంట్ కోతలు విపరీతంగా పెరిగిపోవడంతో ఆగ్రహించిన రైతాంగం శుక్రవారం ఉదయం భారీ ఎత్తున రోడ్డెక్కి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ పంటలు చేతికి వచ్చే కీలక సమయంలో కరెంట్ సరఫరా సక్రమంగా లేకపోవడం వల్ల పొలాలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రోజుకు కొన్ని గంటలు కూడా నాణ్యమైన విద్యుత్ అందడం లేదని, దీనివల్ల వేలాది రూపాయల పెట్టుబడులు పెట్టి సాగు చేసిన పంటలు కళ్ల ముందే ఎండిపోతున్నాయని తున్నాయని కన్నీరుమున్నీరయ్యారు. స్థానిక విద్యుత్ అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా ఫలితం లేకుండా పోయిందని మండిపడ్డారు. కరెంట్ సమస్యను తక్షణమే పరిష్కరించాలంటూ సుందరగిరి చౌరస్తాలోని కరీంనగర్-హుస్నాబాద్ ప్రధాన రహదారిపై రైతులు భారీ రాస్తారోకో నిర్వహించారు. నీళ్లు లేక ఎండిపోయిన వరి, మొక్కజొన్న, పత్తి రోడ్డుపై వేసి బైఠాయించారు. ప్రభుత్వం, విద్యుత్ శాఖ అధికారులకు వ్యతిరేకంగా పెద్ద పెట్టున నినాదాలు చేశారు. చిగురుమామిడి ఎస్సై జగదీశ్వర్ తమ పోలీస్ సిబ్బందితో వచ్చి రైతులకు నచ్చచెప్పిన వినలేదు. దీంతో చిగురుమామిడి మార్గంలో వాహనాలు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. దాదాపు గంటన్నరపాటు సాగిన ఈ రాస్తారోకో కారణంగా కిలోమీటర్ల మేర ట్రాఫిక్ జాం ఏర్పడింది. ప్రయాణికులు, పాఠశాల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఉన్నతాధికారులతో మాట్లాడి కరెంట్ కోతలు లేకుండా నిరంతర విద్యుత్ సరఫరా జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారు. అధికారుల స్పష్టమైన హామీతో రైతులు తమ రాస్తారోకోను తాత్కాలికంగా విరమించారు. పంటలను కాపాడకపోతే రాబోయే రోజుల్లో మంత్రి కార్యాలయాన్ని ముట్టడిస్తామని రైతులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాజీసింగిల్ విండో చైర్మన్ జంగా వెంకటరమణారెడ్డి,బీఆర్ఎస్ నాయకులు, మాజీ ఎంపీటీసీలు కత్తుల రమేష్ యాదవ్,మిట్టపల్లి మల్లేశం,ఉపసర్పంచ్ కాసర్ల హరీష్,బీజేపీ మండల నాయకులు కంది శంకర్, మామిడి రమేష్,తోట శ్రీనివాస్,గంట బిక్షపతి,మ్యాదరవేని ప్రవీణ్ యాదవ్,మాచమల్ల బుజ్జన్న, గంధం ఓదెలు,గంధం నారాయణ, గందె శ్రీనివాస్, మాచమల్ల రమేష్ తోపాటు,పెద్ద సంఖ్యలో వివిధ గ్రామాల రైతులు,ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు

# అత్యాధునిక గ్రీన్ టాయిలెట్లకు శ్రీకారం

## గేట్స్ ఫౌండేషన్ రూపొందించిన గ్రీన్, రీసైకిల్ టాయిలెట్ల ప్రారంభం




హైదరాబాద్ (జనంసాక్షి) : నూతన ఆవిష్కరణలకు కేంద్రంగా ఎదిగిన హైదరాబాద్ నగరం మరో ప్రపంచస్థాయి అత్యధునిక సాంకేతికతకు వేదిక కానుంది. బిల్ గేట్స్ ఫౌండేషన్ అభివృద్ధి చేసిన పునర్వినియోగానికి వీలుగా నీటిని శుద్ధి చేసే నెట్ జీరో, గ్రీన్ టాయిలెట్లను తయారు చేయడానికి నగరం ఎంపికైంది. రీ ఫ్లో అనే పర్యావరణ అనుకూల సాంకేతిక సంస్థ, తెలంగాణా ప్రభుత్వ ఆధీనంలోని టీ- వర్క్స్ గేట్స్ ఫౌండేషన్ తో కలిసి ఇక్కడ అత్యాధునిక గ్రీన్ టాయిలెట్లను ఉత్పత్తి చేసి దేశంలోని వివిధ రాష్ట్రాలు, దేశాలకు సరఫరా చేయనున్నాయి. దేశంలోని మొట్టమొదటి గ్రీన్ టాయిలెట్లను ఇక్కడి లుంబినీ పార్కులో ఏర్పాటు చేసాయి. నీటిని పునర్వినియోగించే ఈ నెట్ జీరో టాయిలెట్ల సముదాయాన్ని ఐటి, పరిశ్రమలు, శాసనవ్యవహారాల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, రవాణా, బిసి సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ లు ప్రారంభించారు. రూ. కోటితో ఏర్పాటు చేసిన ఈ మరుగుదొడ్లను ఎక్కడికైనా తరలించే వీలుంటుంది. రీ ఫ్లో సంస్థ టీ వర్క్స్ తో కలిసి వాటిని ఇక్కడే ఉత్పత్తి చేయాలని నిర్ణయించడం పట్ల శ్రీధర్ బాబు ప్రశంసించారు. సోలార్ విద్యుత్తుతో నడిచే ఈ టాయిలెట్లకు విద్యుత్తు కనెక్షన్ అవసరం లేదు. ఒకసారి ట్యాంకును నింపితే అదే నీటిని అనేక సార్లు శుద్ధి చేసి తిరిగి వినియోగిస్తుందని శ్రీధర్ బాబు వెల్లడించారు. టెక్నాలజీని ఉచితంగా అందజేస్తున్న గేట్స్ ఫౌండేషన్ ప్రతినిధులను కూడా ఆయన ప్రత్యేకంగా అభినందించారు. 50 యూనిట్ల రీసైకిల్ టాయిలెట్లకు ఇప్పటికే ప్రైవేటు, ప్రభుత్వ సంస్థల నుంచి ఆర్డర్లు లభించాయని ఆయన వెల్లడించారు. గేట్స్ ఫౌండేషన్ పరిశోధన సంస్థలు అభివృద్ధి చేసిన ఈ సాంకేతికత ఉచితంగా లభించడం వల్ల తక్కువ ధరలో అందుబాటులోకి వస్తాయని తెలిపారు. తక్కువ నీటిని వినియోగించడం, కరెంటు సరఫరా అవసరం లేక పోవడం వల్ల వీటిని ఎక్కడైనా ఉపయోగించవచ్చని శ్రీధర్ బాబు వివరించారు. కార్యక్రమంలో గేట్స్ ఫౌండేషన్ ప్రతినిధి అర్చనా వ్యాస్, రీ ఫ్లో ప్రతినిధి అభిషేక్, టి వర్క్స్ సిఇఒ జోగిందర్ తనికెళ్ల తదితరులు పాల్గొన్నారు.

# రూ. 180 కోట్ల ఓవర్సీస్ స్కాలర్‌షిప్ నిధులు విడుదల!

- ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క ఆదేశాలతో నిధులు రిలీజ్
- లబ్ది పొందిన ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ వర్గానికి చెందిన 3,008 మంది విద్యార్థులు



హైదరాబాద్ (జనంసాక్షి) : విదేశాల్లో ఉన్నత విద్యను అభ్యసిస్తున్న తెలంగాణ విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం తీపి కబురు అందించింది. సుదీర్ఘకాలంగా ఎదురుచూస్తున్న ఓవర్సీస్ స్కాలర్‌షిప్ నిధులను శుక్రవారం రూ.179.90 కోట్లు విడుదల చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్క ఆదేశాల మేరకు ఈ నిధులను త విడుదల చేసినట్లు ఆర్థిక శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ సందీప్ కుమార్ సుల్తానియా శుక్రవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. తాజా నిధుల విడుదలతో విదేశాల్లో చదువుకుంటున్న మొత్తం 3,008 మంది విద్యార్థులకు భారీ ఆర్థిక ఊరట లభించిందని, స్కాలర్‌షిప్ మంజూరైన లబ్ధిదారులందరికీ చెల్లింపులు పూర్తి చేసినట్లు తెలిపారు. ఈ నిధుల కేటాయింపుల్లో భాగంగా ఎస్సీ వర్గానికి చెందిన 1,193 మంది విద్యార్థులకు అంబేద్కర్ ఓవర్సీస్ విద్యానిధి కింద రూ.48.42 కోట్లు విడుదల య్యాయి. ఎస్టీ వర్గానికి చెందిన 573 మంది విద్యార్థులకు రూ.36.95 కోట్లు, బీసీ సామాజిక వర్గానికి చెందిన 179 మంది విద్యార్థులకు మహాత్మా జ్యోతిబా పూలే ఓవర్సీస్ విద్యానిధి కింద రూ.18.41 కోట్లు మంజూరు చేశారు. మైనార్టీ సామాజిక వర్గానికి చెందిన 1,063 మంది విద్యార్థులకు ముఖ్యమంత్రి ఓవర్సీస్ విద్యానిధి కింద రూ.76.13 కోట్ల రూపాయలను విడుదల చేశారు. పేద, ప్రతిభా వంతులైన విద్యార్థులు ఆర్థిక ఇబ్బందులు లేకుండా అంతర్జాతీయ స్థాయి విశ్వ విద్యాలయాలలో ఉన్నత చదువులు అభ్యసించాలనే దృఢ సంకల్పంతోనే ప్రభుత్వం ఈ నిధులను విడుదల చేయడంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# జీహెచ్ఎంసీకి యాడ్ ఏజెన్సీల భారీ బకాయి

- అడ్వర్టైజింగ్ రూ. 1.86 కోట్ల చొప్పున బకాయిలు




హైదారాబాద్, సెప్టెంబర్ 11 (జనంసాక్షి) : గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) పరిధిలోని అవుట్‌డోర్ అడ్వర్టైజింగ్ ఏజెన్సీలు భారీగా బకాయిలు పడ్డాయి. ఈ ఏజెన్సీల నుంచి జీహెచ్ఎంసీకి సుమారు రూ. 39.74 కోట్లు (ఖచ్చితంగా రూ. 39,74,15,778) రావాల్సి ఉందని తెలంగాణ ప్రభుత్వం వెల్లడించింది. ఎమ్మెల్సీ దాసోజు శ్రావణ్ కుమార్ అడిగిన ప్రశ్నకు సమాధానంగా, పురపాలక-పట్టణాభివృద్ధి శాఖ సెప్టెంబరు 10న శాసనమండలిలో ఈ వివరాలను సమర్పించింది. ప్రభుత్వం అందించిన నివేదిక ప్రకారం.. హైదరాబాద్ కోర్ అర్బన్ రీజియన్ (క్యూర్) పరిధిలో మొత్తం 452 ఏజెన్సీ ఎంట్రీలు, 1,521 అడ్వర్టైజ్‌మెంట్ యూనిట్లకు సంబంధించి ఈ బకాయిలు పేరుకుపోయాయి. బకాయిదారుల జాబితాలో పలు ప్రముఖ సంస్థలు ఉన్నాయి. ముఖ్యంగా, యూనియాడ్స్ అనే సంస్థ ఒక్క యూనిట్‌కే అత్యధికంగా రూ. 7.71 కోట్లు చెల్లించాల్సి ఉండగా, ఐ క్యాచ్ కమ్యూనికేషన్స్ మరో యూనిట్‌కు సంబంధించి రూ. 6.47 కోట్లు బకాయిపడింది. అత్యధిక యూనిట్లు కలిగిన సంస్థల్లో ప్రకాశ్ ఆర్ట్స్ ముందు వరుసలో ఉంది. ఈ సంస్థకు చెందిన 53 యూనిట్లకు గానూ మొత్తం రూ. 5.35 కోట్లు బకాయిలు ఉన్నాయి. వీటితో పాటు మీడియా కార్ప్ రూ. 5.06 కోట్లు, సీఎంఎస్ఎస్ రూ. 1.79 కోట్లు, అవుట్‌స్పేస్ అడ్వర్టైజింగ్ రూ. 1.86 కోట్ల చొప్పున బకాయిలు చెల్లించాల్సి ఉంది. అవుట్‌డోర్ ప్రకటనల నియంత్రణ కోసం ప్రభుత్వం ఈ ఏడాది మార్చి, జూన్ నెలల్లో 'అవుట్‌డోర్ అడ్వర్టైజ్‌మెంట్ పాలసీ ఫర్ క్యూర్-2026'ను జారీ చేసింది. దీని ప్రకారం.. ప్రైవేట్ ఆస్తులపై ప్రదర్శించే ప్రకటనలకు ఆన్‌లైన్ ద్వారా, ప్రభుత్వ ఆస్తులపై ప్రకటనలకు టెండర్ల ద్వారా అనుమతులు మంజూరు చేస్తారు. అయితే, ఫీజుల వసూలుకు సంబంధించి 2020 నాటి మార్గదర్శకాలు ప్రస్తుతం నిలిపివేతలో ఉన్నాయని, త్వరలోనే సమగ్రమైన కొత్త విధానాన్ని తీసుకురానున్నట్లు ప్రభుత్వం స్పష్టం చేసింది.

# అద్దె చెల్లించడం లేదని హోటల్‌కు తాళం

- పెట్రోల్ పోసుకుని దంపతుల ఆత్మహత్య..!



హనుమకొండ (జనంసాక్షి) : హనుమకొండలో విషాదం నెలకొంది. తెలంగాణ ఉద్యమ సమయంలో వందలాది మంది ఉద్యమకారులకు, విద్యార్థులకు ఉచితంగా భోజనం పెట్టిన హోటల్ యజమానులు ఆత్మహత్య చేసుకున్నారు. అద్దె చెల్లించడం లేదని షట్టర్ యజమాని కుమారుడు రాము .. కేదారి భార్య పుష్పలతను తీవ్ర పదజాలంతో దూషించాడు. అంతటితో ఆగకుండా అతడు హోటల్‌కు తాళం వేయడంతో మనస్తాపం చెందిన దంతపులు పెట్రోల్ పోసుకొని నిప్పంటించుకున్నారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా అద్దె చెల్లించలేదని కేదారి, పుష్ఫలత ఎంత బతిమిలాడినా రాము వినలేదు. పైగా వారిని అసభ్యకరంగా తిట్టాడు. అతడు హోట్‌లకు తాళం వేయడంతో మనస్తాపం చెంది ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకున్న దంపతులు. భర్త కేదారి అక్కడికక్కడే మృతి చెందగా.. భార్య పుష్పలత ఎంజీఎం ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం మరణించింది. కేదారి కుమారుడు పృథ్వీ ఫిర్యాదు మేరకు షట్టర్ యజమాని, అతడి కుమారుడు రాముపై పోలీసులు కేసు నమోదు చేశారు.

# అటవీశాఖ అమరవీరుల సేవలు చిరస్మరణీయం

- తెలంగాణ రాష్ట్ర డీజీపీ సీవీ ఆనంద్
- అడవులు, వన్యప్రాణుల సంరక్షణలో 23 మంది అటవీ సిబ్బంది ప్రాణత్యాగం
- అమరవీరుల కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుంది: మంత్రి జూపల్లి
- అటవీ భూముల ఆక్రమణలను అడ్డుకునేందుకు కలెక్టర్లు, ఎస్పీలు సమన్వయంతో పనిచేయాలి
- అటవీ సిబ్బందికి ఆయుధాలు ఇవ్వాలి



హైదరాబాద్, సెప్టెంబర్11 (జనంసాక్షి) : సహజ వనరులు, అటవీ సంపద, వన్యప్రాణుల పరిరక్షణలో ప్రాణత్యాగం చేసిన అటవీశాఖ సిబ్బంది సేవలు చిరస్మరణీయమని డిజిపి సివి ఆనంద్ పేర్కొన్నారు. అటవీ శాఖ పోలీసు అమరవీరుల దినోత్సవం (సెప్టెంబర్ 11న) సందర్భంగా శుక్రవారం నెహ్రూ జూలాజికల్ పార్కులో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని అమరవీరులకు నివాళులర్పించారు. ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్, టూరిజం శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన అటవీ సిబ్బంది కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని, అన్ని విధాలా ఆదుకుంటామని తెలిపారు. అటవీ సిబ్బంది ఆయుధాలు ఇవ్వాలని మంత్రి పేర్కొన్నారు. ఎక్సైజ్ శాఖ తరఫున డ్రగ్స్ నియంత్రణకు ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటోందని జూపల్లి తెలిపారు. మాదకద్రవ్యాల అక్రమ రవాణా, వినియోగానికి పాల్పడుతున్న వారిపై చట్ట ప్రకారం కేసులు నమోదు చేస్తున్నామని, అవసరమైన సందర్భాల్లో పీడీ యాక్ట్ కింద చర్యలు తీసుకుంటున్నామ న్నారు. అడవుల నరికివేత, అటవీ విస్తీర్ణం తగ్గిపోవడం గ్లోబల్ వార్మింగ్‌కు ప్రధాన కారణాల్లో ఒకటని మంత్రి పేర్కొన్నారు. కవ్వాల్, అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ ఫారెస్టులను పర్యాటకంగా ప్రభుత్వం అభివృద్ధి చేసిందన్నారు.

### ప్రాణాలకు తెగించి విధులు : వినయ్‌కుమార్, చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్

అటవీ సిబ్బంది విధులు అత్యంత ప్రమాదకరమైనవని ఫారెస్ట్ చీఫ్ వినయ్‌కుమార్ అన్నారు. పెట్రోలింగ్ సమయంలో అక్రమ కలప రవాణాదారులు, వన్యప్రాణుల వేటగాళ్లు, ఇతర దుండగుల నుంచి సిబ్బందికి ప్రమాదం పొంచి ఉంటుందని తెలిపారు. అర్ధరాత్రి వేళల్లో వేటగాళ్లను పట్టుకునే క్రమంలోనూ సిబ్బంది అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు.

### 23 మంది అటవీ సిబ్బంది ప్రాణత్యాగం: డిజిపి

ఈ సందర్భంగా డిజిపి మాట్లాడుతూ.... ప్రతి ఏడాది సెప్టెంబర్ 11న అటవీ అమరవీరుల దినోత్సవాన్ని రాజస్థాన్‌లోని ఖేజర్లీ ప్రాంతంలో చెట్లను, పర్యావరణాన్ని కాపాడేందుకు1730 సంవత్సరం లో 363 మంది విష్ణోయి తెగ ప్రజలు ప్రాణత్యాగం చేసిన ఘటనకు గుర్తుగా ఈ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు వివరించారు. పోలీసుశాఖలో అక్టోబర్ 21న పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం నిర్వహించినట్లుగానే.. అటవీశాఖ సిబ్బంది త్యాగాలను స్మరించుకునేందుకు ఈ రోజు ప్రత్యేకమని, ఇది భావోద్వేగంతో కూడిన రోజన్నారు. వన్యప్రాణులు, అడవుల సంరక్షణలో 23 మంది అటవీశాఖ సిబ్బంది ప్రాణాలు కోల్పోయారని డీజీపీ తెలిపారు. ఈ ఏడాది ఆగస్టు 11న పాల్వంచలో ఎఫ్‌బీవో బానోతు నవీన్ వన్యప్రాణుల కోసం ఏర్పాటు చేసిన ఉచ్చులో చిక్కుకుని అటవీ, వన్య ప్రాణుల పరిరక్షణలో ప్రాణ త్యాగం నవీన్ కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

### చిన్ననాటి నుంచే అటవీశాఖతో అనుబంధం

అటవీశాఖతో తనకు ఉన్న అనుబంధాన్ని డీజీపీ గుర్తు చేసుకున్నారు. తన తండ్రి 1953లో అటవీశాఖలో రేంజ్ ఆఫీసర్‌గా చేరి 35 ఏళ్లపాటు సేవలందించి 1988లో డీఎఫ్ఓగా పదవీ విరమణ చేశారని తెలిపారు. నక్సల్స్ ప్రభావం ఉన్న రోజుల్లో తన తండ్రి అటవీ శాఖలో పనిచేసేవారని, దీంతో ఫారెస్ట్ సిబ్బందితో అనుబంధం ఉంది అన్నారు. ఆ తర్వాత 1996లో బెల్లంపల్లిలో అదనపు ఎస్పీగా పనిచేస్తున్న సమయంలో తల్లిదండ్రులతో కలిసి చెన్నూరు చెక్‌పోస్ట్‌కు వెళ్లిన సందర్భాన్ని గుర్తు చేసుకున్నారు. దట్టమైన అడవులు పూర్తిగా కనుమరుగవడాన్ని చూసి తన తల్లిదండ్రుల కళ్లలో నీళ్లు తిరిగాయని తెలిపారు.

### పర్యావరణ సమతుల్యతను కాపాడాలి

అడవులను కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని డీజీపీ పేర్కొంటూ... మానవ తప్పిదాల కారణంగా పర్యావరణ సమతుల్యత దెబ్బతింటోందని ఆందోళన వ్యక్తం చేశారు. హిమాలయాల్లో చోటుచేసుకుంటున్న ప్రకృతి విపత్తులు, యూరప్‌లోని అడవుల్లో సంభవిస్తున్న అగ్నిప్రమాదాలు పర్యావరణ మార్పుల తీవ్రతను తెలియజేస్తున్నాయని పేర్కొన్నారు. రాష్ట్రంలో అటవీ భూముల ఆక్రమణలను అడ్డుకుని అడవులను పరిరక్షించేందుకు కలెక్టర్లు, ఎస్పీలు, అటవీశాఖ అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. మిగిలి ఉన్న చిన్నచిన్న అటవీ ప్రాంతాలను కూడా భవిష్యత్ తరాల కోసం కాపాడాల్సిన అవసరం ఉందన్నారు.

### అటవీ సిబ్బందికి ఆయుధాలు

గతంలో నక్సల్స్ ప్రభావం ఉన్న ప్రాంతాల్లో కూంబింగ్ నిర్వహించే సమయంలో అటవీశాఖ సిబ్బంది వద్ద ఆయుధాలు ఉండేవి కావని డీజీపీ తెలిపారు. ప్రస్తుత పరిస్థితుల్లో అటవీశాఖ సిబ్బందికి అవసరమైన ఆయుధాలు అందిస్తే వారు మరింత సమర్థంగా విధులు నిర్వర్తించగలరని అన్నారు. పోలీసుశాఖ తరఫున అటవీశాఖకు అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో వైరా శాసనసభ సభ్యులు రాందాస్ నాయక్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్స్ వినయ్‌కుమార్,టీజీఎఫ్‌డీసీ వైస్ చైర్మన్, ఎండీ సునీత ఎం. భగవత్, హైదరాబాద్ జిల్లా కలెక్టర్ ప్రియాంక ఆల, సెక్రటరీ ప్రియాంక వర్గీస్, పోలీసు, అటవీ శాఖ అధికారులు, అమరవీరుల కుటుంబాలు పాల్గొన్నారు.

# జూన్ నాటికి ఉప్పల్-నారపల్లి ఫ్లైఓవర్ పూర్తి



హైదరాబాద్, సెప్టెంబర్ 11 (జనంసాక్షి) : హైదరాబాద్ నగర శివారు ప్రాంతాల వాహనదారులకు ప్రభుత్వం కీలక ప్రకటన చేసింది. ఉప్పల్ నుంచి నారపల్లి వరకు నిర్మిస్తున్న ఎలివేటెడ్ కారిడార్ పనులను వేగవంతం చేసి, 2027 జూన్ నాటికి ఫ్లైఓవర్‌ను పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి వెల్లడించారు. ఉప్పల్-నారపల్లి మార్గంలో ట్రాఫిక్ రద్దీని తగ్గించడంతో పాటు వరంగల్ వైపు వెళ్లే వాహనాలకు మెరుగైన రవాణా సౌకర్యం కల్పించే ఉద్దేశంతో ఈ ఎలివేటెడ్ కారిడార్‌ను నిర్మిస్తున్నారు. ఇప్పటికే ప్రాజెక్టు పనులు కొనసాగుతున్నప్పటికీ పలు కారణాల వల్ల నిర్మాణం అనుకున్న సమయానికి పూర్తికాలేదు. ఈ నేపథ్యంలో పనుల్లో వేగం పెంచి వచ్చే ఏడాది జూన్ నాటికి ప్రాజెక్టును పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. వాస్తవానికి ఈ ఫ్లైఓవర్‌ను ఈ ఏడాది దసరా నాటికి అందుబాటులోకి తీసుకురావాలని గతంలో భావించారు. అయితే కాంట్రాక్టు సంస్థకు సంబంధించిన సమస్యలు, న్యాయపరమైన అంశాలు తదితర కారణాలతో పనులు ఆలస్యమయ్యాయి. ప్రాజెక్టు కాంట్రాక్టర్ నేషనల్ కంపెనీ లా ట్రైబ్యునల్‌ను ఆశ్రయించడంతో నిర్మాణ ప్రక్రియలో అంతరాయం ఏర్పడిందని మంత్రి వివరించారు. పరిస్థితిని చక్కదిద్దేందుకు సెకండరీ ఏజెన్సీని రంగంలోకి తీసుకురావాల్సి వచ్చిందని తెలిపారు. అయినప్పటికీ నిర్దేశిత గడువులోగా పనులను పూర్తి చేయలేకపోయామని మంత్రి పేర్కొన్నారు. ప్రస్తుతం ఉన్న అవరోధాలను తొలగించి నిర్మాణ పనులను మరింత వేగవంతం చేస్తున్నామని చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జోక్యంతో ప్రాజెక్టు పురోగతిపై ప్రత్యేక దృష్టి సారించినట్లు కోమటిరెడ్డి వెంకటరెడ్డి వెల్లడించారు. జాతీయ రహదారి-163పై ఉప్పల్-నారపల్లి మధ్య ఈ ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. సుమారు రూ.425 కోట్ల అంచనా వ్యయంతో 2018లో పనులు ప్రారంభమయ్యాయి. ప్రారంభంలో మూడేళ్లలోనే నిర్మాణాన్ని పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్దేశించినప్పటికీ వివిధ కారణాలతో ప్రాజెక్టు గడువు పలుమార్లు పొడిగించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ కారిడార్ పూర్తయితే ఉప్పల్, నారపల్లి పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్ ఒత్తిడి తగ్గడంతో పాటు తూర్పు దిశగా ప్రయాణించే వాహనాలకు గణనీయంగా ప్రయోజనం కలగనుంది. ముఖ్యంగా హైదరాబాద్ నగరాన్ని వరంగల్, భువనగిరి, జనగామ ప్రాంతాలతో పాటు బీబీనగర్‌లోని ఎయిమ్స్‌తో అనుసంధానించడంలో ఈ మార్గం కీలకంగా మారనుంది. ప్రాజెక్టు నిర్మాణాన్ని వేగవంతం చేసేందుకు జాతీయ రహదారుల ప్రాంతీయ కార్యాలయ అధికారులు, చీఫ్ ఇంజనీర్‌తో ఇటీవల ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించినట్లు మంత్రి తెలిపారు. పెండింగ్ అంశాలను పరిష్కరించి పనులకు ఎలాంటి ఆటంకాలు లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. ఇప్పటికే ప్రాజెక్టులో భాగంగా కొన్ని బీటీ రోడ్డు పునరుద్ధరణ, మరమ్మతు పనులు పూర్తయ్యాయని మంత్రి పేర్కొన్నారు. మిగిలిన నిర్మాణ పనులను సమన్వయంతో ముందుకు తీసుకెళ్లి 2027 జూన్ నాటికి ఉప్పల్-నారపల్లి ఎలివేటెడ్ కారిడార్‌ను పూర్తి చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని స్పష్టం చేశారు. ఫ్లైఓవర్ అందుబాటులోకి వస్తే ఉప్పల్-నారపల్లి మార్గంలో ప్రయాణించే వాహనదారులకు రాకపోకలు మరింత సులభతరం కావడంతో పాటు నగర తూర్పు వైపు విస్తరిస్తున్న ప్రాంతాలకు రవాణా కనెక్టివిటీ మెరుగుపడే అవకాశం ఉంది.

# గచ్చిబౌలిలో దారుణ హత్య

హైదారాబాద్, సెప్టెంబర్ 11(జనంసాక్షి) : హైదరాబాద్‌లో దారుణ హత్య వెలుగు చూసింది. రాయదుర్గం పీఎస్ పరిధిలో ఓ వ్యక్తిని దారుణంగా కత్తులతో పోడిచి హత్య చేశారు. స్థానికుల సమాచారంతో ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు.. మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పోలీసుల వివరాల ప్రకారం.. అంజయ్య నగర్‌లోని హరిహర మెన్ హాస్టల్‌లో శశిధర్(43) వంటమనిషిగా పనిచేస్తున్నాడు. అదే ప్రాంతంలోని శివబాలాజీ హాస్టల్‌లో ప్రమోద్ అనే వ్యక్తి చాఫ్‌గా పనిచేస్తున్నాడు. గురువారం రాత్రి సుమారు 9.30 గంటల సమయంలో ఇద్దరి మధ్య ఏదో విషయంపై చిన్న గొడవ జరిగింది. వివాదం తీవ్ర రూపం దాల్చడంతో ప్రమోద్ కత్తితో శశిధర్‌పై దాడి చేసినట్లు పోలీసులు తెలిపారు. కత్తిపోట్లతో తీవ్రంగా గాయపడిన శశి ధర్ అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న వెంటనే రాయదుర్గం పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. మృతుడు ఒడిశాలోని మయూ ర్భంజ్ జిల్లా డుమురియా మండలం సరాధా గ్రామానికి చెందిన శశిధర్‌గా పోలీసులు గుర్తించారు. నిందితుడిగా అనుమాని స్తున్న ప్రమోద్ స్వస్థలం బాలేశ్వర్ జిల్లా బెల్గోనియా గ్రామంగా గుర్తించారు. అసలు ఈ హత్యకు కారణం ఏమిటి? శశిధర్, ప్రమోద్ మధ్య గతంలో గొడవలు ఉన్నాయా? హత్యకు ముందు ఇద్దరి మధ్య ఏం జరిగింది? అన్న కోణాల్లో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# రైతులకు యాంత్రీకరణ పథకం

- రైతు కోరుకున్న పనిముట్టు.. నచ్చిన కంపెనీ నుంచే కొనుగోలు
- సబ్సిడీ సొమ్ము నేరుగా రైతుఖాతాకే బదిలీ
- రైతుల డిమాండ్‌కు అనుగుణంగా వ్యవసాయ యాంత్రీకరణ
- మండలిలో మంత్రి తుమ్మల సమాధానం



హైదరాబాద్, సెప్టెంబర్ 11(జనంసాక్షి) : రైతులు తమకు అవసరమైన వ్యవసాయ పనిముట్లను, తమకు నచ్చిన కంపెనీ నుంచి కొనుగోలు చేసుకునే విధంగా రాష్ట్ర ప్రభుత్వం యాంత్రీకరణ పథకాన్ని అమలు చేస్తోందని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు తెలిపారు. రైతులకు నాణ్యమైన వ్యవసాయ యంత్ర పరికరాలు అందించడంతో పాటు, వారి అవసరాలు, డిమాండ్‌కు అనుగుణంగా యంత్రాలను అందుబాటులోకి తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. శాసనమండలిలో శుక్రవారం ప్రశ్నోత్తరాల సమయంలో ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానమిచ్చారు. యాంత్రీకరణ పథకం కింద రైతులకు నాణ్యమైన, ప్రమాణాలు కలిగిన వ్యవసాయ యంత్ర పరికరాలను మాత్రమే అందిస్తున్నామని మంత్రి స్పష్టం చేశారు. తయారీదారులు, సరఫరాదారులు అందించే ఉత్పత్తులను ఫార్మ్ మెషినరీ ట్రైనింగ్ అండ్ టెస్టింగ్ ఇన్స్టిట్యూట్ లేదా కేంద్ర వ్యవసాయ శాఖ ద్వారా గుర్తింపు పొందిన సంస్థల వద్ద పరీక్షించిన తర్వాతనే రైతులకు సరఫరా చేస్తున్నామని తెలిపారు. రైతుల భద్రత, యంత్రాల నాణ్యత, పనితీరు వంటి అంశాల్లో ఎలాంటి రాజీ లేకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. యాంత్రీకరణ పథకం కింద రైతులకు అందించే పరికరాలు వారు కోరుకున్న విధంగా లభించడం లేదని, సబ్సిడీపై అందించే యంత్రాలకు, మార్కెట్లో లభించే యంత్రాలకు తేడా ఉంటుందని ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం ప్రస్తావించారు. సబ్సిడీ పరికరాలకు ఇచ్చే కొటేషన్ ధరలు, మార్కెట్ ధరల మధ్య వ్యత్యాసం ఉంటోందని పేర్కొన్నారు. డిమాండ్ ఉన్న యంత్రాలను ఎక్కువగా అందించాలని, డ్రోన్లను కూడా అధిక సంఖ్యలో అందించాలని కోరారు. దీనిపై మంత్రి తుమ్మల స్పందిస్తూ, ఎమ్మెల్సీ ప్రస్తావించిన అంశాలు గతంలో ఉన్న పరిస్థితులకు సంబంధించినవని, ప్రస్తుతం ఆ విధానం లేదని స్పష్టం చేశారు. రైతులు తమకు నచ్చిన పనిముట్టను, తమకు నచ్చిన కంపెనీ నుంచి కొనుగోలు చేసుకునే విధంగా ప్రస్తుత యాంత్రీకరణ విధానాన్ని రూపొందించామని తెలిపారు. గత ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న నిధులను వినియోగించుకోకుండా యాంత్రీకరణ పథకాన్ని నిలిపివేసిందని మంత్రి తుమ్మల తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని యాంత్రీకరణ పథకాన్ని పునరుద్ధరించి తిరిగి అమలులోకి తీసుకొచ్చిందన్నారు. వ్యవసాయంలో యాంత్రీకరణ పెరగడం ద్వారా రైతులపై శారీరక శ్రమ తగ్గడంతో పాటు, సాగు ఖర్చులు తగ్గి, సమయానికి వ్యవసాయ పనులు పూర్తయ్యే అవకాశం ఉంటుందని మంత్రి పేర్కొన్నారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో యాంత్రీకరణ పథకం కోసం ప్రభుత్వం రూ.71 కోట్లు కేటాయించగా, రూ.63.11 కోట్లు ఖర్చు చేసి 15,565 వ్యవసాయ యంత్ర పరికరాలను రైతులకు సరఫరా చేసినట్లు మంత్రి వివరించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో యాంత్రీకరణ పథకానికి రూ.147.91 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. రైతుల డిమాండ్‌ను అనుగుణంగా, అవసరమైన వ్యవసాయ యంత్ర పరికరాలను యాంత్రీకరణ పథకం కింద సరఫరా చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at Flat No. 301, 8-2-273, 276 & 277, 3rd Floor,Pavani Estate, Indradhanush Complex,Road No. 2, Banjara Hills,Hyderabad – 500034, Telangana, Editor : M.M.RAHMAN RNI No. APTEL/2013/50370